

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

30-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 211 పేజీలు: 16 వెల: 8.00


**ఉద్యోగం పోతే అమెరికాను వీడాల్సిందే**

**నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ గల్లంతు**

5లో

# పంచసూత్ర ప్రణాళిక

## గిరిజనుల అభివృద్ధికి

### ప్రయోగాత్మకంగా సంజీవని పథకం ప్రారంభించిన సిఎం చంద్రబాబు

### పేదరికం లేని గిరిజన కుటుంబాలే లక్ష్యం

### జిఒ నం.3కి ప్రత్యామ్నాయం త్వరలోనే..




శనివారం గన్నెల పంచాయితీ కేంద్రంలో ఏర్పాటు చేసిన 'సంజీవని' పథకం ప్రారంభ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**పాడేరు/అరకులోయ, ఆగస్టు29,ప్రభాతవర్త:** అల్లూరి సీతా రామరాజు జిల్లాలోపవిత్రమైన సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని..మంచి ప్రదేశం..ఎంత ఆహ్లాదకరమైన ప్రదేశం అంటే కొత్త శక్తి...ఉత్సాహం వస్తుంది..ఇటు చూసినా పచ్చదనం..ఇటుచూసినా కొండలు..స్వచ్ఛమైన గాలి.. వాతావరణం ఈ ప్రాంతం సొంతం..ఇటువంటి ప్రాంతంలో పవిత్రమైన సంజీవని ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.అరకువ్యాలీ మండలం గన్నెల పంచాయితీ కేంద్రం గిరిజన ప్రాంతంలో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న 'సంజీవని' పథకం ప్రారంభోత్సవ సభ అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుయుడు గిరిజనులను ఉద్దేశించి ప్రసంగించారు. గిరిజన ప్రాంతాల ప్రజలు పాపులేషన్ మేనేజ్మెంట్‌లో కూడా ముందున్నారనీ ఇది అభినందనీయమన్నాడు.. పిల్లలే మనసంపద అనే సిద్దాంతాన్ని మన గిరిజన ప్రజలు ఆచరిస్తున్నారనీ ఇది గర్వకారణ మని సిఎం అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదన్నదే మా ఆలోచన గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జిఒ నంబర్ 3 మేమే తీసుకువచ్చామణి సిఎం గుర్తు చేశారు. గత పాలకులు నిరక్ష్యంతో సుప్రీం కోర్టు దానిని రద్దు చేసిందన్నారు.ఈ అంశంపై అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలోనే తీసుకువస్తామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఐదు సూత్రాలతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు చేశామన్నాడు.అడవితల్లి బాట పేరుతో రూ.1000 కోట్లతో 900 కిలోమీటర్ల రహదారులు వేశామన్నారు.1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు, సోలార్ రూఫ్ టాప్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పెరిగేలా అరకుకాఫీని మరో లక్షఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు.అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగింది. హోమ్ స్టేల ద్వారా ఆతిథ్యం ఇస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుందన్నారు. మన ప్రాంతానికి వచ్చే పరిశ్రమల్లో గిరిజన యువత ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తామన్నాడు. వచ్చేమూడేళ్లలో లక్షమంది యువతకు నైపుణ్యశిక్షణ కల్పించాలన్నదే మా ఆలోచన అన్నారు. అత్యవసర వైద్య సేవలను అందించేందుకు జిల్లాలో >>2



## తాష్కెంట్‌లో ప్రధాని మోడీ

### ప్రోటోకాల్ పక్కనపెట్టి ఎయిర్‌పోర్టులో మోడీకి స్వాగతం పలికిన అధ్యక్షుడు

### అనంతరం ఒకే కారులో ఇరువురు అధినేతల ప్రయాణం

**తాష్కెంట్, ఆగస్టు 29:** ప్రధాని మోడీ రెండు రోజుల పర్యటన కోసం శనివారం ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌కు చేరుకున్నారు. అక్కడ ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ స్వయంగా విమానాశ్రయానికి చేరుకుని మోడీకి ఘన స్వాగతం పలికారు. భారత్ ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మోడీ ఈ పర్యటన చేపట్టారు. తాష్కెంట్ చేరుకున్న అనంతరం ప్రధాని మోడీ ఎక్స్‌వేదికగా స్పందిస్తూ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయన చూపించిన ప్రత్యేక ఆతిథ్యానికి కృతజ్ఞతలు. ఉజ్బెకిస్థాన్‌కు ఇది నా నాలుగో పర్యటన. ఇది ఇరు దేశాల మధ్య సంబంధాల లోతు, వాటిలో పెరుగుతున్న వేగానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ, అధ్యక్షుడు మిర్జియోయెవ్‌తో ప్రతినిధుల స్థాయి చర్చలు జరపనున్నారు. ఇరు దేశాలమధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టి >>2



శనివారం శ్రీకాకుళంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామ్మోహన్ నాయుడు

## చెంచుల అభివృద్ధికి చర్యలు

### రూ. 8 లక్షల బ్యాంక్ రుణాల చెక్కును వారికి అందించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, ఆగస్టు 29 ప్రభాతవార్త :** గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడూ కట్టుబడి ఉన్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో చెంచు తెగకు సంబంధించిన జిల్లా సంఘం ఉన్నతి సభ్యులకు సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజ్ రుణం 8లక్షల రూపాయల చెక్కును అందించారు. చెంచు వృత్తి చేసుకునేవారు వారి సాంప్రదాయ వస్త్రాలను కొనుగోలు చేసేందుకు, ఇతర అవసరాల కోసం ఈ మొత్తాన్ని వినియోగించుకోవాలని కోరారు. కేంద్ర మంత్రి ఆదేశాల ప్రకారం ఉన్నతి సంఘం సభ్యులకు 8 లక్షల రూపాయల బ్యాంక్ లింకేజ్ రుణం చెక్కులు శనివారం అందజేశారు. వడ్డీ లేకుండా ఈ మొత్తం వస్తూ ఉండటంతో దీనిపై ఉన్నతి సంఘం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రామ్మోహన్ నాయుడు కృషికి ధన్యవాదాలు తెలిపారు.

**కీలక అభివృద్ధి ప్రాజెక్టులపై సమీక్ష :**

శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఇటీవల చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ కంపెనీల సిఎస్ఆర్ నిధులతో చేపడు >>2

## వడివడిగా ఇన్నర్ రింగ్‌రోడ్డు

### శిల్పారామం-పెదపలకలూరు వరకు 4.25 కి.మీ రహదారి నిర్మాణం : కేంద్రమంత్రి పెమ్మసాని



**విజయవాడ,ఆగస్టు 29, ప్రభాతవార్త ప్రతినిధి:** శిల్పారామం- పెద పలకలూరు వరకు చేపడుతున్న మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 రహదారి అభివృద్ధి పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్థానిక నాయకులతో కలిసి పనుల పురోగతిని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ:.. శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు సుమారు 4.25 కిలోమీటర్ల మేర ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ -3 పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టును గతంలోనే ప్రారంభించాలనే ఆలోచన ఉన్నప్పటికీ, వైసీపీ హయాంలో పనులు ముందుకు సాగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్థానిక నాయకుల సహకారంతో రహదారి పరిధిలోని ఆక్యుపెంట్లను రిహాబిలిటేట్ చేసి, సమస్యలను పరిష్కరించి పనులకు మార్గం సుగమం చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఈ పనులకు రూ.48 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించేందుకు వచ్చామని, పనుల్లో ఎదురవుతున్న సమస్యలను కూడా సంబంధిత అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు. రహదారి నిర్మాణంలో కొన్ని ప్రాంతాల్లో హైట్ పెరగడంతో హైటెన్స్ వైర్‌ను మార్చాల్సిన అవసరం ఏర్పడిందని, ఇందుకు అదనంగా సుమారు రూ. 2 నుంచి 3 కోట్ల వ్యయం అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అదేవిధంగా ఎన్ఎస్‌పి కెనాల్ క్రాసింగ్స్ వద్ద భవిష్యత్తులో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా అదనపు కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉందని, ఒక్కో కల్వర్టుకు సుమారు రూ.10 నుంచి రూ. 15 లక్షల అదనపు వ్యయం అవుతుందని తెలిపారు.భవిష్యత్తులో సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రస్తుత ప్రాజెక్టులోనే వీలైనంత వరకు ఈ అదనపు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

**పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరణకు ప్రతిపాదన**

ప్రస్తుత ఇన్నర్ రింగ్ రోడ్‌ను భవిష్యత్తులో కొత్తగా నిర్మించనున్న రైల్వే వోవరుబ్రిడ్జిమీదుగా పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని డా.పెమ్మసాని తెలిపారు. ఈ విస్త >>2



## నేపాల్‌కు తొలగని ముప్పు!

### మరో రెండు హిమానీనదుల నుంచి వరదలు!

### 700 దాటిన మృతులు, 2500 మందికి పైగా ఆచూకీ గల్లంతు

**కఠ్మాండు, ఆగస్టు 29:** నేపాల్‌లో వరదల నుంచి కోలుకోక ముందే మరో షాకింగ్ విషయం వెలుగు వచ్చింది. ప్రమాదానికి కారణమైన భోటే కోషి త్రిశూలి నదీ వ్యవస్థ సమీపంలోనే మరో రెండు హిమానీనద సరస్సులు ఏర్పడ్డాయని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధిపతి కృష్ణ వాట్సా తెలిపారు. అయితే వీటి నుంచి ఎంత మేర వరదనీరు బయటకు వచ్చే అవకాశం ఉందన్న దానిపై ప్రస్తుతం స్పష్టమైన అంచనాలు లేవని ఆయన వెల్లడించారు. ఒక సరస్సు 19.80 హెక్టార్లు, మరొకటి 7.28 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నట్లు పేర్కొన్నారు. సరస్సుల్లోని నీటి పరిమాణంపై ఇప్పటివరకు ఎలాంటి అంచనా లేదని ఆయన చెప్పుకొచ్చారు. అయితే అక్కడ హిమానీనదాలు కదులుతున్నప్పుడు పేరుకుపోయే రాళ్లు, మట్టి, ఇతర శిథిలాల కుప్పలు ఉన్నాయని కృష్ణ వాట్సా వెల్లడించారు. నేపాల్‌లో ఏర్పడిన ఈ సహజ సరస్సుల పరిస్థితిని భారత్ నేరుగా పరిశీలించే అవకాశం పరిమితంగా ఉండటంతో నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సహజంగా ఏర్పడే ఇలాంటి సరస్సులు భవిష్యత్తులో ఎలా మారతాయో పూర్తిగా అంచనా వేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. మరోవైపు, ఇదే ప్రాంతంలో కొత్తగా ఏర్పడిన సరస్సును నోయిడాకు చెందిన సుహోరా టెక్నాలజీస్ గుర్తించింది. ఆగస్టు 27న తీసిన అత్యంత >>2

## స్థానిక పోరుకు జనసేన సిద్ధం



### యువత, మహిళా సాధికారత పార్టీ ప్రధాన అంశాలు

### జనసైనికుల ఆత్మగౌరవం నిలబెట్టేలా ఎన్నికలు: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నెల రోజులపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అనుసరించాల్సిన ప్రణాళికను పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పార్టీ పవన్ కల్యాణ్ సిద్ధం చేశారని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖమాత్యులు, జెస్పీ పిఎసి ఛైర్మన్‌నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దీన్ని మనమంతా తు.చ. తప్పకుండా పాటించాలి. ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానిక సంస్థలఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే నాయకులకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వనని చెబుతున్న జగన్మోహన్ రెడ్డి 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఏకగ్రీవాల కోసం చేయని ఆకృత్యం లేదన్నారు. వ్యవస్థలను, అధికారాన్ని అడ్డం పెట్టుకొని 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీని టార్గెట్ చేశారని చెప్పారు. అప్పట్లో సిద్ధం చెప్పినవ్యక్తే... నేడు యుద్ధంఅంటున్నారని అన్నారు. జనసేనపార్టీ ఎప్పుడూ యుద్ధానికి సిద్ధమని తేల్చి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం శుక్రవారం మంగళగిరిలో జరిగింది. సమావేశంలో 2021లో జనసేన పార్టీ తరపున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో ఉన్నవారిని పవన్ కళ్యాణ్ సూచనల మేరకు సమావేశం ప్రారంభంలోనే ఆత్మీయంగా మనోహర్ సన్మానించారు. 1000 మందికి సభావేదికపై సన్మానాలు చేశారు. అనంతరం జరిగినసమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అప్పట్లో పవన్ కల్యాణ్ >>2

## తెలుగులోనే ఇక ఉత్తర్వులు

### - సమాచార కమిషనర్ గాజుల ఆదెన్న



**విజయవాడ,ఆగస్టు29, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ తెలుగు భాషావేత్త, వ్యావహారిక భాషోద్యమ నాయకుడు, సంఘ సంస్కర్త గిడుగు వేంకట రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ప్రతి యేటా ఆగస్ట్ 29 న మనం నిర్వహించుకునే తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ గాజుల ఆదెన్న తన పరిధిలోని ఆర్టీఐ అర్జీదారులకు, అధికారులకు, ప్రజలకు మరింత చేరువయ్యే కీలక నిర్ణయం తీసుకున్నారు. సమాచార హక్కు చట్టం అర్జీదారులకు, అధికారులకు సంబంధించిన ఆర్టీఐ కేసులపై తన పరిధిలో జారీ చేసే తీర్పుల ఉత్తర్వులను సామాన్య పౌరులకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలుగులో అందించేందుకు నిర్ణయించారు.ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు, ఉత్తర్వులు వారికి అర్థం కాని భాషలో ఉంటే, తమ కేసులో అసలు ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే ప్రజలకు సంబంధించిన ఉత్తర్వులు మన తెలుగు మాతృభాషలో అందుబాటులో ఉండటం ద్వారా న్యాయం, పారదర్శకత అర్జీదారులు, అధికారులు, ప్రజలకు మరింత చేరువవుతాయని గాజుల అదెన్న పేర్కొన్నారు. కమీషన్ ఇచ్చే తీర్పుల >>2

## ఎంబిబిఎస్, బిడిఎస్ ఫీజులు 10% పెంపు

**విజయవాడ, ఆగస్టు29, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వైద్య విద్యా కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రభుత్వ ప్రకటించింది. తొలి విడత కౌన్సెలింగ్ నిర్వహణకు దీనితో మార్గం సుగమమైంది. గతేడాదితో పోలిస్తే ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సులకు 10 శాతం, పిజి మెడికల్ కోర్సులకు 15 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ ఆదేశాలిచ్చారు.ఎంబిబిఎస్ కన్వీనర్ కోటా ఎకేటగిరి రూ. 18,150, బి కేటగిరి (మేనేజిమెంట్ కోటా) రూ.14.52 లక్షలు, సికేటగిరి (ఎన్నారై కోటా) రూ.43.56 లక్షలు ఫీజులను నిర్ణయించారు. బిడిఎస్ కన్వీనర్ కోటా ఎకేటగిరి రూ.15,730, బికేటగిరి రూ.4.84లక్షలు, సి కేటగిరి రూ.14.52 లక్షలుగా నిర్ణయించారు. మెడికల్ పీజీ కోర్సులకు క్లినికల్ డిగ్రీ ఎకేటగిరి రూ.5,71,320, బి కేటగిరి రూ.11,42,640, సికేటగిరి రూ.66,12,500, పారాక్లినికల్ డిగ్రీ, డిప్లమో ఎకేటగిరి రూ.1,78,538, బికేటగిరి రూ.3,57,075, సికేటగిరికి రూ.19,83,750. ప్రీ క్లినికల్ డిగ్రీ ఎ కేటగిరి రూ.80,937, బికేటగిరి రూ. 1,61,874, సికేటగిరి రూ.10,58,000గా నిర్ణయించారు.డెంటల్ క్లినికల్ పిజి డిగ్రీ ఎ కేటగిరి రూ. 3,92,783, బికేటగిరి రూ.7,85,565, సికేటగిరి రూ.15,87,000గా నిర్ణయించారు పారా క్లినికల్ డెంటల్ పిజి ఎ కేటగిరి రూ.3,53,504, బికేటగిరి రూ.5,74,759, సికేటగిరి రూ. 9,25,750 నిర్ణయించారు. సూపర్ స్పెషాలిటీ కోర్సులకు జీఎస్ఎల్, కస్తూరి, నారాయణ,ఎన్నారై, డాక్టర్ సిద్దార్థ మెడికల్ కళాశాలల్లో రూ.19,83,750 ఫీజు ఉంటుందని ఉత్తర్వులో తెలిపారు. ఈ మేరకు మూడు వేర్వేరు జీవోలను విడుదల చేశారు.



శనివారం విజయవాడలో తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

## తెలుగు భాష పరిరక్షణకు ప్రాధాన్యం

### వచ్చే నెల మొదటి వారంలో నంది నాటకోత్సవాలపై కీలక ప్రకటన

### ఘనంగా గిడుగు జయంతి, తెలుగుభాషా దినోత్సవాలు

### 19 మందికి తెలుగు భాషా పురస్కారాల ప్రదానం

**విజయవాడ,.ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** సెప్టెంబర్ మొదటి వారంలో నంది నాటకోత్సవాల నిర్వహణపై కీలక ప్రకటన చేస్తామని, యేడాదిలోనే వీటిని కూటమి ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహిస్తుందని సాంస్కృతిక శాఖమంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు. విజయవాడ డా. బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు 163వ జయంతి (తెలుగు భాషా దినోత్సవం) వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ 19 మంది ప్రముఖులకు తెలుగు భాషా పురస్కారాలు-2026 అందజేశారు. పురస్కార గ్రహీతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపికతోపాటు రూ. 25,000 నగదు బహూకరించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రజలు మాట్లాడే భాషకు విద్యా సాహిత్య రంగాల్లో సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేసిన గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘన >>2



శనివారం ప్రయాగ్‌రాజ్‌లో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన లోతైన గుంతలో స్వామి నారాయణ ఆలయ ప్రాంగణంలోని కొంతభాగం కూలిపోయిన తర్వాత అక్కడ మిగిలిన శిధిలాల దృశ్యం

# నేపాల్‌కు తొలగని ముప్పు!

>> స్పష్టమైన ఉపగ్రహ చిత్రాల్లో ఆ సరస్సు నేపాల్‌టిబెట్ సరిహద్దుకు సమీపంలోని ఎత్తైన లెండే ఖోలా ప్రాంతంలో ఉన్నట్లు సంస్థ తెలిపింది. సుమారు 20.25 హెక్టార్ల విస్తీర్ణంలో కొత్త నీటి మడుగు కనిపించిందని సుహోరా పేర్కొంది. ఈనెల 26న సంభవించిన వరదలతో ఈ కొత్త సరస్సు పరిణామాన్ని నిశితంగా గమనించాల్సిన అవసరం ఉందని చెప్పింది. దాని విస్తీర్ణం, స్థిరత్వాన్ని ఉపగ్రహ చిత్రాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పుకొచ్చింది.

నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. వరదల కారణంగా మృతుల సంఖ్య 700 దాటింది. మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ ఎస్పీ రమేశ్వర్ పౌడెల్ తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**కుటుంబ సభ్యులకు ఫొటోలు చూపించి గుర్తింపు**

గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముఖం గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, డిఎన్‌ఎ నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాలను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగపడతాయి. కాస్కీ జిల్లా పోలీస్ చీఫ్ నబిన్ కార్కీ ప్రకారం, బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్‌ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# పంచసూత్ర ప్రణాళిక

>> 150 వాహనాలతో ఎమర్జెన్సీ లైఫ్‌లైన్ నెట్‌వర్క్ ఉండనుంది. ప్రతి గిరిజన బిడ్డ అందరిలా ఆరోగ్యంగా ఎదగాలి..అందుకే సంజీవని తెచ్చామన్నారు.గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. అదే నిజమైన అభివృద్ధి అన్నట్లు.గిరిజన ప్రాంతాలకు మంచి వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్ తెస్తున్నామన్నారు. సికిల్ సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10,000 పెన్షన్ అందిస్తున్నామని,గిరిజన బిడ్డలు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదవాలి. అందుకే ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు.

గిరిజన రైతులు తమ ఉత్పత్తితో ప్రపంచ స్థాయి బ్రాండ్ సృష్టించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన సీఎం చంద్రబాబు అన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో తక్కువ ధరకే మందులు ఇచ్చే జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని ఆయన అన్నారు. 104 సర్వీసుల ద్వారా మీ ఇంటి దగ్గరే 42 రకాల వైద్య పరీక్షలు చేసి మీకు అవసరమైన మందులు ఇస్తారు.సెప్టెంబరు 2 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి నీరు తీసుకువస్తున్నామన్నారు.తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే డీఎస్సీ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇచ్చామని తొలి సంతకంతో 16 వేల ఉద్యోగాలు ఇస్తే దీని పోని ఆరోపణలు చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వ్యవస్థల్ని అస్తవ్యస్తం చేశారు. జే బ్రాండ్ ద్వారా, కల్తీ మద్యం ద్వారా కొన్ని వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. అందరి ఆరోగ్యాన్ని నాశనం చేశారు. జే బ్రాండ్లను రద్దు చేసి మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామన్నారు.

గతంలో గంజాయి ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో చెడ్డ పేరు తెచ్చారని ఇప్పుడు దానిని మార్చేలా కాఫీ, మిరియాలు లాంటి ప్రత్యామ్నాయ పంటల ద్వారా గిరిజనులకు ఆదాయ మార్గాలు చూపామన్నారు. గ్రూప్ 1 పరీక్షల్లోనూ గత పాలకులు అవకతవకలు చేశారని సీఎం ఆరోపించారు.ఆర్టీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే పరీక్ష పత్రాలను ఓ ఎలక్ట్రీషియన్, ఓ అటెండర్ చేత దిద్దించారు. గ్రూప్ 1 పరీక్షలు రాసిన అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారు. గత పాలనలో దేవాలయాల ప్రతిష్టను కూడా దెబ్బతీశారు. బలవంతపు మత మార్పిడులు చేశారు. ఓ మాజీ మంత్రి కోడలు కూడా బయటకు వచ్చి ఇంట్లో జరిగిన ఘటనల్ని బయటపెట్టిందన్నారు.బలవంతంగా మతమార్పిడి చేయించే ప్రయత్నం చేశారని చెప్పిందని చంద్రబాబు గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్, 15వ ఆర్థిక సంఘం, ప్రధాన ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ల కింద 1,200 కోట్లతో 4,500 ఆరోగ్య మందిర నిర్మాణాన్ని వేగవంతం చేశామన్నారు.

గిరిజన గ్రామాల నుంచి రక్తం, థైరాయిడ్, కామెర్ల తదితర పరీక్షల శాంపిల్స్‌ను చింతపల్లి, పాడేరు వంటి దూర ప్రాంతాలకు తీసుకెళ్లే అవసరం లేకుండా నేరుగా గ్రామాలకే ఆసుపత్రి సేవలందించేందుకు డ్రోన్ సాంకేతికతను అనుసంధానించామని చెప్పారు. డ్రోన్ల ద్వారా శాంపిల్స్ సేకరించి, పరీక్షలు నిర్వహించి, డిజిటల్ రిపోర్టులను నేరుగా గిరిజనుల వాట్సాప్‌కే పంపే దిశగా ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం దశలో వాహనాల స్థానంలో 500 కొత్త బ్రాండ్ న్యూ 'తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను ఐటీడీఏ ప్రారంభించినట్లు తెలిపారు. సకల సౌకర్యాలతో కూడిన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి,జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, ఆర్టీసీ చైర్మన్‌దొన్ను దొర,జిసిసి చైర్మన్ కిడారీ శ్రావణ్ కుమార్, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ,వివిధ శాఖల అధికారులు,టిడిపి ప్రజాప్రతినిధులు,వేలాది సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

# వడివడిగా ఇన్నర్ రింగ్‌రోడ్డు

>> రణ పూర్తయితే పల్నాడు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు ఇన్నర్ రింగ్ రోడ్ ద్వారా నేరుగా అమరావతికి మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ అదనపు విస్తరణకు సుమారు రూ.15 నుంచి 20 కోట్ల అదనపు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నామని, ఇందుకు ముఖ్యమంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు తెలిపారు. అయితే ఈ అదనపు పనులకు ఇంకా ఆమోదం లభించలేదని స్పష్టం చేశారు. రహదారికి అవసరమైన డ్రైనేజ్ కవర్లు, సెంటర్ లైటింగ్ వంటి అదనపు సదుపాయాలకు కూడా అదనపు అంచనాలు అవసరమవుతున్నాయని పేర్కొన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ అభివృద్ధి పూర్తయిన వెంటనే చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ఇప్పటికే గత ఐదు ఆరు నెలల్లో కొత్త అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలు రావడం ప్రారంభమయ్యాయని, దీంతో ఈ ప్రాంతంలోని భూముల విలువలు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో అభివృద్ధి కార్యకలాపాలు మరింత పెరిగితే గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం పెరగడంతో పాటు సిఆర్‌డిఎ ద్వారా కూడా మరిన్ని అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు సహకారంతో, కార్పొరేషన్ మరియు సిఆర్‌డిఎ వనరులను సమన్వయం చేసుకుంటూ ఇన్నర్ రింగ్ రోడ్‌ను సాధ్యమైనంత అద్భుతంగా పూర్తి చేసి, గుంటూరు నగరంతో పాటు అమరావతి, పల్నాడు ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు కృషి చేస్తామని డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.



శనివారం చంద్రబాబు 'సంజీవని' పథకం బహిరంగ సభకు భారీగా తరలి వచ్చిన ప్రజలు

# రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో నలుగురు ఉద్యోగులు డిస్మిస్

**విజయవాడ,ఆగస్టు 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో పెను సంచలనం చోటు చేసుకుంది. అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో అప్పటి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ (స్టేట్ టాక్స్) కె.సంధ్య, గూడ్స్ సర్వీసు టాక్స్ అధికారి బి.మెహర్ కుమార్, సీనియర్ ఆసిస్టెంట్ కె.వి.చలపతిలను సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువరించింది. వాణిజ్య పన్నుల శాఖ విజయవాడ1 డివిజన్, జాయింట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులు) కార్యాలయంలోని ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన సమయంలో 2023లో ఈ అధికారులు, సిబ్బంది అవినీతి బయటపడింది. వీరిని ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేస్తూ రెవెన్యూ విజిలెన్స్ శాఖ ముఖ్యకార్యదర్శి పియూష్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు.

# తెలుగులోనే ఇక ఉత్తర్వులు

>> వ్యవహారాల్లో ఆంగ్ల భాషకు అధిక ప్రాధాన్యత ఉండటంతో సామాన్య ప్రజలు, అర్జీదారులు తమ కేసులకు సంబంధించిన తీర్పులు, ఉత్తర్వులను స్వయంగా చదివి అర్థం చేసుకోవడం అనేక సందర్భాల్లో కష్టంగా మారుతోందని, ఈ నేపథ్యంలో తెలుగు భాషలో ఉత్తర్వులు అందుబాటులోకి వస్తే, నా కేసులో ఏం జరిగింది? ఏ నిర్ణయం తీసుకున్నారు? అధికారులకు ఏ ఆదేశాలు ఇచ్చారు? అనే విషయాలను అర్జీదారులు స్వయంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని గాజుల అదెన్న అన్నారు.ఇది కేవలం భాషకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, పారదర్శకత, జవాబుదారీతనం, పౌర సాధికారతకు సంబంధించిన అంశమని గాజుల ఆదెన్న పేర్కొన్నారు. ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగులో మాట్లాడతాం.. మన తెలుగు భాషను కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేయించాలని గాజుల ఆదెన్న విజ్ఞప్తి చేశారు. ఇతర భాషలు నేర్చుకుందాం.. కానీ తెలుగును మరిచిపోవద్దు తెలుగు భాషలో పుట్టి పెరిగిన మనమే నేడు ఆంగ్ల భాషకు అధిక ప్రాధాన్యత ఇస్తూ మాతృభాషను విస్మరిస్తున్న పరిస్థితి బాధాకరమని గాజుల ఆదెన్న అన్నారు.

ఇటీవల కొన్ని ఉత్తర్వులను తెలుగులో ఇచ్చామన్నారు. అప్పీలు సంఖ్య 2263/ఎస్ ఐ సిజి ఏ/ఏపీ ఐ సి/2025లో అప్పీలుదారు తన అప్పీలును ఉపసంహరించుకున్నట్లు తెలియజేయడంతో అప్పీలును ముగిస్తూ తెలుగులో తీర్పును ఇచ్చారు. అదేవిధంగా అప్పీలు సంఖ్య 7366/టి ఎస్ ఐ సి/2018/టి సి6626/2021లో అప్పీలుదారు కోరిన సమాచారంపై పిఐఒకు ఆదేశాలు జారీ చేసి, అనంతరం సమాచారం అందించినట్లు సమర్పించిన పత్రాలను పరిశీలించిన తరువాత అప్పీలును ముగిస్తూ తెలుగులోనే తీర్పును ఇచ్చారు.ఈ ఉత్తర్వులు తెలుగులో అందుబాటులో ఉండటం వల్ల సమాచార హక్కు కోసం పోరాడుతున్న సామాన్య పౌరులు తమ కేసులో తీసుకున్న నిర్ణయాన్ని ఎటువంటి అనువాదం లేదా ఇతరుల వివరణ అవసరం లేకుండా స్వయంగా చదివి తెలుసుకునే అవకాశం పొందుతున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాష అమలు కోసం తన వంతుగా కృషి చేస్తానని ఆయన అన్నారు.

# తాష్కెంట్‌లో ప్రధాని మోడీ

>> విటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలపై చర్చించే అవకాశం ఉంది. భవిష్యత్‌లో భారత్ -ఉజ్బెకిస్థాన్ సహకారాన్ని మరింత విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళికపై కూడా ఇరువురు నేతలు చర్చించనున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో భారత్-ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో గణనీయమైన పురోగతి సాధించామనిమోడీ అన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారాన్ని మరింత పెంచడంపై మిర్జియోయెవ్‌తో చర్చలు జరుపుతామని తెలిపారు. వికసిత్ భారత్, యాంగీ ఉజ్బెకిస్థాన్ లక్ష్యాల విషయంలో ఇరు దేశాల ఉమ్మడి దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లం దుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తాష్కెంట్ చేరుకున్న అనంతరం మోడీ యాంగీ ఉజ్బెకిస్థాన్ పార్క్‌ను సందర్శించారు. అక్కడి స్వాతంత్ర్య స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళుల ర్పించారు. అధ్యక్షుడు మిర్జియోయెవ్ కూడా మోడీ వెంట ఉన్నారు. ఉజ్బెకిస్థాన్ స్వాతంత్రం సాధించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈస్మారకాన్ని ఏర్పాటుచేశారు.

మోడీ తనపర్యటనలో భాగంగా తాష్కెంట్లోని శాస్త్రి స్మారకాన్ని, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్థాన్‌లో రెండు రోజుల పర్యటనను ముగించుకున్న అనంతరం 30న ప్రధాని మోడీ కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు వెళ్లనున్నారు. అక్కడ జరిగే 26వ షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొంటారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఈ సదస్సు జరగనుంది. ఎస్‌సిఓ ఏర్పాటై 25 యేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ సమావేశం జరుగుతోంది. భారత్ 2017 నుంచి ఎస్సీవోలో పూర్తి స్థాయి సభ్యదేశంగా కొనసాగుతోంది. ఎస్‌సిఓ సదస్సులో భారత్ తన భద్రత, కనెక్టి విటీ, అవకాశాలు అనే దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుందని మోడీ తెలిపారు. ఉగ్ర వాదం, వేర్పాటువాదం, తీవ్రవాదానికి తావులేని ప్రాంతం కోసం సభ్యదేశాలతో కలిసి పనిచేయడమే భారత్ లక్ష్యమని పేర్కొన్నారు. బిష్కెక్‌లో కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదీర్ జపరోవ్‌తో మోడీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. ఇతర ఎస్సీవో దేశాల నేతలతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అలాగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలోనూ ప్రధాని పాల్గొననున్నారు.

# చెంచుల అభివృద్ధికి చర్యలు

>> తున్న పలు ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షలో వివిధ శాఖల అధికారులు, గుత్తేదారులు, పలు ప్రాజెక్టుల అధికారులు భాగస్వామ్యం అయ్యారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ నిధులతో శ్రీకాకుళం నగరంలో గుణపాలెం, హడ్కో కాలనీ, ఎపిజె అబ్దుల్ కలాం పార్క్, ఆర్కె నగర్ పార్క్‌ల ప్రస్తుత స్థితిని అడిగి తెలుసుకున్నారు. కోల్ ఇండియా సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో ఇచ్ఛాపురం, పాతపట్నంలలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంలు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో జిల్లా కేంద్ర లైబ్రరీ నిర్మాణ పనులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో ఆముదాలవలస, మందసలలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంల గురించి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ సబ్సిడీ కార్యక్రమాలు, బ్యాంక్ రుణాలు, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను సమన్వయం చేసుకుని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పూర్తి తోడ్పాటు అందివ్వాలని స్పష్టం చేశారు. కొత్త పారిశ్రామిక వేత్తలను తయారు చెయ్యడం, వ్యాపారంపై అవగాహన కల్పించడం, ఉపాధి అంటే ఉద్యోగమే కాదు అనే అపోహను యువతలో తొలగించడం అనే అంశాలను ఎంచుకుని భవిష్యత్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురానున్నట్టు రామ్మోహన్ నాయుడు తెలిపారు. అరసవల్లి పుష్కరిణీ అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. కోడి రామ్మూర్తి స్టేడియం ఫేజ్ 1 పనుల గురించి ఆరా తీశారు. ఇవి డిసెంబర్ 31తేదీకి పూర్తి చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, శిక్షణ కలెక్టర్ హరి ఓం పాండియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేపాల్ వెళ్లిన 13 మంది ఆంధ్రప్రదేశ్ వాసుల ఆచూకీ గల్లంతు

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** నేపాల్,టిబెట్ వరదల్లో మృతుల సంఖ్య పెరుగుతోంది. నేపాల్ -టిబెట్ సరిహద్దు ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్న వరదల్లో మృతుల సంఖ్య 633కు చేరింది. మరో 3 వేలమంది గల్లంతైనట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. గల్లంతైన వారిలో 517 మంది విదేశీయులు ఉండగా, వారిలో 320 మంది భారతీయులు ఉన్నట్లు గుర్తించారు. నేపాల్ పర్యటనకు వెళ్లిన 13 మంది ఆంధ్రప్రదేశ్ వాసుల ఆచూకీ గల్లంతయ్యారు. ఇప్పటివరకు వరదల నుంచి 3,700 మందిని సహాయ సిబ్బంది రక్షి ంచారు. సహాయ చర్యల్లో 11 వేల మంది భద్రతా సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. విదేశీ బృందాల సాయంతో నేపాల్ ప్రభుత్వం సహాయ చర్యలను ముమ్మరం చేసింది. నేపాల్ వరద బాధిత ప్రాంతాలకు సహాయ సామగ్రిని భారత్ పంపిస్తోంది.

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం

>> పిలుపు మేరకు యువత, మహిళలు ముందుకు వచ్చి కష్టాల కోర్చి ఎన్నికల్లో నిలబడి, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టారు. స్థానిక ఎన్నికల్లో నిలబడ్డాం.. కలబడ్డాం.. జనసేన పార్టీ బలం గురించి మాట్లాడే ప్రతి ఒక్కరికీ చెబుతున్నదొక్కటే. మేం లొంగిపోలేదు. పోటీకి గైర్హాజరు కాలేదు. మేం నిలబడ్డాం. కలబడ్డాం. ప్రజాస్వామ్యాన్ని బతికించుకునేందుకు కదం తొక్కాం. పవన్ కల్యాణ్ పోరాట స్ఫూర్తి మనం అందిపుచ్చుకున్నాం. అదే స్ఫూర్తి నేడు రాష్ట్రంలో అద్భుతమైన పరిపాలన తీసుకొచ్చింది. వైసీపీని అధఃపాతాళానికి తొక్కుతామని, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేస్తామని చెప్పిన మాటను ప్రజలు నిజం చేశారు. ఆశీర్వదించారు. ఉద్దానం నుంచి ఇసుక కొరతతో ఇబ్బందులుపడుతున్న భవన నిర్మాణ కార్మికుల కోసం, మత్స్యకారుల జీవనానికి శాపంగా నిలిచిన 217 జీవో రద్దు చేయాలని మత్స్యకార భరోసా యాత్ర చేసిన అండగా నిలిచాం. రోడ్ల సమస్య మీద కానీ, ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు సహాయం చేసే విషయంలోగానీ జనసేన పార్టీ రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లింది. రాబోయే రోజుల్లో ఎలా స్థానిక సంస్థలకు సిద్ధమవుదాం అని ఇటీవల జరిగిన సమావేశంలో పవన్ కల్యాణ్ చెప్పింది ఒక్కటే. జనసైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్దామని నిర్ణయించారు. పొత్తులో ఉన్నపుడు కొన్ని విషయాల పట్ల కొన్ని నిర్ణయాలు ఉంటాయి. మనం ఎక్కడ బలంగా ఉన్నామనేది కచ్చితంగా స్థానిక నాయకత్వం తెలుసుకోవాలి. మన బలం ఎంత..? దానికి గల కారణాలు..? సామాజిక అంశాలు, స్థానిక సమస్యలపై ప్రత్యేకంగా ఫోకస్ చేయండి. అక్కడి మన బలాబలాలపై ప్రత్యే కంగా నివేదికలు తెప్పించుకోండి. సర్వేలు చేయించండి. కచ్చితంగా బలంగా ఉన్న చోట మనం పోటీ చేస్తే గెలిచేలా వ్యూహాలు రూపొందించుకోవాలి.

జనసేన పార్టీ యువత కోసం మరో అద్భుతమైన వేదికను తీసుకురాబోతోంది. పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సెప్టెంబర్ 2వ తేదీన జనసేన పార్టీ యువజన విభాగాన్ని మొదలుపెట్టబోతున్నాము. సెప్టెంబర్ 2వ తేదీన ప్రతి నియోజకవర్గంలో జనసేన పార్టీ యువజన విభాగం ఆవిష్కరణ చేయబోతున్నాం. యువతను పార్టీలోకి తీసుకురావాలి. స్వచ్ఛమైన రాజకీయాలు చేయాలి. వారికి మంచి వేదికను ఇవ్వాలనే బలమైన లక్ష్ యంతో యువజన విభాగం పనిచేస్తుంది. యువత సమస్యలు, వారి రాజకీయ ఆకాంక్షలు, ఆలోచనలకు ప్రతీకగా యువజన విభాగం నిలుస్తుంది. యువజన విభాగం ఏర్పాటుకు సంబంధించి ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామస్థాయిల్లో ర్యాలీలు, ఆవిష్కరణలు చేయాలి. దేశమే ఫస్ట్.. మిగిలినవన్నీ నెక్స్ట్ అనే తరహాలో యువజన విభాగం సేవలు విస్తృతం చేయాలనేది పవన్ కల్యాణ్ ఆలోచన. యువత రాజకీయాల్లోకి రావలసిన అవసరాన్ని గుర్తించి వారి కోసం బలంగా ఈ విభాగం పనిచేస్తుంది. 2029 ఎన్నికల్లో జనసేన పార్టీ మరింత బలంగా ముందుకు వెళ్లాలి. ప్రతి ఒక్కరూ నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. ఒక దేశ ప్రధాని స్వయంగా పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు అంటే మన పార్టీ అధ్యక్షుడికి కేంద్ర నాయకత్వం ఇచ్చే గౌరవాన్ని మనం అర్థం చేసుకోవాలి. సోషల్ మీడియాను మంచి కోసం, మంచి పనిని పదిమందికి తెలియజేయడం కోసం ఉపయోగించుకోండి. స్థానిక సంస్థల ఎన్నికలు అంటే వీధి పోరాటాలు, రాజకీయాలు, చైతన్యం. మన ప్రాంతంలో జరిగే రాజకీయ పోరు. దీనిలో జనసేనను అత్యున్నతంగా నిలబెట్టేలా మనమంతా కలిసికట్టుగా పనిచేద్దాం అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, లింగమనేని రమేష్,టి ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# తెలుగు భాష పరిరక్షణకు ప్రాధాన్యం

>> నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గ్రంథాలకే పరిమితమైన తెలుగును ప్రజాక్షేత్రంలోకి తెచ్చిన మహోన్నతుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని కొనియాడారు. కందుకూరి, గురజాడ, గిడుగుల కృషి వల్లే వ్యావహారిక భాష ఉద్యమం రూపుదిద్దుకుందన్నారు. సవర భాషకు లిపిని రూపొందించి, బ్రిటిష్ ప్రభుత్వం తనకు ఇచ్చిన పారితోషికాన్ని సైతం ఆదివాసీల విద్యాభివృద్ధికి వెచ్చించిన త్యాగధనుడు, సంఘసంస్కర్త గిడుగు అని గుర్తుచేశారు. తెలుగు భాషా పురస్కారాల ఎంపికకు సంబంధించిన జి.ఒ ను కూడా తెలుగులోనే జారీ చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లు మాతృభాషకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో వ్యావహారిక భాషా సంఘాల ఏర్పాటుకు సాంస్కృతిక శాఖ తరఫున పూర్తి సహకారం ఉంటుందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని అధికార భాషా సంఘం చైర్మన్‌కు సూచించారు. ప్రతి ఏటా ఉగాది, కందుకూరి, తెలుగు భాషాపురస్కారాలను క్రమం తప్పకుండా ప్రదానం చేస్తామని వెల్లడించారు.పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ మాట్లాడుతూ.. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా గుర్తింపు పొందిన తెలుగు భాషకు అగ్రతాంబూలం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్ పూల త్రివిక్రమ్ రావు మాట్లాడుతూ.. వాడుక భాషా పరివ్యాప్తికి గిడుగు రామమూర్తి పంతులు తమ జీవితాన్ని ధారపోశారన్నారు.కందుకూరి, గురుజాడ, గిడుగులతో పాటు సిపి బ్రౌన్, పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్ వంటి మహనీయులు తెలుగుకు అందించిన సేవలు అనన్యమైనవనిగుర్తుచేశారు. 'ఐ లవ్ విజయవాడ' వంటి నామఫలకాలు తెలుగులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో పని చేస్తుండటం వల్ల తనకూ తెలుగు భాషపై గౌరవం మరింత పెరిగిందన్నారు. గిడుగు రామమూర్తి పంతులు సాగించిన వ్యావహారిక భాషా ఉద్యమ ఫలితంగానే నేడు సామాన్య ప్రజలకు కూడా భాష ఎంతో చేరువైందని కొనియాడారు.సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ.. తెలుగు భాషా పరిరక్షణకు, ఉనికికి కృషి చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలని కోరారు. భాషా వికాసానికి కృషి చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నాటకరంగం ద్వారానే భాష ప్రజల హృదయాలకు మరింత చేరువైందని, త్వరలోనే నంది నాటకోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఈ వేడుకలో గిడుగు వేంకట రామమూర్తి పంతులు మునిమనవడు నాగేశ్వర రావు రచించిన కావ్య మల్లికలు పుస్తకాన్ని మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. తెలుగు భాషాపురస్కారాలు అందుకున్న జంధ్యాల కనకదుర్గ, చందలూరి నారాయణరావు, యు.భూదేవి, కె.పుష్ప, ముత్తేవి రవీంద్రనాథ్, బాలాంతపు వెంకట రమణ, అబ్దుల్ హకీమ్ జాని, ఎస్.వి. రాఘవేంద్రరావు, పి.విజయ్ కుమార్, బొగ్గవరపు మాల్యాద్రి, చిలుకూరి శ్రీనివాసరావు, నాగసూరి వేణు గోపాలరావు, జంధ్యాల శరత్‌బాబు, కోయి కోటేశ్వరరావు, కే.వి.ఎల్.ఎన్. శర్మ, ఎం.రామకృష్ణ, విఐటియు పుస్తక ప్రచురణ సంస్థ, వేమూరి శ్రీనివాస్, కొల్లి రమావతి లు మాట్లాడుతూ..భాషా వికాసానికి కృషి చేస్తున్న తమను గుర్తించి పురస్కారాలు అందజేసిన మంత్రి కందుల దుర్గేష్‌కు, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కళావేదికకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్ కు వివిధ జానపద నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళా వేదిక ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తెలుగు తల్లి విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్ పూలమాలవేసి నమస్కరించారు20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, జానపద అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, గిడుగు వెంకట రామమూర్తి పంతులు ముని మనవడు నాగేశ్వరరావు తెలుగు భాషాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

30-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, మఖకార్తె
తి.విదియ ఉ.9.35
న.ఉత్తరాభాద్ర రా.3.44
వ.మ.1.18-మ.2.54
దు.సా.4.38-సా.5.28
రాహు. సా.4.30-సా.6.00
శుభ ఉ.8.00-ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** వైద్యుని మార్పు చేయడం వలన లాభపడ గలుగుతామని భావిస్తారు. ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉంటారు.

**వృషభం :** సుపరిచితులు కొందరు మీ సహాయాన్ని అర్థిస్తారు. ప్రతివారిని అనుమానాస్పద దృష్టితో చూస్తారు.

**మిథునం :** వృత్తి, ఉద్యోగాల పరంగా మీ కృషికి తగినటువంటి మంచి ఫలితాలను అందుకోగలుగుతారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం :** అన్ని రంగాల వారికి గతంలో కంటే నేడు ఎంతో కొంత ప్రోత్సాహం లభిస్తుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

**సింహం :** పని భారం వలన వత్తిడి అధికంగా ఉంటుంది. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ప్రముఖుల పరిచయాలు.

**కన్య :** కీలక విషయాలలో వాయిదాలు వేయకుండా వెనువెంటనే నిర్ణయాలు తీసుకుని లాభ పడ గలుగుతారు.

**తుల :** కార్యాలయంలో ఉన్న పెండింగ్ వర్క్‌ను పూర్తి చేయడానికి ప్రాముఖ్యనిస్తారు. స్వల్ప ధనలాభం గడిస్తారు.

**వృశ్చికం :** సంస్థాగతంగా పురోభివృద్ధిని సాధించటమే తక్షణ కర్తవ్యమని భావిస్తారు. నూతన మిత్రుల పరిచయాలు. వాహన సౌఖ్యం.

**ధనుస్సు :** మంచి మాటకారితనం వలన అనుకూల ఫలితాలను ఎంతగా సాధించవలెనని అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు.

**మకరం :** దూరప్రాంతాల నుండి రావలసిన ధనం కొంత వరకు చేతికంది వస్తుంది. నూతన వాహన కొనుగోలు చేస్తారు.

**కుంభం :** నిజంగా మీ శ్రేయస్సు కోరుకునే వారు ఎవరన్నది తెలుసుకుంటారు. ఆర్థిక అంశాలపై దృష్టిని పెడతారు. వస్త్ర లాభం.

**మీనం :** భూ, గృహ, యంత్ర సంబంధితమైన విషయములకు సంబంధినటువంటి లావాదేవీలు సానుకూల పడతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

30-8Pg8exTCL.qxd:30-8Pg8exTCL.qxd 1/1/02 7:09 AM Page 1



# నేడు అనంతకు సిఎం చంద్రబాబు రాక

- ఎంవైఆర్ కళ్యాణమండపంలో పెళ్లికి హాజరు
- టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు కుమారుడుతో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె వివాహం



**అనంతపురం, ఆగస్టు 29 (ప్రభాతవార్త బ్యూరో):** అనంతపురం జిల్లా కేంద్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం రావడం అధికారికంగా ఖరారైంది. సీఎం చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకొని ప్రత్యేక హెలికాప్టర్లో ఇక్కడికి రానున్నారు. బళ్లారి రోడ్ లోని ఎం వై ఆర్ కళ్యాణమండపం లో టిడిపి జిల్లా అధ్యక్షులు , ఆర్టీసీ రీజనల్ చైర్మన్ అయిన పూల నాగరాజు కుమారుడు పిఎస్ శివరాజ్ తో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె విద్యతో వివాహం జరగనుంది. ఈ వివాహ కార్యక్రమానికి సీఎం హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 30వ తేదీన తిరుపతి జిల్లా పర్యటన అనంతరం తొట్టంబేడు మండలంలో ఎంజిఎం హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి మధ్యాహ్నం 12:05 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 01:15 గంటలకు అనంతపురం జిల్లా కేంద్రంలోని శిల్పారామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ కు చేరుకుంటారు. అక్కడ 01:15 నుంచి 01:20 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు స్వాగతం పలుకుతారు. అనంతరం 01:20 గంటలకు అక్కడి హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 01:30 గంటలకు అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ కు చేరుకుంటారు. ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ లో మధ్యాహ్నం 01:30 నుంచి 01:45 గంటల వరకు గుంతకల్లు ఎమ్మెల్యే కుమార్తెకు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ కుమారుల వివాహ మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించనున్నారు. తదనంతరం 01:45 గంటలకు ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ నుంచి బయలుదేరి 01:55 గంటలకు శిల్పారామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ కు చేరుకుంటారు. శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి మధ్యాహ్నం 02:00 గంటలకు బయలుదేరి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి లో ఉన్న నివాసమునకు రాష్ట్ర ముఖ్యమంత్రి వెళతారు. ఈ పరిస్థితుల్లో సీఎం పర్యటన విజయవంతం కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# నగ్నచిత్రాలతో ఎర.. హానీట్రాప్‌తో సమాచార సేకరణ

## భారత్‌లో ఉధృతం అవుతున్న ఐఎస్ఐ కార్యకలాపాలు




**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** భారత్‌లో పాకిస్థాన్ ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన గూఢచర్య నెట్‌వర్క్‌లపై మరోసారి చర్చ మొదలైంది. ఢిల్లీలో శుక్రవారం ఓ యువ దంపతులను అరెస్ట్ చేయడంతో, భారత రక్షణ వ్యవస్థకు సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరించేందుకు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఇటీవలి కేసులను పరిశీలిస్తే ఆన్‌లైన్‌లో టార్గెట్లను గుర్తించడం, హానీట్రాప్‌లోకి లాగడం, రక్షణ సంస్థలు మౌలిక వసతులకు సంబంధించిన సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నించడం వంటి అంశాలు పలువురు కేసుల్లో కనిపిస్తున్నాయని దర్యాప్తు వర్గాలు పేర్కొంటున్నాయి. దర్యాప్తు అధికారుల ప్రకారం, పాకిస్థాన్‌కు చెందిన ఏజెంట్లు సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించి భారత రక్షణ లేదా ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే వ్యక్తులను గుర్తించే అవకాశం ఉంది. యూనిఫాంలో ఉన్న అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు లేదా వ్యక్తిగతంగా బలహీనంగా ఉన్నట్లు కనిపించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. టార్గెట్‌ను గుర్తించిన తర్వాత, సాధారణంగా భారతీయ ఫోన్ నంబర్లతో నిర్వహించే సోషల్ మీడియా లేదా మెసేజింగ్ ఖాతాల ద్వారా పరిచయం ఏర్పరచుకునే ప్రయత్నం జరుగుతుందని చెబుతున్నారు. కొన్ని కేసుల్లో మహిళల ఫోటోలను ప్రొఫైల్‌లో ఉపయోగించిన ఖాతాల ద్వారా పరిచయం పెంచుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు అధికారులు చెబుతున్నారు. మొదట స్నేహపూర్వకంగా ప్రారంభమయ్యే సంభాషణలు తర్వాత వ్యక్తిగత విషయాలకు దారితీయవచ్చు. టార్గెట్ వ్యక్తి ప్రైవేట్ లేదా సన్నిహిత ఫోటోలను పంచుకున్న తర్వాత వాటిని ఉపయోగించి బ్లాక్‌మెయిల్ లేదా ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి. అనంతరం రక్షణ సంస్థలు, సైనిక కార్యకలాపాలు లేదా ప్రభుత్వ వ్యవస్థలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఢిల్లీ కేసులో ఢిల్లీ కేసులో మొహమ్మద్ సాహిల్ (25), అతని భార్య సమీరా (21)లను పోలీసులు అరెస్ట్ చేశారు. దర్యాప్తు ప్రకారం, ఈ దంపతులు 2024-25 మధ్య కాలంలో ఎనిమిది భారతీయ సిమ్ కార్డులను సేకరించి, దుబాయ్ మీదుగా పాకిస్థాన్‌కు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సిమ్ కార్డులను పాకిస్థాన్ నుంచి వాట్సాప్‌ఖాతాలను యాక్టివేట్ చేయడానికి ఉపయోగించినట్లు, తద్వారా భారతీయ గ్రూపుల్లోకి ప్రవేశించి సున్నితమైన సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారని సమాచారం. భారత రక్షణ, ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే వ్యక్తులను లక్ష్యంగా చేసుకునే క్రమంలో హానీట్రాపింగ్ ఒక పద్ధతిగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల మేలో అరెస్టు అయిన ఓ సర్వింగ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ పై కూడా ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. పాకిస్థాన్‌కు చెందిన ఏజెంట్లుగా భావిస్తున్న వ్యక్తులతో ఆన్‌లైన్‌లో పరిచయం ఏర్పడి, అనంతరం సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. దర్యాప్తు వర్గాల ప్రకారం, నగ్న ఫోటోలను పంపిస్తానని చెప్పి సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పొందేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సహోద్యోగి మొబైల్ ఫోన్‌లో సమాచారాన్ని దొంగిలించే సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసినట్లు కూడా ఆ అధికారిపై ఆరోపణలు నమోదయ్యాయి. ఇలాంటి కేసుల్లో గతంలో డిఆర్డీవోమాజీ శాస్త్రవేత్త ప్రదీప్ కురుల్కర్ పేరు కూడా వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌గా పేర్కొన్న జారా దాస్‌గుప్తా అనే వ్యక్తితో సంభాషణలు జరిపి, సున్నితమైన సమాచారాన్ని అందించినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ఆయనను 2023 మే 3న అరెస్ట్ చేసింది. ఆ తర్వాత ఆయనపై దర్యాప్తు కొనసాగి, జూన్ చివరి నాటికి సుమారు 1,837 పేజీల ఛార్జ్‌షీట్ సిద్ధం చేసినట్లు సమాచారం. 2024 ప్రారంభంలో మరో కేసులో సతేంద్ర సివాల్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. 2021 నుంచి మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో ఇండియాబేస్డ్ సెక్యూరిటీ అసిస్టెంట్‌గా పనిచేసిన ఆయనకు సున్నితమైన రాయబార కార్యాలయ పత్రాలకు యాక్సెస్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆయనను కూడా హానీట్రాప్ ద్వారా గూఢచర్యానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ కేసులు సోషల్ మీడియా ద్వారా తెలియని వ్యక్తులతో పరిచయం పెంచుకునే విషయంలో అప్రమత్తత అవసరాన్ని మరోసారి గుర్తుచేస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ, రక్షణ రంగాల్లో పనిచేసే వ్యక్తులు తమ ఉద్యోగం, విధులు, కార్యాలయ వివరాలు లేదా సున్నితమైన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పంచుకోకుండా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా తెలియని వ్యక్తులు పంపే లింకులు, ఫైళ్లు, యాప్‌లు లేదా సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేయకపోవడం, వ్యక్తిగత ఫోటోలు, పత్రాలను అపరిచితులతో పంచుకోకపోవడం సైబర్ భద్రతలో కీలకం.

# ముదురుతున్న శ్రీశైలం వివాదం

- తెలంగాణ, ఆంధ్రా పోటా పోటీగా నీటి విడుదల
- కరెంట్ ఉత్పత్తి నిలిపివేయాలని కేంద్రానికి ఎపి ఫిర్యాదు

**హైదరాబాద్, అగస్టు 29, ప్రభాతవార్త:** శ్రీశైలంలో జల విద్యుత్ ఉత్పత్తి వివాదం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ముదురుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి హైదరాబాద్ సుమారు 40 వేల క్యూసెక్కుల నీటిని వాడుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ఆరోపిస్తోంది. శ్రీశైలంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. రాబోయే నెలల్లో తాగునీటి అవసరాలను తీర్చడానికి శ్రీశైలం జలాశయంలోని నీటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, అలా చేయవద్దని అభ్యర్థించినప్పటికీ తెలంగాణ నీటిని తోడటం కొనసాగిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాసిన లేఖలో తెలిపింది. విద్యుత్ ఉత్పత్తి నెపంతో తెలంగాణ 34 టీఎంసీలకు పైగా నీటిని తోడిందని ఆ లేఖలో పేర్కొంది. అభ్యర్థించినప్పటికీ, శ్రీశైలం నుంచి తెలంగాణ నీటిని తోడటాన్ని ఆపడంలో కృష్ణా నది నిర్వహణ బోర్డు (కేఆర్ఎంబీ) విఫలమైందని ఆంధ్రప్రదేశ్ కేంద్రానికి ఫిర్యాదు చేసింది. కాగా నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటి విడుదల విషయంలో ఈ నెల 26న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మొదలైన పోరు శుక్రవారం తీవ్ర స్థాయికి చేరింది. ఇరు రాష్ట్రాలు శ్రీశైలం నీటితో విద్యుత్ విద్యుత్ చేస్తున్నాయని ఒకరిపై ఒకరు ఆరోపించుకుంటున్నాయి. మరోపక్క ఇరు రాష్ట్రాలు జలాశయం నుంచి విడుదల చేసే నీటి పరిమాణాన్ని పెంచాయి. గత బుధవారం ప్రారంభమైన తన నియంత్రణలో ఉన్న ఎన్ఎస్ రైట్ కెనాల్ నుంచి 2,000 క్యూసెక్కుల నీటి విడుదలను ఆంధ్రప్రదేశ్ 6,553 క్యూసెక్కులకు పెంచిన నేపథ్యంలో, శుక్రవారం తెలంగాణ కూడా ఎన్ఎస్ లెఫ్ట్ కెనాల్ నుంచి తన నీటి విడుదలను 2,000 క్యూసెక్కుల నుంచి 6,650 క్యూసెక్కులకు పెంచింది. అయితే ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడానికే నీటిని విడుదల చేస్తున్నామని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండూ వాదించుకుంటున్నాయి. తమ నియంత్రణలో ఉన్న శ్రీశైలం జలాశయం నుంచి ఆంధ్రప్రదేశ్ అధికంగా నీటిని తోడుతోందని తెలంగాణ ఆరోపిస్తుండగా, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ పవర్ హౌస్‌లో విద్యుత్ ఉత్పత్తిని సాకుగా చూపి, శ్రీశైలం నుంచి నీటిని తోడి నాగార్జునసాగర్‌కు పంపిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఆరోపిస్తోంది. కాగా శుక్రవారం నాడు, నాగార్జునసాగర్‌లో మొత్తం 312.050 టీఎంసీ అడుగుల నీటి నిల్వకు గాను, 181.929 టీఎంసీ అడుగుల నీరు నిల్వ ఉంది.

## పాల ఉత్పత్తిపై ఎల్ నినో ప్రభావం

# సంక్షోభంలో పాడి పరిశ్రమ

- పట్టిపీడిస్తున్న పశు గ్రాసం కొరత
- రాష్ట్రంలో తగ్గిపోతున్న పాల ఉత్పత్తి అందుబాటులో 4 లక్షల లీటర్లు
- ఇతర రాష్ట్రాల నుండి రోజూ 26 లక్షల లీటర్ల దిగుమతి

**హైదరాబాద్, అగస్టు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో పాడి పరిశ్రమ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో రోజురోజుకూ పాల ఉత్పత్తి తగ్గిపోతుండటంతో డిమాండ్‌కు సరిపడా పాలు లభించడం లేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఈ రంగం రోజురోజుకీ క్షీణించిపోతున్న దుస్థితిని పశుగణన ఫలితాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. పశుగ్రాసం కొరత, వాతావరణ మార్పులు, పాడి పరిశ్రమపై రైతులు ఆసక్తి చూపకపోవడం దీనికి ప్రధాన కారణాలు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల పశుగ్రాసం లభ్యత తగ్గి, పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడింది. దీనికి తోడు గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఆవులు, గేదెల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడంతో పాటు విజయ డెయిరీకి వచ్చే పాల సేకరణలో కూడా హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి. ఐసీఎంఆర్ సిఫార్సుల ప్రకారం రోజువారీ వినియోగం పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఉత్పత్తిని మించి డిమాండ్ ఉండటంతో పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో రోజుకి సుమారు 26 లక్షల లీటర్లకు పైగా పాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో పాలు కేవలం 4 లక్షల లీటర్ల వరకు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఇది రాష్ట్ర అవసరాలను తీర్చేందుకు సరిపడే స్థాయిలో లేదు. పాడిపశువుల సంఖ్య తగ్గడం వల్ల పాల ఉత్పత్తిలో గణనీయమైన కోత వచ్చింది. ఇప్పటికే పాడిరైతులు పోసే పాలు రోజుకి కేవలం 50 వేల లీటర్ల వరకు తగ్గిపోవడం ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది. ఇందుకు కారణం తెలంగాణలో పశుసంపద వృద్ధి చెందకపోవడమే. గేదెలు, ఆవుల సంఖ్య తగ్గడంతో పాడి, దాని అనుబంధ ఉత్పత్తులపై ప్రభావం పడింది. 2019 సంవత్సరంతో పోలిస్తే తాజాగా జరిగిన పశుగణనలో పాలు ఇచ్చే ఆవులు, గేదెలు సంఖ్య గణనీయంగా తగ్గింది. రాష్ట్రంలో 25.82 లక్షల కుటుంబాలు పశుపోషణపై ఆధారపడి జీవనో పాధి పొందుతున్నాయి. ఇందులో 12 లక్షల కుటుంబాలు ఆవుల పెంపకం, 10.5 లక్షల కుటుంబాలు గేదెల పెంపకం చేస్తున్నాయి. ఆవుల సంఖ్య 2019లో 42,32,383 ఉండగా, ఇప్పుడు 27.48 శాతం చొప్పున 30,69,524కు తగ్గింది. అలగే గేదెలు సంఖ్య 42,26,603 నుంచి 27.78 శాతం మేర 30,52,102కి తగ్గాయి. సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్నగర్ జిల్లాలో 45 శాతం ఆవుల సంఖ్య తగ్గింది. సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, కామారెడ్డిలో గేదెల సంఖ్య భారీగా పడిపోయింది. కాగా రాష్ట్రంలో రైతులకు ఆశించిన స్థాయిలో మద్దతు లేకపోవడం, పశువైద్య సేవలు సమర్థవంతంగా లభించడం లేదు. గోపాల మిత్ర వంటి సిబ్బంది ఉన్నప్పటికీ వారికి సకాలంలో వేతనాలు అందడం లేదు. ప్రతి ఏటా వారు జీతాల కోసం రాష్ట్ర ఉన్నతాధికారులు చుట్టు తిరిగే పరిస్థితులు ఉన్నాయి. మరో వైపు పశువుల దాణా, మేత ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. పశు గ్రాసం పెపకం పట్ల అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మరోపక్క పచ్చిగడి, పశువులకు సేవలందించేందుకు కూలీల దొరకడం లేదు.

# సజ్జన్‌కుమార్ ఇంటికి వెళ్లిన బిజెపి ఎంపిలకు సమన్లు!



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తూ జైలులో మరణించిన కాంగ్రెస్ మాజీ నేత సజ్జన్ కుమార్ ఇంటికి ముగ్గురు బీజేపీ ఎంపీలు వెళ్లారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు సజ్జన్ కుమార్ మరణం పట్ల సంతాపం తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు దీనిపై స్పందించారు. పార్టీ ఎంపీలకు సమన్లు జారీ చేశారు. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్న 80 ఏళ్ల సజ్జన్ కుమార్ పలు అనారోగ్య సమస్యల కారణంగా ఆగస్ట్ 20న జైలులో మరణించారు. సజ్జన్ కుమార్ అంత్యక్రియల తర్వాత నిర్వహించిన భోగ్ కార్యక్రమానికి ముగ్గురు బీజేపీ ఎంపీలు హాజరయ్యారు. పశ్చిమ ఢిల్లీ ఎంపీ కమల్‌జీత్ సెహ్రావత్, దక్షిణ ఢిల్లీ ఎంపీ రణబీర్ సింగ్ బిధురి, వాయువ్య ఢిల్లీ ఎంపీ యోగేందర్ చందోలియా ఆయన ఇంటికి వెళ్లారు. సజ్జన్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు ఆయన మరణం పట్ల సంతాపం తెలియజేశారు. సిక్కు మతపరమైన ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. మరోవైపు ఢిల్లీకి చెందిన ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ దీనిపై విమర్శలు గుప్పించారు. అల్లర్ల కేసులో దోషిగా తేలిన వ్యక్తి పట్ల ఆ ముగ్గురు బీజేపీ ఎంపీల హృదయాలు ద్రవిస్తున్నాయని ఎక్స్ పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. అయితే ప్రతిపక్ష పార్టీల విమర్శల నేపథ్యంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్పందించారు. ముగ్గురు బీజేపీ ఎంపీలైన రామ్‌వీర్ బిధురి, యోగేందర్ చందోలియా, కమల్‌జీత్ సెహ్రావత్‌లకు సమన్లు జారీ చేశారు. వారు అక్కడికి వెళ్లకూడదని ఆయన అన్నారు.

# వక్ఫ్ ఆస్తుల పత్రాలను డిజిటల్ రూపంలో భద్రపరచాలి : చైర్మన్ అజీజ్

**విజయవాడ, ఆగష్టు 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వక్ఫ్ఆస్తుల పత్రాలను డిజిటల్ రూపంలో భద్రపరచాలని ఈప్రక్రియను వేగవంతం చేయాలని వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదేశించారు. శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఇన్‌స్పెక్టర్-ఆడిటర్లు, వక్ఫ్ అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా వక్ఫ్ ఆస్తుల క్షేత్రస్థాయి సమాచార సేకరణ, రికార్డుల ధృవీకరణ, డిజిటలైజేషన్ కోసం రూపొందించిన ప్రాజెక్ట్ అమానహ్ పై సమీక్షించారు. ప్రతి వక్ఫ్ ఆస్తికి ప్రత్యేక ఐడి కేటాయించాలని, ఆస్తి వివరాలు, భౌతికస్థితి, ఫోటోలు, ఆక్రమణలు, న్యాయపరమైన అంశాలు, రికార్డుల వ్యత్యాసం తదితర సమాచారాన్ని ఆధారాలతో సేకరించి ధృవీకరించిన రికార్డుగా రూపొందించటమే ఈప్రాజెక్టు ముఖ్యఉద్దేశ్యమన్నారు. ఈప్రాజెక్టును అమలు చేసే ముందు వారంరోజులపాటు పైలెట్ ప్రాజెక్టు నిర్వహించనున్నారు. అనంతరం అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేసేలా కార్యాచరణ రూపొందించారు. అప్పగించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని చైర్మన్ ఆదేశించారు.

# నకిలీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల దాడులు

## ఆరుగురిపై క్రిమినల్ కేసులు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** జంట నగరాలలో నకిలీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనదా రులపై ట్రాఫిక్ పోలీసుల దాడుల ప రంపర కొనసాగుతూనే వుంది. ఈ సందర్భగా నగర పరిధలోని మైలార్‌దేవుపల్లి, సుల్తాన్‌బజార్, షా అలిబండా, బండ్లగూడ, గుడిమల్కాపూ ర్ మల్కాజిగిరి పరిధిలోని వన స్థలిపురం పోలీసు స్టేషన్లలో ఆరుగురు వ్యక్తులను ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని తప్పుడు నంబర్ ప్లేట్లతో తిరు గుతున్నందుకు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాలను జప్తు చేసి ఆయా పోలీసు స్టేషన్లకు అప్పగించా రు. నకిలీ నంబర్ ప్లేట్లతో వాహనదారులు ఎవరు తిరగవద్దని సిటీ ట్రాఫిక్ చీఫ్ జోయల్ డేవిస్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇలాంటి వా హనాలను జప్తు చేయడంతో పాటు వాహనదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, దీనివల్ల వారు ఎంతో నష్టపోవలసి వుంటుందని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోతారని ఆయన తెలిపారు.

# నన్ను కేబినెట్ నుంచి తప్పించే కుట్రజరుగుతోంది!

## కేంద్ర మంత్రి జువల్ ఓరమ్ బిజెపిపై ధ్వజం



**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ఓవైపు కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ప్రధాని మోడీ సిద్ధమవుతున్న వేళ ఆయన కేబినెట్లోనే ఉన్న ఓ మంత్రి దీనిపై బహిరంగ వ్యాఖ్యలు చేశారు. తనను కేబినెట్ నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ నేతలు ఈ మేరకు కుట్రలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇతర పార్టీల నుంచి బీజేపీ నాయకులే ఇలాంటి పనులు చేస్తున్నారని సదరు మంత్రి చేసిన ఆరోపణలు ఇప్పుడు కేబినెట్ ను కుదిపేస్తున్నాయి. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి, బీజేపీ నేత జ్యూయర్ ఓరం సొంత పార్టీ నేతలను ఉద్దేశించి శనివారం సంచలన ఆరోపణలు చేశారు. త్వరలో కేంద్ర కేబినెట్ ప్రక్షాళన కోసం ప్రధాని మోడీ ప్రయత్నాలు చేస్తున్న వేళ.. తనను కూడా తప్పించేందుకు ఇతర పార్టీల నుంచి వచ్చి పార్టీలో చేరిన నేతలు ప్రయత్నిస్తున్నారని ఓరం ఆరోపించారు. వారు తనను అప్రతిష్టపాలు చేసి, కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించేందుకు ఒక ప్రచారాన్ని మొదలుపెట్టారని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో, కొందరు వ్యక్తులు డబ్బు ఖర్చు చేసి తనను అప్రతిష్టపాలు చేయడానికి, తమ స్థానాన్ని దెబ్బతీయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని కేంద్ర మంత్రి ఓరం ఆరోపించారు. అలా చేయడం ద్వారా తమకు అవకాశం దక్కుతుందని వారు భావిస్తున్నారని ఆయన తెలిపారు. తన పార్టీ గురించి తనకు బాగా తెలుసని, అలాగే తన కృషిని కూడా అది గుర్తిస్తుందని ఓరం వ్యాఖ్యానించారు. ఒడిశాలోని సుందర్‌గఢ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓరం.. తన ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన వారికి గట్టి హెచ్చరిక కూడా జారీ చేశారు. ఈ వ్యవహారంపై ఒడిశా బీజేపీ ఆర్గనైజింగ్ సెక్రటరీతో ఇప్పటికే చర్చించినట్లు పేర్కొన్న ఓరం వారిపై కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. తనను అప్రతిష్టపాలు చేసేవారి చేతులను నరికే సత్తా, అలాగే వాటిని దహనం చేసే సత్తా తనకు ఉందన్నారు. జ్యూయర్ ఓరం గిరిజన ప్రాబల్యం కలిగిన సుందర్‌గఢ్ లోక్‌సభ నియోజకవర్గం నుండి ఆరుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఓరం వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీజేడీ, కాంగ్రెస్ తీవ్రంగా స్పందించాయి. ఓరం వ్యాఖ్యలతో బీజేపీ రాజకీయాలు మరోసారి బయటపడ్డాయని విమర్శించాయి.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన సమావేశం

- 22ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలపై చర్చ
- హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరుకు బిజెపి కార్యాచరణను సిద్ధం చేసింది. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు అధ్యక్షతన పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో 22ఏ, ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు, రైతుల సమస్యలపై నేతలు చర్చించారు. సమావేశం అనంతరం బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22ఏపై బిజెఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి రెండు రోజుల దీక్ష, 7వ తేదీన ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై బిజెవైఎం మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ యాత్ర త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులందరూ సమన్వయంతో కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగ అంశాలు, రైతుల సంక్షోభంపై దృష్టి సారించామని, రానున్న రోజుల్లో విద్యార్థులు, రైతుల సమస్యలపై దశలవారీగా చేపట్టాల్సిన ప్రజా పోరాటాలపై పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. చేవెళ్ల పరిధిలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటించనున్నారని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా వికారాబాద్, తాండూర్ రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులను పరిశీలించనున్నట్టు వివరించారు. చేవెళ్ల నియోజకవర్గంలో 90 శాతానికిపైగా రోడ్లను కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీలు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్. గౌతం రావు, తుళ్ల వీరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుభాషను కాపాడుకోవాల్సిన బాద్యత తెలుగువారందరిపై ఉంది



గిడుగు రామ్మూర్తిపంతులు ముదిమనువడు, ముది మనవరాలుని సత్కరిస్తున్న దృశ్యం

**విజయవాడ, ఆగష్టు 29, ప్రభాతవార్త :** తెలుగుభాషను కాపాడుకోవాల్సిన బాద్యత ప్రపంచంలోని తెలుగువారందరిపై ఉందని గిడుగు రామ్మూర్తిపంతులు ముది మనవడు గిడుగు నాగేశ్వరావు పిలుపునిచ్చారు. గిడుగు రామ్మూర్తిపంతులు జయంతి సందర్భంగా శనివారం విజయవాడలోని ఠాగూర్ గ్రంధాలయంలో రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి గిడుగు రామ్మూర్తి పంతులు ముదిమనువడు గిడుగు నాగేశ్వరావు, ముది మనువరాలు గిడుగు సరస్వతి ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు తెలుగుభాషను కాపాడుకోవాల్సి ఉందన్నారు. సవరభాషకు లిపిలేదని, రామ్మూర్తిపంతులు సవరభాషను నేర్చుకుని ప్రత్యేకంగా పదభాషను తయారు చేసి ఎన్నో పుస్తకాలు రచించారని తెలిపారు. సొంతనిధులతో సవరభాషకు ప్రత్యేకంగా పాఠశాలలు ఏర్పాటు చేసి వాటిలో ఉపాధ్యాయులను నియమించి విద్యనేర్పించనందుకు ఆంగ్లేయులు 1934లో కైజర్ ది హింద్ అనే బిరుదుతో సత్కరించారని చెప్పారు. 1938లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించారని గుర్తుచేసారు. సరస్వతి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను తెలుగులో మాట్లాడేటట్లు ప్రోత్సహించటంతోపాటు, తెలుగు పుస్తకాలు చదివించాలని సూచించారు. ఈసందర్భంగా నాగేశ్వరావు, సరస్వతి, మల్లెతీగ పత్రిక ఎడిటర్ కలిమిశ్రీలను సత్కరించారు. ఈకార్యక్రమంలో గ్రంధాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది, పోటీపరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్లేసియర్ కూలుతున్న దృశ్యాలు చైనా టూరిస్టు కెమెరాకు చిక్కాయి




గ్లేసియర్ కూలుతున్న దృశ్యం

**ఖాట్మాండు, ఆగస్టు 29:** టిబెట్ సరిహద్దులో ఉన్న గిరాంగ్ కౌంటీతోపాటు నేపాల్‌లో వరదలు విలయం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే చైనాలోని జిజాంగ్ అటోనమస్ ప్రాంతంలో ఉన్న పర్వతాలను ఓ పర్యాకుడు తన కెమెరాతో షూట్ చేస్తున్న సమయంలో యాదృచ్ఛికంగా మంచుకొండ కూలిన దృశానయలు చిక్కాయి. అయితే ఆ దృశ్యాల్లో ఉన్నది.. ప్రస్తుతం నేపాల్‌లో విలయానికి కారణమైన ప్రాంతమేనని చైనా అంచనా వేసింది. హై ఆల్టిట్యూడ్‌లో ఉన్న గ్లేసియర్ కూలిపోవడం వల్లే భీకరమైన బురదతో కూడిన వరద గిరాంగ్ పోర్టును తుడిచిపెట్టేసిందని చైనా పేర్కొన్నది. చైనాలోని జినువా న్యూస్ రిపోర్టు ప్రకారం.. విడియోలో ఉన్న లోకేషన్, రిమోట్ సెన్సింగ్ ఇమేజ్‌లు రిలీజ్ చేసిన ప్రాంతాలు ఒక్కటిగా ఉన్నట్లు చైనీస్ ఎన్విరాన్‌మెంట్ అకాడమీ డైరెక్టర్ కాంగ్ సిచాంగ్ తెలిపారు. అయితే నేపాల్ వైపున్న మంచుకొండ కుప్పకూలినట్లు ఫుటేజ్ ద్వారా స్పష్టం అవుతున్నట్లు చైనీస్ మీడియా పేర్కొన్నది. మంచుకొండ కూలి,సరస్సులో పడడం, ఆ తర్వాత రాళ్లు, బురద ప్రవాహం.. జల ప్రళయాన్ని సృష్టించినట్లు చైనా మీడియా తమ రిపోర్టులో వెల్లడించింది. కొండచరియ విరిగిపడడం వల్ల భారీ స్థాయిలో మంచు ఫలకం, రాళ్లు, బురద.. కొండ లోయల్లో.. ఓ శక్తివంతమైన ప్రవాహంలా మారింది. అది చైనా బోర్డర్‌లోని గిరాంగ్ పోర్టును ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అయితే సుమారు 5,140 మీటర్ల ఎత్తులో ఉన్న మంచుకొండ కూలినట్లు చైనీస్ మీడియాల తెలిపారు. సుమారు 6,200 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక ఆ మంచు, రాళ్లు, బురద సుమారు 20 కిమీ దిగువకు ప్రవహించి, సముద్ర మట్టానికి 3,300 మీటర్ల ఎత్తులో ఉన్న గిరాంగ్ పోర్టును నేలమట్టం చేసినట్లు చైనా మీడియా పేర్కొన్నది. అయితే ఈ ప్రక్రియ మొత్తం కేవలం ఏడు నిమిషాల్లోనే ముగిసినట్లు ఆ కథనంలో తెలిపారు.

30-8Pg5exTCL.qxd:30-8Pg5exTCL.qxd 1/1/02 5:44 AM Page 1



# మృత్యువుకు 30 సెకన్ల దూరంలో..

## ఒకేఒక్క మెసేజ్ 8 మంది ప్రాణాలు నిలిపింది

**ఖాట్మాండు, ఆగస్టు 29:** ప్రకృతి కోపానికి నేపాల్‌లోని రసువా జిల్లా విలవిల్లాడింది. ఈ నెల 26న నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో అనూహ్యంగా విరుచుకుపడిన మెరుపు పూరలు, బురద, కొండచరియల విధ్వంసంలో వందలాది మంది చిక్కుకున్నారు. అతియే భంగే ఝూర్నా సమీపంలో వంతెన నిర్మాణ పనుల్లో ఉన్న ఎనిమిది మంది శ్రామికులను ఒక ఎకైక ఎస్ఎంఎస్ రూపంలో వచ్చిన ప్రమాద హెచ్చరిక మృత్యుముఖం నుంచి కాపాడింది. మృత్యువు విరుచుకుపడటానికి సరిగ్గా 30 సెకన్ల ముందు వచ్చిన ఆ అలర్ట్, ఎనిమిది మంది ప్రాణాలను నిలబెట్టిన ఒక అద్భుతంలా మారింది.

**'ఫోన్ చూశా.. కళ్లు ఎత్తేసరికి 10 అడుగుల నీటి గోడ!'**

మెయిలుంగ్ ప్రాంతంలో నిర్మాణ బృందంతో కలిసి పనిచేస్తున్న సాంకేతిక నిపుణుడు అర్జున్ రెమాల్ తన అనుభవాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో ఆయన ఫోన్ ఒక్కసారిగా వైబ్రేట్ అయింది. నేపాల్ జాతీయ విపత్తు ప్రమాద నిర్మూలన సంస్థ నుంచి వచ్చిన ఆ మెసేజ్‌లో 'క్షణాల్లో ఉప్పెన రాబోతోంది. సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి' అని ఉంది. 'నేను ఫోన్ వంక చూసి, అలా తల పైకెత్తేసరికి నా కళ్ల ముందు 10 అడుగుల ఎత్తున బురద, రాళ్లతో కూడిన



భయంకరమైన నీటి ప్రవాహం దూసుకొస్తోంది. 'పరుగెత్తండి' అని గట్టిగా అరిచి, ఉన్నపళంగా వెనక్కి తిరక్కుండా పరుగెత్తాను. నేను నా జీవితంలో అంత వేగంగా ఎప్పుడూ పరుగెత్తలేదు. ఆ ఫోన్ చూడటం ఒక్క 30 సెకన్లు లేట్ అయినా.. ఈరోజు మేం ప్రాణాలతో ఉండేవాళ్లం కాము' అని అర్జున్ వివరించారు.

**చీకట్లో కొండలు దాటుతూ.. ప్రాణ భయంతో రాత్రంతా ప్రయాణం**

వరద ఉద్ధృతికి వంతెన కొట్టుకుపోగా, పరుగెత్తే క్రమంలో అర్జున్ తన చెప్పులు, ఫోన్, సొంత వస్తువులన్నీ కోల్పోయారు. కానీ తనతో ఉన్న ఎనిమిది మంది శ్రామికుల ప్రాణాలు కాపాడటమే ఆయనకు ముఖ్యమైంది. రాత్రి కాగానే కింద సముద్రంలా మారిన నది వైపు వెళ్లే దారి లేక, శ్రామికులంతా చుట్టూ ఉన్న కొండలు, దట్టమైన అడవుల గుండా చీకట్లోనే నడుచుకుంటూ వెళ్లారు. రాత్రి పది గంటల ప్రాంతంలో కొన్ని ఇళ్లను చూసి, తాము నువాకోట్ జిల్లాలోకి వచ్చామని గుర్తించారు. అక్కడే కొద్దిగా ఆహారం తీసుకుని విశ్రాంతి లేకుండా సురక్షిత ప్రాంతానికి పయనమయ్యారు.

**ఆర్మీ క్యాంపును చేరుకుని ఊపిరి పీల్చుకున్న శ్రామికులు**

మరుసటి రోజు గురువారం మధ్యాహ్నానికి, వారంతా నేపాల్ ఆర్మీ ఏర్పాటు చేసిన బిదూర్ రెస్క్యూ బేస్‌కు చేరుకున్నారు. ఆర్మీ క్యాంప్ వద్ద తమ కుటుంబ సభ్యుల కోసం కన్నీళ్లతో వెతుకుతున్న బాధితులను చూసి అర్జున్ కలచివేతకు గురయ్యారు. వరదలు వచ్చిన రోజు సాయంత్రం 5 గంటల తర్వాత సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఎందరో కొట్టుకుపోయి ఉంటారని, ఆ సమయంలో అక్కడ ఉన్న వారు బతికే అవకాశాలు చాలా తక్కువని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రకోపించినా, సకాలంలో వచ్చిన ఒక్క ఎస్ఎంఎస్ ఆ ఎనిమిది మంది శ్రామికుల కుటంబాల్లో వెలుగులు నింపింది.



## నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ గల్లంతు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న ఆకస్మిక వరదల్లో ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌కు చెందిన ఉన్నతాధికారి ఒకరు గల్లంతయ్యారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ అయిన ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ హెడ్‌గా పనిచేస్తున్న లక్ష్మీనాథ్‌గోపిశెట్టి, వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్ వెళ్లారు. నేపాల్ టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన వరదల తర్వాత ఆయన ఆచూకీ లభించడం లేదని ఇన్ఫోసిస్ నిన్న ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఆయనను గుర్తించి, క్షేమంగా కాపాడటమే తమ కర్తవ్యమని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇన్ఫోసిస్ స్పందిస్తూ మా సహోద్యోగి లక్ష్మీనాథ్‌గోపిశెట్టి వ్యక్తిగత పర్యటనపై ఆ ప్రాంతానికి వెళ్లారు. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయి. ఆయన ఆచూకీని కనుగొనడానికి, కాంటాక్ట్ ఏర్పాటు చేయడానికి సంబంధిత ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నాం. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబంతో నిరంతరం టచ్‌లో ఉంటూ, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నాము. అమెరికా, కెనడాలోని ప్రభుత్వ రంగ ప్రాజెక్టులపై ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. మరోవైపు, ఈ వరదల తీవ్రతపై భారత విదేశాంగశాఖ కీలక వివరాలు వెల్లడించింది. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అన్ని విధాలా సహాయం అందించేందుకు భారత్ సిద్ధంగాఉందని ఆయన స్పష్టం చేశారు. ఇక, లక్ష్మీనాథ్ గోపిశెట్టి నేపథ్యంచూస్తే ఆయనకు టెక్నాలజీ రంగంలో అపారమైన అనుభవంఉంది. ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహం, టెక్నాలజీ, కార్యకలాపాలు, పరివర్తన వంటి అంశాలపై ఆయన సలహాలు అందిస్తుంటారు. ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ వ్యూహరచన, అమలులో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుత బాధ్యతలకు ముందు, ఆయన ఇన్ఫోసిస్‌లోనే గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, బిజినెస్ అప్లికేషన్స్ హెడ్‌గా అమెరికా, యూరప్, ఆసియా అంతటా వ్యాపారాన్ని విస్తరించారు. ఇన్ఫోసిస్‌లో చేరడానికి ముందు ఆయన యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా, అలాగే బేరింగ్‌పాయింట్, ఐబీఎం, పిడబ్ల్యూసీ, హెచ్‌సిఎల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉన్నత పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం గోపిశెట్టితో కాంటాక్ట్ ఏర్పాటు చేసుకునేందుకు ఇన్ఫోసిస్ తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, మరోవైపు వరదల్లో చిక్కుకున్న వందలాది మంది భారతీయులను రక్షించేందుకు భారత ప్రభుత్వం విస్తృత స్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.



## సిఎంల కంటే ఎమ్మెల్యేల పనితీరుపైనే ప్రజల్లో అసంతృప్తి

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఓటర్ల అభిప్రాయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మూడు రాష్ట్రాల్లోనూ ప్రజలు తమ ముఖ్యమంత్రుల కంటే ఎమ్మెల్యేల పనితీరుపైనే ఎక్కువ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తాజా సర్వేలు వెల్లడించాయి. వోట్ వైబ్ నిర్వహించిన సర్వేలో మూడు రాష్ట్రాల్లోని ఆరువేల మందికి పైగా ఓటర్లను ఈనెల 25 వరకు ప్రశ్నించారు. దీనితో పాటు ఇండియా సీ ఓటర్ సర్వేలో జూలై 1 నుంచి ఆగస్టు 25 మధ్య 25,184 మంది అభిప్రాయాలను సేకరించారు. పంజాబ్, ఉత్తరాఖండ్‌తో పోల్చుకుంటే ఉత్తరప్రదేశ్‌లోనే ఎమ్మెల్యేలపై అసంతృప్తి అత్యధికంగా కనిపించింది. 49 శాతంమంది తమ ప్రస్తుత ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు చెప్పారు. కేవలం 27.9 శాతం మంది మాత్రమే ఎమ్మెల్యేల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సిఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై అభిప్రాయం కొంత మెరుగ్గా ఉంది. 41.8 శాతం మంది ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేయగా, 38.4శాతం మంది అసంతృప్తి తెలిపారు. యుపిలో ప్రధాన ఎన్నికల సమస్యగా నిరుద్యోగం 23.1 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. రైతుల సమస్యలు 14.1 శాతం, విద్యవైద్యం 13.7 శాతం, ద్రవ్యోల్బణం 12.2 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సర్వే ప్రకారం బీజేపీ నేతృత్వంలోని కూటమి 41.8 శాతంతో స్వల్ప ఆధిక్యంలో ఉండగా, సమాజ్‌వాదీ పార్టీ కూటమికి 38.7 శాతం మద్దతు ఉంది. ఉత్తరాఖండ్‌లో సిఎం పుష్కర్ సింగ్ ధామి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వంపై 39.1 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేయగా, 38.1 శాతం మంది అసంతృప్తిగాఉన్నారు. ఎమ్మెల్యేల విషయంలో పరిస్థితి మరింత ప్రతికూలంగా ఉంది. 48 శాతంమంది ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయగా, కేవలం 27.1 శాతంమంది సంతృప్తి తెలిపారు. పంజాబ్‌లోనూ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఎక్కువగానే ఉంది. 45.3 శాతం మంది తమ ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయగా, 32.2 శాతం మంది మాత్రమే సంతృప్తి తెలిపారు. అయితే సిఎం భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వంపై 40 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. 35.4 శాతం మంది అసంతృప్తి తెలిపారు.

### రూ.40 లక్షలు లంచం తీసుకుంటూ

## సిబిఐకి పట్టుబడిన జిఎస్టీ అధికారులు

**ముంబయి, ఆగస్టు 29:** మహారాష్ట్రలో భారీ లంచం కేసు వెలుగులోకి వచ్చింది. రూ.40 లక్షల లంచం తీసుకున్నారనే ఆరోపణలపై ఇద్దరు జీఎస్టీ అధికారులతో పాటు మరో వ్యక్తిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అరెస్ట్ చేసింది. ఈ ఘటన రాయ్‌గడ్ జిల్లాలో చోటుచేసుకుంది. స్టోన్ క్వారీకి సంబంధించిన జీఎస్టీ రాయల్టీ కేసును పరిష్కరించేందుకు తొలుత రూ.1.50 కోట్ల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం చర్చల తర్వాత ఆ మొత్తాన్ని రూ.40 లక్షలకు తగ్గించినట్లు సిబిఐ తెలిపింది. ఈ కేసులో సిజీఎస్టీ అదనపు కమిషనర్ వినయ్ కుమార్ కాంతేటి, జీఎస్టీ సూపరింటెండెంట్ రాకేష్ కుమార్ సిన్హా, మరో వ్యక్తి నరేందర్ రాజ్‌పుత్లను గురువారం అరెస్ట్ చేశారు. నిందితులపై లంచం డిమాండ్, స్వీకరణకు సంబంధించిన ఆరోపణలతో దర్యాప్తు చేపట్టినట్లు సిబిఐ వెల్లడించింది. ఫిర్యాదుదారుడికి చెందిన రాతి క్వారీయింగ్ సంస్థకు సంబంధించిన జీఎస్టీ రాయల్టీ కేసును పరిష్కరించేందుకు రూ.1.50 కోట్లు లంచంగా ఇవ్వాలని సూపరింటెండెంట్ డిమాండ్ చేసినట్లు సిబిఐకి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు ఆధారంగా సిబిఐ ఈనెల 26న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.

లంచం మొత్తంపై జరిగిన చర్చల అనంతరం తొలుత డిమాండ్ చేసిన రూ.1.50కోట్లను రూ.40 లక్షలకు తగ్గించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఈ లంచం మొత్తాన్ని వసూలు చేసే బాధ్యతను నిందితులైన ప్రభుత్వ అధికారులు నరేందర్ రాజ్‌పుత్‌కు అప్పగించినట్లు ఎర్కొంది. అధికారులు పన్నిన ఉచ్చులో నరేందర్ రాజ్‌పుత్ రూ.40 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడని అధికారులు తెలిపారు. అతని అరెస్టు అనంతరం కేసులో మరింత దర్యాప్తు చేపట్టిన సిబిఐ సంబంధిత జీఎస్టీ అధికారులపై కూడా చర్యలు తీసుకుంది. లంచం వ్యవహారంపై విచారణ కొనసాగుతున్న సమయంలో వినయ్ కుమార్ కాంతేటి, రాకేష్ కుమార్ సిన్హా కూడా లంచం స్వీకరణకు సంబంధించిన ఆరోపణలను అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలను సిబిఐ దర్యాప్తు ద్వారా వెలుగులోకి తీసుకురానుంది.

## విదేశీ సహాయక బృందాల సాయాన్ని అంగీకరించిన నేపాల్



**ఖాట్మండు, ఆగస్టు 29:** విదేశీ రెస్క్యూ బృందాలు తమ దేశం వచ్చి సహాయం చేయడానికి నేపాల్ అంగీకరించని సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విషయంతో నేపాల్ తన నిర్ణయం మార్చుకుంది. విదేశీ సహాయక బృందాలను అంగీకరించాలని నిర్ణయించింది. పరిమితంగా మాత్రమే విదేశీయుల్ని అనుమతిస్తామని నేపాల్ పేర్కొంది. బుధవారం నేపాల్‌లో భారీ వరద సంభవించడంతో 600 మంది వరకు మరణించగా, మరో 1,500 మంది వరకు గల్లంతయ్యారు. వారిని గుర్తించేందుకు నేపాల్ రెస్క్యూ బృందాలు ప్రయత్నిస్తున్నాయి. అయినప్పటికీ, ఇంకా చాలా మంది ఆచూకీ దొరకలేదు. ఇదే సమయంలో తమ బృందాల్ని సహాయక చర్యల కోసం పంపిస్తామని ఇండియాతోపాటు అమెరికా వంటి దేశాలు చెప్పాయి. అయితే, తమకు ఏ దేశ సహాయం అవసరం లేదని, తమ దేశంలోని రెస్క్యూ బృందాలే ఈ చర్యలు చేపట్టగలవని నేపాల్ తెలిపింది. గాలింపు, సహాయక చర్యలకోసం విదేశాల సాయాన్ని తిరస్కరించింది. అయితే, తమ దేశానికి ఆర్థిక సాయం అందించవచ్చని మాత్రం కోరింది. అది కూడా దేశంలోని సహాయనిధికి అందించాలని సూచించింది. కానీ, నేపాల్ తమ సాయాన్ని తిరస్కరించడంపై విదేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఇదే సమయంలో అక్కడ సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. అనుకున్నట్లుగా సహాయక చర్యలు కొనసాగడం లేదు. అక్కడి సిబ్బంది శక్తికి మించిన భారంగా మారింది. పరిస్థితి ఊహించినదానికంటే భిన్నంగా ఉంది. ఘటన జరిగి మూడు రోజులవుతున్నా గల్లంతైన వారిని గుర్తించడంలో నేపాల్ విఫలమైంది. అటు విదేశాల నుంచి సాయం కోసం ఒత్తిళ్లు ఇటు సహాయక చర్యలు సరిగ్గా కొనసాగకపోవడంతో నేపాల్ కాస్త వెనక్కు తగ్గింది. రెస్క్యూ చర్యలకోసం విదేశాలకు అనుమతించింది. గాలింపు, సహాయక చర్యల కోసం తమ బృందాలను పంపించేందుకు విదేశాల నుంచి భారీ స్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇదే సమయంలో కొన్ని దేశాలకు చెందిన పౌరులు కూడా గల్లంతయ్యారు. తమ వారిని గాలించేందుకు సహాయక చర్యలకు సిద్ధంగాఉన్నాయి. అందువల్ల కొన్ని ప్రాంతాల్లో అర్హులైన కొందరు నిపుణుల్ని అనుమతిస్తున్నాం అని నేపాల్ ప్రకటించింది. నేపాల్ ఈ నిర్ణయం తీసుకోవడానికి ఇంకో కారణం ఉంది. నేపాల్ వరదల్లో గల్లంతైన వారిలో ఇండియాతోపాటు పలువురు చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా వంటి దేశాలకు చెందిన పౌరులు ఉన్నారు. వారిని రక్షించడంలో నేపాల్ ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించడంలేదు. ఈ నేపథ్యంలో ఆయాదేశాలు నేపాల్‌పై ఒత్తిడి తేవడంతో, నేపాల్ విదేశీ సహాయక బృందాలకు అనుమతించింది.

## ఉద్యోగంపోతే వెంటనే అమెరికా వీడాల్సిందే!




**వాషింగ్టన్, ఆగస్టు 29:** అమెరికాలో హెచ్1బీ వీసాపై పనిచేస్తున్న వేలాది మంది భారతీయ నిపుణులకు మరింత ఆందోళన కలిగించే పరిణామాలు ఎదురవుతున్నాయి. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కొత్త ఉపాధి వెతుక్కోవడానికి లేదా దేశం విడిచి వెళ్లేందుకు వీలు కల్పించే 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను రద్దు చేసే ప్రతిపాదనపై ట్రంప్ యంత్రాంగం తన సమీక్షను పూర్తి చేసింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, ముఖ్యంగా భారతీయ టెక్కీలు, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడనుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) 60 రోజుల విచక్షణాధికార గ్రేస్ పీరియడ్ తొలగింపు అనే పేరుతో ఈ ప్రతిపాదనను ఈనెల 6న వైట్‌హౌస్‌కు పంపింది. 27న దీనిపై సమీక్ష ముగిసింది. కొన్ని మార్పులతో ఈ ప్రతిపాదన వైట్‌హౌస్ ఆమోదం పొందినట్లు అధికారిక రికార్డులు సూచిస్తున్నాయి. అయితే, ఈ ప్రతిపాదన పూర్తి వివరాలు ఇంకా బహిర్గతం కాలేదు. అందువల్ల, ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్ నిబంధన యథావిధిగా అమల్లో ఉంది. తదుపరి దశలో ఈ ప్రతిపాదిత నియమాన్ని ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించి, ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తారు. ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుత నిబంధన ప్రకారం హెచ్1బీ, ఎల్1, ఒ1 వంటి తాత్కాలిక ఉపాధి వీసాలపై ఉన్నవారు ఉద్యోగం కోల్పోతే 60 రోజుల వరకు అమెరికాలో ఉండవచ్చు. ఈ సమయంలో వారు కొత్త స్పాన్సర్‌ను వెతుక్కోవడం, ఇమ్మిగ్రేషన్ స్టేటస్ మార్చుకోవడం లేదా దేశం విడిచి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు. ఈ ప్రతిపాదనపై ప్రెసిడెంట్స్ అడ్వైజరీ కమిషన్ ఆన్ ఏషియన్ అమెరికన్స్ మాజీ సభ్యుడు అజయ్ జైన్ భూటోరియా తీవ్రంగా స్పందించారు. ఇది అమానవీయమైన, ఆచరణకు సాధ్యం కాని నిర్ణయమని ఆయన విమర్శించారు. "ఉద్యోగం కోల్పోయిన నిపుణులకు 60 రోజుల సమయమే చాలా తక్కువ. అలాంటిది దాన్ని పూర్తిగా తొలగిస్తే, ఆ కుటుంబాలు తమ ఇళ్లు సర్దుకోవడానికి, పిల్లల చదువుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి కూడా సమయం ఉండదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## వేదిక శుద్ధీకరణపై భగ్గుమన్న రాహుల్

### బిజెపిలో గూడుకట్టిన అంటరానితనానికి నిదర్శనమని ధ్వజం




**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. ఒక ర్యాలీ కోసం ఖర్గే పాల్గొన్న వేదికను శుభ్రం చేయడాన్ని రాహుల్ తప్పుబట్టారు. అలా చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. మల్లికార్జునఖర్గే కొద్దిరోజులక్రితం ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఒక ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఒక వేదిక నుంచి ప్రసంగించారు. మరుసటి రోజు కొందరు బిజెపి అనుకూల నాయకులు ఖర్గే పాల్గొన్న ఆ వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. శుద్ధీకరణ ప్రక్రియ చేపట్టారు. దీనిపై ఖర్గే మండిపడ్డారు. తాను పాల్గొన్న వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో అక్కడి బిజెపి ప్రభుత్వంపై కూడా మండిపడ్డారు. తాజాగా ఈ అంశంపై రాహుల్ గాంధీ మాట్లాడారు. ఖర్గే పాల్గొన్న వేదికఉన్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం అంటరానితనానికి సూచనగా రాహుల్ అభివర్ణించారు. ఈ చర్య దళితులపై బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల వైఖరికి నిదర్శనం అన్నారు. దళితుల విషయంలో ఆ పార్టీ నేతలు ఎలా వ్యవహరిస్తారో తెలుస్తోందన్నారు. ఈ చర్యకు పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ప్రధాని చొరవ చూపాలని ఆయన కోరారు. ఈవిషయంలో ప్రధాని మోడీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వంతోపాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఖర్గే అంశంలో న్యాయం చేయాలని సూచించారు.

## ఉక్రెయిన్ రాజధానిపై రష్యా క్షిపణుల దాడి

**కీవ్, ఆగస్టు 29:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా క్షిపణులతో విరుచుకుపడింది. కీవ్‌సమీపంలోని బుచాజిల్లాలో 27 మంది మరణించారు. ఈ దాడుల్లో 50 ఇళ్లు దెబ్బతిన్నాయని స్థానిక అధికారులు తెలిపారు. దాడుల కారణంగా భారీ అగ్ని ప్రమాదం జరిగిందని, పలుచోట్ల నివాసాలు దెబ్బతిన్నట్లు చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ మైలా గ్రామంలోని ఓ గోదాముపై దాడి జరిగిందని, తర్వాత భారీ పేలుడు సంభవించిందని తెలిపారు. ఆ ప్రాంతంలో ఎలాంటి పేలుడు సామాగ్రి ఉంచారనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. నివాస ప్రాంతాల్లో మందుగుండు సామాగ్రి చేయడంపై నిల్వ సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు చెప్పారు. ఇప్పటికే 370 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరసగా మూడు రోజుల నుంచి కీవ్‌ను రష్యా టార్గెట్ చేస్తోంది. రాజధాని ప్రాంతంపై రష్యా నిరంతరం వైమానిక దాడులు చేస్తోంది.

## ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ఎఫ్ఎస్ఎస్ఎఐ కొత్త ప్రతిపాదనలు

### సుప్రీంకోర్టుకు ముసాయిదా అందజేత

**న్యూఢిల్లీ,ఆ గస్టు 29:** ప్యాకేజ్డ్ ఫుడ్స్ పరంగా కేంద్ర ఆహారభద్రతా ప్రమాణాల సంస్థ ఎఫ్ఎస్ఎస్ఎఐ కొత్తప్రతిపాదనలను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఫ్రంట్ ఆఫ్ ప్యాకెట్ వార్నింగ్ లేబుల్స్‌కు సంబంధించి దాఖలైన కేసులో సుప్రీంకోర్టు గతంలో ఎఫ్ఎస్ఎస్ఏఐకి కీలక సూచనలు చేసింది. ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ఆ ఆహారానికి సంబంధించిన ప్రభావాల్ని చూపించే లేబుల్స్ ఉండేలా చూడాలని కోర్టు ఆదేశించింది. దీనివల్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇస్తున్న ఫుడ్ ఎలాంటిదో ఒక అంచనాకు రాగలుగుతారు అని కోర్టు అభిప్రాయపడింది. ఈ వార్నింగ్ లేబుల్స్‌ను అమలు చేయడంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆలస్యం చేసింది. దీనిపై స్పందించిన కోర్టు ఆహార తయారీ సంస్థలు, కార్పొరేట్ సంస్థల నుంచి ఎఫ్ఎస్ఎస్ఏఐపై ఒత్తిడి ఉన్నట్లు గుర్తించింది. దీనివల్ల ప్రజల ఆరోగ్యం విషయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టమవుతోందని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. దీనిపై స్పందించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా కోర్టుకు ఆరు పేజీల అఫిడవిట్ సమర్పించింది. ఎక్కువ ఉప్పు, ఎక్కువ కొవ్వు, ఎక్కువ చక్కెర ఉండే పదార్థాలున్న ఫుడ్ ప్యాకేజ్‌పై రెడ్ లేబుల్ ఉండేలా చూస్తామని కోర్టుకు తెలిపింది. కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లోని కీలక అంశాలివి. ప్యాకెట్ల ముందు భాగంలో ఆరు కోణాలుండే ఎరుపు రంగు మార్క్ ఉంటుంది. దీనర్థం ఆ ప్రొడక్ట్‌లో అధిక చక్కెర, అధిక ఉప్పు, అధిక కొవ్వు ఉన్నాయని. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఆఫ్ ద ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ 2024లో సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా ఒక ఉత్పత్తిలోని పోషక విలువల్నిగుర్తిస్తారు. ఈప్రమాణాల ప్రకారం అధిక స్థాయిలో హానికర పదార్థాలుంటే రెడ్ లేబుల్ వేస్తారు. ముందు వైపు పెద్ద సైజులో రెడ్ లేబుల్ వేయడం వల్ల అది చాలా హానికరం అని పిల్లలు, తల్లిదండ్రులు గుర్తించే వీలుంది. అయితే, సహజసిద్ధమైన ఉత్పత్తులకు ఈ రూల్ వర్తించదు. అంటే తేనె, నెయ్యి, ఉప్పు, చక్కెర, నూనె వంటి వాటికి మినహాయింపు ఉంటుంది. ప్రస్తుతం సుప్రీంకోర్టుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ తన అఫిడవిట్ సమర్పించింది. దీనిపై మరో 10 రోజుల తర్వాత విచారణ జరగనుంది. ఆ తర్వాత ఈ నిబంధన అమలుపై కోర్టు నిర్ణయం తీసుకుంటుంది.

# సంక్షిప్త వార్తలు

## ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన రష్యా

**మాస్కో, ఆగస్టు 29:** ఒకవైపు ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తూనే రష్యా తన అత్యాధునిక ఆయుధాలను పరీక్షిస్తున్నది. తాజాగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్‌ను పరీక్షించినట్లు చెప్పింది. ఆర్కన్‌గెల్స్క్ ప్రాంతంలో పెసస్క్ కాస్మోడ్రోమ్ నుంచి వార్‌హెడ్‌ను పరీక్షించారు. అయితే ఆ క్షిపణి ఈశాన్య దిక్కుకు ప్రయాణించింది.



## టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీపై కేసునమోదు

**కోల్‌కతా, ఆగస్టు 29:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీపై కేసు నమోదైంది. కోల్‌కతా పోలీసులు ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కోల్‌కతా హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారనే ఆరోపణలపై కోల్‌కతా హేస్టింగ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఈ కేసు నమోదైంది. ఈ వ్యవహారం రాజకీయ దుమారానికి దారి తీసింది. తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని మమత బెనర్జీ తప్పు పట్టారు.

## భారత్ సరిహద్దుల్లోకి పాక్ డ్రోన్

**శ్రీనగర్,ఆగస్టు 29:** భారత సరిహద్దుల్లో అలజడి సృష్టించేందుకు పాకిస్తాన్ మళ్లీ కుట్రలకు తెరలేపింది. జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంట శత్రు దేశం నుంచి వచ్చిన డ్రోన్ ఒకటి ప్రత్యక్షం కావడంతో సరిహద్దులో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. పూంచ్ జిల్లా సరిహద్దుల్లో ఈ సస్పెక్టెడ్ డ్రోన్ కదలికలు కనిపించడంతో మన రక్షణ దళాలు తక్షణమే అప్రమత్తమయ్యాయి. సరిహద్దుల్లోని ఆర్మీ బలగాలు రాత్రికి రాత్రే అదనపు నిఘాను ఏర్పాటు చేసి, సరిహద్దు ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.

## ఘోరప్రమాదం, నలుగురు విద్యార్థులు మృతి

**మధురాంతకం, ఆగస్టు 29:** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మదురాంతకం సమీపంలో ఓ కారు అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో నలుగురు విద్యార్థులు మృతి చెందారు. మరో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. పుదుచ్చేరి టూర్ ముగించుకుని చెన్నైకి తిరిగి వస్తుండగా ఈ విషాద ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా వెనుక టైరు పేలడంతో వాహనం అదుపుతప్పినట్లు సమాచారం. దీంతో కారు పలుమార్లు పల్టీలు కొట్టినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు విద్యార్థులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

## జావోజోంగ్‌పై జిన్‌పింగ్ వేటు

**బీజింగ్, ఆగస్టు 29:** చైనా సైన్యంలో కీలక జనరల్, 2017 డోక్లామ్, 2020 గల్వాన్ ఘర్షణకు బాధ్యుడిగా భావిస్తు జావో జోంగ్‌కిపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చర్యలు తీసుకున్నారు. జావోను చైనాలోని అత్యున్నత రాజకీయ సలహా సంస్థ అయిన చైనీస్ పీపుల్స్ పొలిటిషియన్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ నుంచి తొలగించడంతో పాటు మరో రెండు కీలక పదవుల నుంచి కూడా తప్పించారు. భారత సరిహద్దులో ఉన్న టిబెట్, షింజియాంగ్ ప్రావిన్సులతో పాటు భారత్‌చైనా సరిహద్దులోని చాలా ప్రాంతాలకు బాధ్యత వహించే పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ వెస్టర్న్ థియేటర్ కమాండ్‌కు జావో జోంగ్ నాయకత్వం వహించాడు.

## పురుఘల్ జైలులో సిఎం విజయ్ ఆకస్మిక తనిఖీలు

**చెన్నై, ఆగస్టు 29:** తమిళనాడు సిఎం జోసెఫ్ విజయ్ శుక్రవారం చెన్నై సమీపంలోని పురుఘల్ సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జైలు సదుపాయాలు, ఖైదీలకు అందుతున్న వైద్యం, ఆహారం, విద్య, వృత్తి శిక్షణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను కూడా తెలుసుకున్నారు. పురుఘల్ సెంట్రల్ ప్రిజన్1లోని పలు విభాగాలను సిఎం విజయ్ పరిశీలించారు.



# 2న పాయకరావుపేటకు సీఎం చంద్రబాబు

- జలహారతి కార్యక్రమానికి ఘనంగా ఏర్పాట్లు
- అధికారులతో మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర సమీక్ష

నక్కపల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త :

సీఎం చంద్రబాబు సెప్టెంబర్ 2న అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సీఎం పర్యటనకు (తరువాయి 8వ పేజీలో)




## గిరిజనుల ఆరోగ్యానికి 'సంజీవని'

### పేదరికం లేని కుటుంబాలే లక్ష్యం
### అరకు గిరిజన ప్రాంతంలో ప్రయోగాత్మకంగా పథకం ప్రారంభం..
### జీఓ నంబర్ 3కు ప్రత్యామ్నాయం త్వరలోనే: సీఎం చంద్రబాబు



పాడేరు/అరకులోయ, ఆగస్టు 29, ప్రభాతవార్త:

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పవిత్రమైన 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అరకులోయ మండలం గన్నెల పంచాయతీ కేంద్రంలోని గిరిజన ప్రాంతంలో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న 'సంజీవని' పథకం ప్రారంభోత్సవ సభ జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి గిరిజనులను ఉద్దేశించి ప్రసంగించారు. గిరిజన ప్రాంతాల్లో ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదన్నదే తమ ఆలోచన అని చంద్రబాబు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జీఓ నంబర్ 3ను తామే తీసుకువచ్చామని గుర్తుచేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో సుప్రీంకోర్టు దానిని రద్దు చేసిందని, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలోనే తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఐదు సూత్రాలతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని సీఎం తెలిపారు. 'అడవితల్లి బాట' పేరుతో రూ.1,000 కోట్లతో 900 కిలోమీటర్ల రహదారులు వేశామని, 1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు, సౌర పైకప్పు విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పెరిగేలా అరకు కాఫీని మరో లక్ష ఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగిందని, గృహ వసతి ద్వారా గిరిజన కుటుంబాలకు ఆదాయం సమకూరుతుందని సీఎం అన్నారు. పరిశ్రమల్లో గిరిజన యువతకు ఉద్యోగాలు లభించేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తామని, వచ్చే మూడేళ్లలో లక్ష మంది యువతకు నైపుణ్య శిక్షణ అందించాలన్నదే తమ ఆలోచన అన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం జిల్లాలో 150 వాహనాలతో అత్యవసర జీవనరేఖ వ్యవస్థ ఉందని తెలిపారు. కొండ ఎంత దూరంలో ఉన్నా వైద్యం గిరిజనుల వద్దకే రావాలని, ప్రతి గిరిజన బిడ్డ ఆరోగ్యంగా ఎదగాలన్న ఉద్దేశంతో సంజీవని పథకాన్ని తీసుకొచ్చామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవల కోసం రూ.250 కోట్లతో గిరిజన ఆరోగ్య మౌలిక సదుపాయాల పూర్తి కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. సికిల్ సెల్, తలసేమియా బాధితులకు (తరువాయి 8వ పేజీలో)



**అరకు కాఫీ త్రాగుతూ, చంద్రబాబు రిలాక్స్..**

సంజీవని పథకం ప్రారంభ సభకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులు ఇచ్చిన అరకు కాఫీ త్రాగుతూ కొంత సేపు సభావేదికపై రిలాక్స్ అయ్యారు. ఐతే కాఫీ త్రాగుతూ జిల్లా కలెక్టర్ నిశాంతి ప్రసంగాన్ని వింటూ కనిపించారు.

## రేపు వైజాగ్‌లో కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ

**సమీక్షా సమావేశంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్**




విశాఖపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త :

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ మహోత్స వాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 31వ తేదీ (సోమవారం) విశాఖ పట్నంలో జరగనున్న ఈ విగ్రహా విష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, ఐటీసీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ (తరువాయి 8వ పేజీలో)

## సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

**చింతకాయల రాజేష్ పిలుపు**

**సెప్టెంబరు 4న స్పీకర్ అయ్యన్నపాత్రుడు పుట్టినరోజు పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరం**




నర్సీపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త :

ఉత్తరాంధ్ర ముఖద్వారమైన పాయకరావుపేటలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టనున్న పర్యటనను భారీ జనసమీకరణతో విజయవంతం చేయాలని నర్సీపట్నం పట్టణ టీడీపీ అధ్యక్షులు చింతకాయల రాజేష్ పిలుపునిచ్చారు. శనివారం నర్సీపట్నంలో నిర్వహించిన నియోజకవర్గ మండల స్థాయి నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ (తరువాయి 8వ పేజీలో)

## ఏయూలో ఘనంగా ధ్యాన్‌చంద్ దినోత్సవం

**హాజరైన ఏయూ వీసీ ఆచార్య జీ.పీ.రాజశేఖర్, ఎమ్మెల్యే గణబాబు**



విశాఖపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త:

ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా హాకీ క్రీడా కారుడు మేజర్ ధ్యాన్ చంద్ క్రీడా దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.పీ రాజశేఖర్, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పిజివిఆర్ నాయుడు (గణబాబు) ముఖ్యఅతిథిగా హాజరై ఏయూ డిపార్ట్మెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం వద్ద (తరువాయి 8వ పేజీలో)

## అవంతి కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు



విశాఖపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త :

తగరపువలస, అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భారత హాకీ దిగ్గజం, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల (తరువాయి 8వ పేజీలో)

## శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**తెలుగు భాషను, సంస్కృతిని భావితరాలకు అందించాలి: ప్రముఖుల పిలుపు**



విశాఖపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త :

శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ జీర్ణకోశ వైద్య నిపుణులు పెద వీర్రాజు, కళారత్న డాక్టర్ మీగడ రామలింగస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి (తరువాయి 8వ పేజీలో)

## పెందుర్తిలో పెను విషాదం..

- ఇద్దరు చిన్నారులతో సహా దంపతుల ఆత్మహత్య
- పెందుర్తిలో కలచివేసిన ఘటన

విశాఖ క్రైమ్, ఆగస్టు 29 ప్రభాతవార్త

రాఖీ పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన ఆ కుటుంబంలో కొన్ని గంటల్లోనే పెను విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు చిన్నారులతో సహా దంపతులు మృతి చెందిన ఘటన విశాఖ నగరంలోని పెందుర్తి పరిధి చింతల అగ్రహారంలో తీవ్ర కలకలం రేపింది. కొత్తవలసకు చెందిన మల్లా వినోద్ కుమార్ కొంతకాలంగా జీవనోపాధి కోసం పెందుర్తిలోని అద్దె ఇంట్లో భార్య, ఇద్దరు చిన్నారులతో కలిసి నివాసం ఉంటున్నాడు. వినోద్ కుమార్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండగా ఆయన భార్య కాయగూరల వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. ఈ దంపతులకు రెండేళ్ల, మూడేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. రాఖీ పండుగ సందర్భంగా నిన్న కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపిన వినోద్ కుమార్ రాత్రి సమయంలో తన కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్ ద్వారా (తరువాయి 8వ పేజీలో)




## గాజువాకలో 'మెగా జాబ్ మేళా'కు విశేష స్పందన

- పరిశ్రమలకు అనుగుణంగా యువత నైపుణ్యం పెంచుకోవాలి
- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక,ఆగస్టు29,ప్రభాతవార్త :

ప్రైవేటు రంగాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శ్రీనగర్‌లోని టీఎస్ఆర్, టీబీకే కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన 'మెగా జాబ్ మేళా'ను ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో కలిసి ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. తన (తరువాయి 8వ పేజీలో)



## వచ్చే నెల 26, 27వ తేదీల్లో 'విశాఖ నృత్యోత్సవ్ 2026'

- లోగో-పోస్టర్లను ఆవిష్కరించిన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు
- దేశం నలు మూలల నుంచి కళాకారుల ఆగమనం



విశాఖపట్నం, ఆగస్టు 29 ప్రభాతవార్త :

నగరానికి చెందిన ప్రఖ్యాత నటరాజ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ తమ 18వ ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహ ణకు తొలి అడుగే సింది. అందుకు సంబంధించిన "విశాఖ నృత్యోత్సవ్ 2026" అధికారిక లోగో డాన్స్ ఫెస్టివల్ పోస్టర్లను ఒడిశా గౌరవ గవర్నర్ కంభంపాటి హరి బాబు శనివారం విశాఖపట్నంలో ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణ మూర్తి, ఫెస్టివల్ డైరెక్టర్ విక్రమ్ గౌడ్, ఫెస్టివల్ కోఆర్డినేటర్ భాగ్యశ్రీ బత్తిన గవర్నర్ తో కలిసి అధికారిక ప్రచార పత్రాలను విడుదల చేశారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు సాయంత్రం 6:00 గంటల నుండి స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. భారతదేశం నలుమూలల నుండి వచ్చే ప్రముఖ నృత్య కళాకారులు, కళా బృందాలు ఈ వేదికపై వివిధ శాస్త్రీయ, జానపద నృత్య రీతులను ప్రదర్శించనున్నారు. మొదటి రోజు సెప్టెంబర్ (తరువాయి 8వ పేజీలో)

## అరకులో ఈ-సంజీవని టెలిమెడిసిన్ సేవలు ప్రారంభం

**కేజీహెచ్ వైద్య నిపుణులతో సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు వైద్య సలహాలు**

**గన్నెల పీహెచ్సీ ఆర్కెనగర్‌లో ప్రారంభించిన సిఎం.హెల్త్ మినిస్టర్**




విశాఖపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త :

దూర ప్రాంతాల్లోని ప్రజలకు ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను సులభంగా ఆన్లైన్లో అందించే ఈ-సంజీవని టెలిమెడిసిన్ సేవలను,అరుకువేలీ మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్సీ) పరిధిలో గల ఆర్.కె.నగర్ గ్రామంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, (తరువాయి 8వ పేజీలో)

## మృత పోలీసు కుటుంబాలకు యూనియన్ బ్యాంక్ అండ

**రూ.1.50 కోట్ల విలువైన మరణ బీమా పరిహారం చెక్కుల పంపిణీ**



విశాఖపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త:

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో పోలీసు జీతాల ఖాతా ప్యాకేజీ కింద మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు మొత్తం రూ.1.50 కోట్ల విలువైన మరణ బీమా పరిహారం చెక్కులను అందజేశారు. విశాఖపట్నం (తరువాయి 8వ పేజీలో)

## వైజాగ్‌లో రాష్ట్ర యోగ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పారంభం

**పోటీలను ప్రారంభించిన జన సేన నాయకుడు కె.శ్రీనివాస్‌రావు**




8లో

## ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును కలిసిన
# ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



విశాఖపట్నంఆగష్టు 29 ప్రభాత వార్త :
విశాఖపట్నం విచ్చేసిన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబుని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ కంభంపాటి హరిబాబు ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం ఇరువురు పరస్పరం ఆత్మీయంగా కొద్ది సేపు మాట్లాడు కున్నారు.

## విశాఖలో వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం



విశాఖపట్నం, ఆగష్టు 29, ప్రభాతవార్త :
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ పార్టీ నేత, రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి శని వారం విశాఖ పట్నం విచ్చేశారు. ఈ సంద ర్భంగా విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు ఆయనకు ఘన స్వాగతం పలి కారు. ఈ కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు ఎంవివి సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు చింతలపూడి వెంకట రామయ్య, పార్టీ ముఖ్య నాయకులు జీవి వెంకటేశ్వర్లు, రవి రెడ్డి, కట్ట మూరి సతీష్, బాణాల శ్రీనివాసరావు, కొండ రాజీవ్ గాంధీ, మంచా నాగమ ల్లేశ్వరి, అల్లు శంకర్ రావు, గుడివాడ సతీష్, రేయ్యి వెంకటరమణ, మహమ్మద్ ఇమ్రాన్, శైలేష్, ప్రేమ్, జీ. సతీష్, భవన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు వైజాగ్‌లో కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ

(7వ పేజీ తరువాయి)

ముఖ్య అతిథిగా హాజరై, రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించ నున్నారని తెలిపారు . ఈ కార్యక్రమ ఏర్పాట్లపై విశాఖ జిల్లా ఆర్యవైశ్య నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లతో దూండి రాకేష్ శనివారం నగరంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌక్యానికి, ఆర్థిక క్రమశిక్షణకు మారు పేరైన రోశయ్య విగ్రహాన్ని వైజాగ్‌లో ఆవిష్కరించుకోవడం గర్వకారణమ న్నారు. మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా జరిగే ఈ విగ్రహావిష్కరణ మహోత్సవానికి ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు, సమాజ బంధు వులు భారీసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పైడ కృష్ణ ప్రసాద్ పలువురు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు, సంఘం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

(7వ పేజీ తరువాయి)

సందర్భంగా రాజేష్ మాట్లా డుతూ, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం కార్యరూపం దాల్చేలా సెప్టెంబరు 2న పాయకరావుపేటలోని తాండవ చక్కెర కర్మాగారం వెనుక ఉన్న పోలవరం ఎడమ కాలువ వద్ద ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు 'జలహారతి' ఇవ్వనున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి నర్సీపట్నం నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 4న నియోజకవర్గంలో భారీ ఎత్తున 'మెగా రక్తదాన శిబిరం' నిర్వహిస్తున్నట్లు రాజేష్ వెల్లడించారు. నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రాంతీయ వైద్యశాలతో పాటు బొడ్డేపల్లి మార్కెట్ యార్డులో ఈ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది వెయ్యి మందికి పైగా రక్తదానం చేసి ఆపదలో ఉన్న ఎందరో ప్రాణాలను కాపాడారని, ఈ ఏడాది మరింత ఎక్కువ మంది రక్తదాతలను సమీకరించి సరికొత్త రికార్డు సృష్టించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.
?ఈ సన్నాహక సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, నర్సీపట్నం పట్టణంలోని 28 వార్డుల ఇన్చార్జిలు, విస్తృత స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవంతిలో ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు

(7వ పేజీ తరువాయి)

ప్రాంగణంలో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులకు క్రీడల ప్రాధాన్యత, శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మరియు జట్టు స్ఫూర్తి గురించి అవగాహన కల్పించారు. క్రీడలు విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసం, పట్టుదల, సమయపాలన, సహకార భావన వంటి విలువలను అభివృద్ధి చేస్తాయని అలాగే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొని తమ ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఫుట్బాల్ వంటి పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులను కళాశాల యాజమాన్య ప్రతినిధులు శ్రీ ఎమ్.వి.వి.ఎస్. నందీష్ బాబు గారు సమక్షంలో అందచేశారు. ప్రిన్సిపాల్ డా. బి. మురళీకృష్ణ గారు, డైరెక్టర్ డా. ఎ. చంద్రశేఖర్ గారు, ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. పూర్ణ నాగశ్రీ గారు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పిన్నింటి రామకృష్ణ గారు, శారీరక విద్యా విభాగ సిబ్బంది కోలా చంద్రశేఖర్, చంద్రరావు, శంకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## పెందుర్తిలో పెను విషాదం..

(7వ పేజీ తరువాయి)

'రిప్' అంటూ ఆంగ్లంలో సందేశం పంపినట్లు సమాచారం. అనంతరం కుటుంబంలో విషాద ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని వినోద్ కుమార్ భార్య, ఇద్దరు చిన్నారులను ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వినోద్ కుమార్ కూడా మృతి చెందడంతో ఒకే కుటుంబంలో నలుగురి ప్రాణాలు కోల్పోయిన విషాదం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. రాఖీ పండుగ రోజున కుటుంబ సభ్యులతో నవ్వుతూ గడిపిన కుటుంబం.. కొద్దిగంటల్లోనే ఇలా విషాదంలో మునిగిపోవడంపై బంధువులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతు న్నారు.ఘటనపై పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనకు దారితీసిన పూర్తి కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## వచ్చే నెల 26,27 తేదీల్లో 'విశాఖ నృత్యోత్సవ్ 2026'

(7వ పేజీ తరువాయి)

26న గీతా నారాయణ్ సడగాణి (ఆంధ్రప్రదేశ్) చే కూచిపూడి, పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనా జవేరి గ్రూప్ (మహారాష్ట్ర) మణిపూరి, హరి రెడ్డి గ్రూప్ (కర్ణాటక) చే కథక్ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే రెండో రోజు సెప్టెంబర్ 27న కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వసుంధర దొరస్వామి బృందం (కర్ణాటక)భరతనాట్యం, మరియు అఫ్సాన్ గుజరాత్ బృందం (రాజస్థాన్) చే చారీ జానపద నృత్య ప్రదర్శనలు జరగనున్నాయన్నారు. గత 17 సంవత్సరాల నుంచి భారతీయ సంప్రదాయ నృత్య కళల్ని, సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ విశాఖ నృత్యోత్సవ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇది 18 వ నృత్యోత్సవమని, అందరు తరలి రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# గిరిజనుల ఆరోగ్యానికి 'సంజీవని'

(7వ పేజీ తరువాయి)

నెలకు రూ.10 వేల పింఛను అందిస్తున్నామని, గిరిజన బిడ్డలు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదవాలనే ఉద్దేశంతో ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఐఐటీ, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామ న్నారు. గిరిజన రైతులు తమ ఉత్పత్తులతో ప్రపంచస్థాయి బ్రాండ్ సృష్టించాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని చంద్రబాబు అన్నారు. విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాల తయారీ కేంద్రం ప్రపంచస్థాయిలో వైద్య పరికరాలను తయారు చేస్తోందని, ఆ ఉత్పత్తులను అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం ద్వారా ప్రపంచానికి ఎగుమతి చేసే అవకాశం ఉందన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో తక్కువ ధరకే మందులు అందించే జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. ఇంటి వద్దే 42 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించే సేవలను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు.
సెప్టెంబర్ 2న అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి నీటిని తీసుకువస్తున్నామని సీఎం తెలిపారు. గత పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామని, గిరిజన ప్రాంతాలకు గంజాయి ద్వారా వచ్చిన చెడ్డపేరును మార్చేందుకు కాఫీ, మిరియాలు వంటి ప్రత్యామ్నాయ పంటల ద్వారా ఆదాయ మార్గాలు చూపుతున్నామని చెప్పారు.
గత పాలనలో పోటీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని చంద్రబాబు ఆరోపించారు. దేవాలయాల ప్రతిష్టను దెబ్బతీశారని, బలవంతపు మత మార్పిడులకు ప్రయత్నించారని విమర్శించారు. మత విశ్వాసాలను ఎవరూ తప్పుపట్టరని, అయితే బలవంతంగా మత మార్పిడి చేయడం సరికాదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తోందని సీఎం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష నాయకులు కొత్త రాగాలు తీస్తున్నారని విమర్శించారు.

### వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు..

అరకు నియోజకవర్గ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా 'సంజీవని' పథకాన్ని ప్రారంభించామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానంతో వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోగులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే వైద్య సేవలు, ఫోన్ ద్వారా వైద్య సలహాలు, వైద్య నియామకాలు, ఉచిత మందుల పంపిణీ జరుగుతుందని చెప్పారు. గిరిజన గ్రామాల నుంచి రక్తం, థైరాయిడ్, కామెర్లు తదితర పరీక్షల నమూనాలను దూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా గ్రామాల నుంచే నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించేలా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,200 కోట్లతో 4,500 ఆరోగ్య మందిరాల నిర్మాణాన్ని వేగవంతం చేశామని, ఇందులో రూ.230 కోట్లు అరకు పార్లమెంట్ నియోజకవర్గానికే కేటాయించామని మంత్రి వెల్లడించారు. అరకు పార్లమెంట్ పరిధిలో 435 ఆరోగ్య మందిరాలు, 28 ప్రయోగశాలలు, ఎనిమిది కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం జరుగుతోందన్నారు.
పాడేరు వైద్య కళాశాల నిర్మాణాన్ని రాష్ట్ర బడ్జెట్ నుంచి అదనపు నిధులు కేటాయించి పూర్తి చేస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతల కోసం 500 కొత్త తల్లి--బిడ్డ వాహనాలను ప్రారంభించామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, ఆర్టీసీ చైర్మన్ దొన్ను దొర, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ, వివిధ శాఖల అధికారులు, తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, వేలాది మంది గిరిజనులు పాల్గొన్నారు.

# ఏయూలో ఘనంగా ధ్యాన్‌చంద్ దినోత్సవం

(7వ పేజీ తరువాయి)

ఉన్న హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలదండలు వేసి వందనం చేసారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు వీసీ రాజశేఖర్ స్వీట్లు పంపిణి చేసారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పిజివిఆర్ నాయుడు (గణబాబు) మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా హాకీ క్రీడా దిగ్గజం ధ్యాన్చంద్ పుట్టిన రోజు పురస్కరించుకు జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించడం జరుగుతుంద న్నారు. విశాఖలో క్రీడా మౌలిక వసతులు అభివృద్ధి చేసి విశాఖను జాతీయ స్థాయి క్రీడలకు ప్రధాన వేదిక అయిందన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ ఒలింపిక్స్‌లో ఎక్కువ సార్లు బంగారు పతకాలు సాదించి భారతదేశానికి మంచి పేరుప్రతిష్టలు తెచ్చార న్నారు. హాకీ పేరు వినగానే ప్రపంచంలోనే హాకీలో భారత్‌కి మంచి గుర్తింపు తెచ్చార న్నారు. ఈసందర్భంగా ఆయన పుట్టిన రోజు నాడు జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించే విధంగా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంద న్నారు. క్రీడాకారులు ధ్యాన్ చంద్‌ను రోల్ మోడల్ గా తీసుకోవాలని ఎమ్మెల్యే గణబాబు సూచించారు. వివిధ క్రీడా సంఘాలు ఒలింపిక్ అసోసియేషన్, వ్యాయామ విద్యా విభాగం, అన్ని క్రీడా సంఘాలు ఈ క్రీడాదినోత్సవంలో పాల్గొనడం అభినందనీయంగా తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్ విజయమోహన్ మాట్లాడుతూ క్రీడాకారులకు, వివిధ క్రీడా సంఘాలకు జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏయూలో ఉన్న వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, ఆచార్య ఎం.వి.ఆర్. రాజు, ఆచార్య కె. వెంకటసుబ్బయ్య, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య జి. గిరిజా శంకర్, ఏయూ వ్యాయామ విద్యావిభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ డీన్ ఆచార్య ఎస్. హరనాథ్, ది జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్, మాజీ పోలీస్ అధికారి టి.ఎస్.ఆర్ ప్రసాద్ జనరల్ సెక్రటరీ కె. సూర్యనారాయణ, ఎపి బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనందబాబు, జీవిఎంపీ క్రీడా డైరెక్టర్ అప్పల నాయుడు, రవిరాజు, రెడ్డి శ్రీనివాసరావు, లక్ష్మణదేవ్, బాక్సింగ్ కోచ్ ఐ వెంకటేష్ శ్వరరావు, జోగారావు, డి. శంకరరావు, కేశవా, ఏ యూ సెక్కురిటి డీన్ ఆచార్య ఆశా ఇమ్మానిల్ రాజ్ డాక్టర్ జి.ఎస్.వర్మ తదితర క్రీడాకారులు, ఎంపీఈడి పి జి విద్యార్థులు, ఎన్ సీ సీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అరకులో ఈ-సంజీవని టెలిమెడిసిన్ సేవలు ప్రారంభం

(7వ పేజీ తరువాయి)

ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లుశనివారంప్రారంభించారు. ఈ-సంజీవని ద్వారా దూర ప్రాంతాల్లోని రోగులు తమ సమీప ప్రాదమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు పొందుతూ, అవసరమైనప్పుడు కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్) వంటి పెద్ద ఆసుపత్రుల్లోని ప్రత్యేక వైద్య నిపుణుల సలహాలను ఆన్లైన్ ద్వారా పొందే అవకాశం ఉంటుంది. స్థానిక వైద్యాధికారులు రోగికి సంబంధించిన వైద్య చరిత్ర, పరీక్షల ఫలితాలు, ఇతర అవసరమైన వివరాలను నిపుణులకు అందిస్తారు. వాటిని పరిశీలించిన అనంతరం నిపుణులు రోగికి తగిన వైద్య సలహాలు, చికిత్సాసూచనలు అందిస్తారు. ఈ సందర్భంగా అరకు ప్రాంతానికి చెందిన సికిల్ సెల్ అనీమియా వ్యాధిగ్రస్తులు వారి కుటుంబ సభ్యులు తొలి ఈ-సంజీవని టెలిమెడిసిన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అరకు వైద్యాధికారులు రోగుల ఆరోగ్య పరిస్థితి, ఇప్పటికే నిర్వహించిన వైద్య పరీక్షలు, ఇతర వివరాలను కేజీహెచ్ వైద్య నిపుణులకు వివరించారు. కేజీహెచ్ నుంచి హెమటాలజీ, పీడియాట్రిక్స్, ప్రసూతి, స్త్రీల వ్యాధుల (గైనిక్), జనరల్ మెడిసిన్ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు రోగుల వివరాలను పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా అవసరమైన వైద్య సలహాలు చికిత్సా సూచనలు అందించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తో కలసి స్వయంగా వీక్షించారు. హెల్త్ సెక్రటరీ వీరపాండియన్ , కమీషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చక్రధర్ బాబు తదితర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ-సంజీవని ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు కేజీహెచ్ వంటి ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ అనీమియా వంటి దీర్ఘకాలికవ్యాధులతో బాధపడుతున్న వారికి తరచుగా ప్రత్యేక వైద్య నిపుణులసలహాలుఅవసరమవుతాయని,ఈ-సంజీవని ద్వారా వారు తమ ప్రాంతం నుంచే నిపుణుల సలహాలు పొందే అవకాశం కలుగుతుందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ తొలి ఈ-సంజీవని కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఎంతో మంచి అనుభవంగా ఉందని కె.జి.హెచ్. సూపరింటెండెంట్ డాక్టర్. ఐ.వాణి తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అరకు వైద్యాధికారులు, కేజీహెచ్ వైద్య నిపుణులు సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.జి.హెచ్, సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి తో పాటు కె.జి. హెచ్ నుండి పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్. బి.యస్.చక్రవర్తి, గైనికాలజీ విభాగాధిపతి డాక్టర్ .జి.శైలజ, జనరల్ మెడిసిన్ ప్రొపెసర్ డాక్టర్. వి.సత్యప్రసాద్, డాక్టర్ .ఆర్. విక్రమ్ వర్ధన్, హిమాటాలజీ వైద్య నిపుణులు డాక్టర్ యు.రమేశ్, ఫాధాలజి విభాగం నుండి డాక్టర్ యస్.శ్రీదేవి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ .బి.కిరణ్ కుమార్, కె.జి. హెచ్.అడ్మినిస్ట్రేటర్, డిప్యూటి కలెక్టర్ బి.వి. రమణ పాల్గొన్నారు.

# 2న పాయకరావుపేటకు సీఎం చంద్రబాబు

(7వ పేజీ తరువాయి)

సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు సమగ్రంగా వివరించగా.. మంత్రులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్య మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. సీఎం చంద్రబాబు పాయకరావు పేట నియోజకవర్గానికి మూడోసారి రాబోతు న్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పటి నుంచో ఆంధ్రప్రదేశ్ ప్రజల కలగా ఉందని, ఆ కలను సాకారం చేస్తున్న నాయకుడు సీఎం చంద్రబాబు అని అన్నారు. సముద్రంలో కలిసి పోతున్న గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందని హోం మంత్రి పేర్కొన్నారు. గోదావరి జలాలు అందుబాటులోకి రావడం వల్ల అనకాపల్లి జిల్లాలోని రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. గోదావరి జలాలకు ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రజలు, అధికారులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 ఉత్తరాంధ్ర జిల్లాలకు పండుగ రోజు వంటిదని పేర్కొన్న ఆమె.. సీఎం పర్యటన సందర్భంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి వంటిదని అన్నారు. సెప్టెంబర్ 2న సీఎం చంద్రబాబు పాయకరావుపేట నియోజకవర్గానికి రానున్న నేపథ్యంలో సీఎం పర్యటనలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జలహారతి కార్యక్రమా న్ని నిర్వహించాలని అధికారులకు సూచిం చారు. సీఎం పర్యటనకు వేలాది మంది ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కొల్లు రవీంద్ర సూచించారు. సభా ప్రాంగణం, రహదారులు, పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకురావడం ద్వారా ఈ ప్రాంత వ్యవసాయానికి మరింత ఊతం లభిస్తుందని మంత్రులు పేర్కొన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడంతో పాటు జలహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనకాపల్లి జిల్లా తరపున సీఎం చంద్రబాబుకి ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు.

# డబుల్ ఇంజిన్ కాదు.. డబుల్ రేట్ల సర్కార్

### ధరలు తగ్గించలేక చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు: ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

విశాఖపట్నం, ఆగష్టు 29, ప్రభాతవార్త:
కూటమి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యులపై భారం మోపుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విమర్శించారు. శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుది 'విజనరీ పాలన' కాదని, 'బాదుడే బాదుడు పాలన' అని ఎద్దేవా చేశారు. ధరలను నియంత్రించలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయా లు చేస్తున్నారని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, కూరగాయలు, వంట నూనెల ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బందులు పడుతు న్నారని,



తక్షణమే ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల కోసం వైఎస్ జగన్ హయాంలో అమలు చేసిన వైద్య సేవలకు కొత్త పేర్లు పెట్టి కూటమి ప్రభుత్వం కీర్తి పొందాలని చూస్తోందని విమర్శించారు. చంద్రబాబు ప్రకటించిన 'సంజీవని' పథకం కొత్తది కాదని, ఇది కేవలం పేరు మార్పు మాత్రమేనన్నారు. ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ ఆరోగ్య క్లినిక్‌లు, కుటుంబ వైద్యుడు, దూర వైద్య సేవలు వంటి కార్యక్రమాలను తమ ప్రభుత్వమే అమలు చేసిందని తెలిపారు.
పాడేరు వైద్య కళాశాల సీట్లను తగ్గించారని, గిరిజన సంక్షేమానికి నష్టం చేసే చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని కళ్యాణి డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలను వెంటనే తగ్గించకపోతే ప్రజల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## వైజాగ్ లో రాష్ట్ర యోగ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ 2026 ప్రారంభం

### పోటీలను ప్రారంభించిన జన సేన నాయకుడు కె.శ్రీనివాస్ రావు

విశాఖపట్నం, ఆగష్టు 29, ప్రభాత వార్త :
విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోరాష్ట్ర స్థాయి యోగ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ 2026 పోటీలు దక్షిణ నియోజకవర్గంలోని మున్సిపల్ స్టేడియంలో శనివారం ఘనంగా ప్రారంభమాయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి, జనసేన సీనియర్ నాయకులు కోసూరు శ్రీనివాసరావు హాజ రయ్యారు.ఈ సందర్భంగా విశాఖ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కోసూరు శ్రీనివాసరావుని శాలువతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా కోసూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగ సాధన వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని విద్యార్థి దశ నుండే యోగాను ప్రతి ఒక్కరు అభ్యసించాలని యోగా సాధన ద్వారా శారీరిక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం కూడా స్థిరంగా ఉంటుందని తెలియజేశారు. గత సంవత్సరం విశాఖపట్నంలో జాతీయ యోగా దినోత్సవం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నామని అన్నారు ఆ ప్రోగ్రాం ద్వారా రాష్ట్రంలో అందరికీ యోగా మీద మంచి అవగాహన కలిగిందని ప్రతి ఒక్కరూ యోగాని అభ్యసిస్తున్నారని దీని కోసం ప్రభుత్వం కూడా అవేర్నెస్ కల్పిస్తుందని కోసూరు శ్రీనివాస్ రావు అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు ప్రతి సంవత్సరం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమాజంలో యోగ ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులుఅధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

(7వ పేజీ తరువాయి)

చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు.
విద్యార్థినీ విద్యార్థులు రాగయుక్తంగా భావంతో పద్యాలు ఆలపించడంతో పాటు తెలుగు తల్లి ఏకపాత్రాభినయం, తెలుగు పాటలతో ఆకట్టుకున్నారు. శ్రీ పెద వీర్రాజు మాట్లాడుతూ తెలుగు భాషకు ఇక్కడ పట్టాభిషేకం జరిగిందన్నారు. శ్రీకృష్ణదేవరాయలు ఏనాడో తెలుగు భాష గొప్పతనాన్ని చాటారని, మన భాషను కోల్పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నన్నయ, తిక్కన, ఎర్రన, పోతనతో పాటు పలువురు ప్రాచీన, ఆధునిక కవుల పద్యాలను విద్యార్థులకు వివరిస్తూ భాషా సాహిత్య విశిష్టతను వివరించారు.
డాక్టర్ మీగడ రామలింగస్వామి మాట్లాడుతూ శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో తెలుగు వెలుగుల జిలుగులు కనిపించాయన్నారు. వ్యవహారిక, గ్రాంథిక భాషలతో పాటు గిడుగు రామమూర్తి సేవలను వివరించారు. ప్రశ్నించడం ద్వారానే వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విదేశాల్లోనూ తెలుగుకు ఆదరణ ఉందని, మన భాషను, సంస్కృతిని మనమే తక్కువ చేసుకోకుండా భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించి తెలుగు బోధనలో మెలకువలు, పద్యాల సొగసును విద్యార్థులకు ఏ విధంగా నేర్పాలి, వివరించాలి అనే అంశాలపై ముఖ్య అతిథులు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ అభినందించారు.

## గాజువాకలో 'మెగా జాబ్ మేళా'కు విశేష స్పందన

(7వ పేజీ తరువాయి)

సొంత నిధులతో, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మేళాలో 100కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన యువతీ యువకులతో ప్రాంగణం కోలాహలంగా మారింది. కార్యక్రమంలో భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మృత పోలీసు కుటుంబాలకు యూనియన్ బ్యాంక్ అండ

(7వ పేజీ తరువాయి)

నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చీ, యూనియన్ బ్యాంక్ సహాయ జనరల్ మేనేజర్, ఈబీసీ అధిపతి పి. రాజేష్, ఉప ప్రాంతీయ అధిపతి బి.టి. శ్రీనివాసులు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా స్వర్గీయ కడసింగి అప్పారావు కుటుంబానికి రూ.10 లక్షలు, స్వర్గీయ పీలా అప్పారావు కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున అందించారు. కడసింగి అప్పారావు సహాయ ఉపనిరీక్షకుడిగా, పీలా అప్పారావు ప్రధాన కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి యూనియన్ బ్యాంక్ కట్టుబడి ఉందని, కష్టకాలంలో వారి కుటుంబాలకు అండగా నిలుస్తుందని పి. రాజేష్, బి.టి. శ్రీనివాసులు తెలిపారు. పోలీసు జీతాల ఖాతా ద్వారా ఎటువంటి ప్రీమియం లేకుండా రూ.1.20 కోట్ల వ్యక్తిగత ప్రమాద బీమా, రూ.10 లక్షల జీవిత బీమా కవరేజీ అందుతుందని వారు వివరించారు. బీమా క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించేందుకు బ్యాంకు కట్టుబడి ఉందన్నారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో యూనియన్ బ్యాంక్ చేస్తున్న కృషిని పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చీ అభినందించారు. కష్టకాలంలో పోలీసు కుటుంబాలకు జీతాల ఖాతా ప్యాకేజీ ద్వారా బ్యాంకు అందిస్తున్న సహాయాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో పోలీసు శాఖకు చెందిన సీనియర్ అధికారులు, యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

### యూజీసీ-నెట్‌లో గిరిజన యువతి
# సరోజినీ ఘనవిజయం

### జేఆర్ఎఫ్‌తో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత సాధన



విశాఖపట్నం, ఆగష్టు 29ప్రభాత వార్త :
విద్యతో జీవితాన్ని మార్చుకోవచ్చని నిరూపిస్తూ ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖ విద్యార్థిని కిల్లో సరోజినీ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) విడుదల చేసిన జూన్--2026 యూజీసీ-నెట్ ఫలితాల్లో ఆమె అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హతతో పాటు ప్రతిష్ఠాత్మక జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) సాధించి ఘనత సాధించారు.గిరిజన ప్రాంతానికి చెందిన సరోజినీ పట్టుదలతో చదివి జాతీయ స్థాయిలో ఈ విజయాన్ని సాధించడం విశేషంగా నిలిచింది. ఆమె విజయం కుటుంబ సభ్యులతో పాటు ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థుల్లో ఆనందాన్ని నింపింది. భవిష్యత్తులో తెలుగు విభాగంలో ఉన్నత స్థాయి పరిశోధన చేసి, ఉత్తమ అధ్యాపకురాలిగా, పరిశోధకురాలిగా సేవలందించడమే తన లక్ష్యమని సరోజినీ తెలిపారు.
తన విజయానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, పరిశోధకుడు బొమ్మిడి డిల్లేష్ అందించిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం ఎంతో దోహదపడిందని ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వారి సూచనలు, నిరంతర ప్రేరణతోనే ఈ విజయాన్ని సాధించగలిగానని పేర్కొన్నారు.జేఆర్ఎఫ్ సాధించడం ద్వారా ఉన్నత స్థాయి పరిశోధనకు ఆర్థిక సహకారంతో పాటు జాతీయ స్థాయిలో పరిశోధకురాలిగా ఎదిగే అవకాశం లభిస్తుందని ఆచార్యులు పేర్కొన్నారు. సరోజినీ విజయం గిరిజనయువతకుస్ఫూర్తిదాయకమని, ఉన్నత విద్య, పరిశోధన వైపు మరింత మంది విద్యార్థులు అడుగులు వేయడానికి ఇది దోహదపడుతుందని అభినందించారు.

### గిడుగు జయంతి రోజున అరుదైన విజయం

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా సరోజినీ యూజీసీ-నెట్‌లో జేఆర్ఎఫ్ సాధించడం మరింత విశేషమని తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు పేర్కొన్నారు. భాషా తపస్వి, కళాప్రపూర్ణ గిడుగు వేంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషాభిమానులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు శాఖ విద్యార్థిని సరోజినీ నెట్‌లో ఘనవిజయం సాధించినందుకు శాఖాధిపతితో పాటు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## బొడ్డేటి కిషోర్ కుటుంబాన్ని పరామర్శించిన ప్రగడ నాగేశ్వరరావు

**ఎలమంచిలి, ఆగస్టు 29, ప్రభాతవార్త**



మున్సిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెం గ్రామానికి చెందిన బొడ్డేటి కిషోర్ ఇటీవల ప్రమాదవశాత్తు స్వర్గస్తులైన నేపథ్యంలో, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వర రావు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ బొడ్డేటి కిషోర్ సామాన్య కార్యకర్తగా తెలుగుదేశం పార్టీకి ఎన్నో సేవలు అందించారని, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. చిన్న వయసులోనే బొడ్డేటి కిషోర్ మృతి చెందడం ఎంతో బాధాకరమని, వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, వ్యక్తిగతంగా తాను కూడా ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల వెంకటరమణ, పిల్లా గోవింద్, పిల్లా సోమినాయుడు, కర్రీ స్వామి, ఎల్లపు శ్రీను, కర్రీ విశ్వేశ్వరరావు, జంపాలం సర్పంచ్ నాయుడు, పొలమర శెట్టి విశ్వేశ్వరరావు, బొడ్డేటి శ్రీను, కర్రీ జగన్నాథం పాల్గొని బొడ్డేటి కిషోర్ కుటుంబాన్ని పరామర్శించారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సం

**కశింకోట, ఆగస్టు 29, ప్రభాతవార్త:**



మండలంలోని బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా తెలుగు భాష దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా తెలుగు భాష శోధకుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి తాత్కాలిక బాధ్యత వహించిన ప్రధానోపాధ్యాయుడు కెవి.రవి, తెలుగు ఉపాధ్యాయుడు మల్ల రామునాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు రామునాయుడు మాట్లాడుతూ అన్ని భాషలలో తెలుగు భాష ఉన్నతమైనదని తెలిపారు. తెలుగువారు మాతృభాష తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులు తెలుగు భాష పై పట్టు సాధించాలన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగులోనే స్పష్టంగా మాట్లాడాలన్నారు. రచనలకు, కవిత్వానికి తెలుగు తెలుగు భాష ఉన్నతమైనదని చెప్పారు. తెలుగు నేలను, తెలుగు భాషను మరవద్దన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన చంద్ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, మణి కుమారి, ఎం.అప్పారావు, జి ఎస్ రత్నకుమార్, పి. విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికోన్నత పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు

**ఎలమంచిలి, ఆగస్టు 29 ప్రభాతవార్త:**



పట్టణములోని బాలికోన్నత పాఠశాలలో శని వారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాష గొప్పతనం, ఔన్నత్యం, ప్రాధాన్యతను తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థినులకు వివరించారు. మాతృభాషను ప్రేమించి, తెలుగు భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడల విశిష్టత, విద్యార్థుల శారీరక, మానసిక వికాసంలో క్రీడల పాత్రను వ్యాయామ ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## రాజయ్యపేటలో ఇంటింటా టీడీపీకి స్పందన

**నక్కపల్లి, ప్రభాతవార్త**



ఇంటింటా టిడిపి కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజయ్యపేట గ్రామంలో విశేష స్పందన లభించింది. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో పాయకరావు పేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో సొసైటీ అధ్యక్షులు పిక్కి కోదండరావు 189వ బూత్‌లో 557 కుటుంబాలను కలిసి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కోదండరావు ప్రథమంగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. రాజయ్యపేట గ్రామానికి రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి వంగలపూడి అనిత సహకారంతో అందుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయం తదితర అంశాలను ప్రజలకు కోదండరావు తెలియజేశారు. గ్రామానికి మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న నేపథ్యంలో ప్రజల్లో ప్రభుత్వంపై మంచి నమ్మకం ఉందని అన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాజయ్యపేట గ్రామ అభివృద్ధికి చూపించిన చొరవ మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి వాసుపల్లి శివ, దేవుడు, చోడిపల్లి అప్పలరాజు, చొక్కా గోపి, కారే రాజు తదితరులు ఉన్నారు.

## మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ 19వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

**ఎలమంచిలి, ఆగస్టు 29, ప్రభాతవార్త**




మండలంలోని ములకలాపల్లి గ్రామంలో గల మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ) స్థాపించి 30-08-2026 నాటికి 19 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న సందర్భంగా శనివారం ఉదయం 10.00 గంటల నుండి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్.టి.ఆర్. ట్రస్ట్ విశాఖపట్నం సౌజన్యంతో డాక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించినట్లు ఫ్యాక్టరీ యూనిట్ హెడ్ బి. రామస్వామి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, ఉద్యోగులు, కార్మికులు, శ్రీ లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొని 90 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డి.జి.ఎం (పి అండ్ ఎ) ఎల్.శ్రీనివాసరావు, ఓ.హెచ్.సి ఇన్ చార్జ్ బి.రాజు, ఎన్.టి.ఆర్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సత్యనారాయణ, ఉద్యోగులు, కార్మికులు, కాలనీ వాసులు, శ్రీ లేడీస్ క్లబ్ మెంబర్స్ అందరూ పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**ఎలమంచిలి, ఆగస్టు 29, ప్రభాతవార్త**



స్థానిక శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ప్రముఖ హాకీ క్రీడాకారుడైన ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ డీన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపల్, డీన్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమని, అవి శారీరక వికాసానికి దారి తీస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు చిరంజీవి, సాయి, ఏవో ప్రకాష్ ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**అనకాపల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త**



బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్చంద్ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం ప్రకటించిన జాతీయ క్రీడా దినోత్సవం శనివారం అనకాపల్లి స్థానిక శ్రీ రాందేవ్ జిమ్ నందు ఘనంగా నిర్వహించారు. అలాగే మేజర్ ధ్యాన్చంద్ చిత్రపటానికి బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సెక్రటరీ కృష్ణాజి, శిలపరశెట్టి బాబి పూలమాలవేసారు. ఈ సందర్భంగా కృష్ణాజి మాట్లాడుతూ ధ్యాన్చంద్ 1905లో జన్మించారని, శనివారం 121వ జయంతి అని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. శిలపరశెట్టి బాబి మాట్లాడుతూ హాకీ క్రీడలో 1928, 1932, 1936లో వరుసగా మూడు సార్లు ఒలింపిక్స్ లో గోల్డ్ మెడల్స్ సాధించారని, 1956లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డ్ ప్రకటించిందని, హాకీ మాంతికుడుగా పేరు గాంచారని తెలిపారు. కరిమత్తుల శ్రీను మాట్లాడుతూ ధ్యాన్చంద్ ని క్రీడాకారులందరూ ఆదర్శంగా తీసుకొని వారు వారి క్రీడల్లో భారతదేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు అమరపల్లి కృష్ణాజి, శిలపరశెట్టి బాబి (నేషనల్ బాడీ బిల్డర్), ఎన్.పీ. చంద్రశేఖర్, కేసు బోయిన నరేంద్ర, మద్దాల రాకేష్, ఉగ్గిన శ్రీను, శిలపరశెట్టి ప్రసాద్ బాబు, దండా వెంకటరమణ, పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శ్రీ రాందేవ్ విద్యార్థులకు బస్కి పోటీలు నిర్వహించి జిమ్ పెద్దలైన అమరపల్లి కృష్ణాజి, కరిమత్తుల శ్రీను, గుమ్మాల నరసింగరావు, గుమ్మాల నాగేశ్వరరావు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## ఆర్.ఈ.సి.ఎస్ పాలిటెక్నిక్ ఉద్యోగుల మూడవ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

**కశింకోట, ఆగస్టు 29 ప్రభాతవార్త**



ఆర్.ఈ.సి.ఎస్ స్థాపించిన పాలిటెక్నిక్ కళా శాల నిర్వహణ బాధ్యతను ఏపీ ఈపీడీసీ ఎల్ వారు తీసుకోవాలని, సిఎండి తక్షణం స్పందిం చి వారికి జీతాలు చెల్లించేలా చర్యలు తీసు కోవాలని కోరుతూ మూడవ రోజు రిలే నిరా హార దీక్షలు కొనసాగిం చారు. దీక్షలో ప్రిన్సిపల్ బి.ఉమాశంకర్ అసోసియేట్ ప్రిన్సిపాల్ కె.శివ, యూనియన్ ప్రెసిడెంట్ శరగడం హేమంత్, సెక్రటరీ బి.నగేష్, పాల్గొన్నారు.

## కోర్టుపేట హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**ఎలమంచిలి, ఆగస్టు 29 ప్రభాతవార్త**



జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా హాకీ అసోసియేషన్, ఎలమంచిలి హాకీ క్లబ్ ఆధ్వర్యంలో కోర్టుపేట హైస్కూల్ నందు వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పట్టణ జనసేన సీనియర్ నాయకురాలు కర్రి ఝాన్సీ, హెడ్ మాస్టర్ రమణ, నరేష్, పి.డి రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాకీ అభివృద్ధిలో భాగంగా ఎలమంచిలి హాకీ అసోసియేషన్ తరపున దాసరి మహేష్ అందించిన క్రీడా సామాగ్రి - స్టిక్స్, బాల్స్ క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కోటారు నరేష్, దాసరి మహేష్, రమేష్, రాంబాబు, కిషోర్, స్పోర్ట్స్ కోటాలో డిఫెన్స్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న సీనియర్ హాకీ క్రీడాకారులు గణేష్, తేజ, సాయి, వరహాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ కోటారు నరేష్, రమేష్ లను స్కూల్ యాజమాన్యం ప్రిన్సిపల్ రమణ, రాజు ఘనంగా సన్మానించారు.

## కొమిరలో రీ సర్వే పై గ్రామసభ

**గొలుగొండ ఆగస్టు 29, ప్రభాతవార్త**



కొమిర రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన రీ సర్వే భూమి కొలతలపై గ్రామ సభ తహశీల్దార్ వి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. కొమిర రెవెన్యూలో ఉన్న భూమి కొలతలు పూర్తి అవడంతో రైతులు వివరాలు భూమి కొలతల నమోదు అంశాలపై గ్రామ సభలో వెల్లడించారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు, రీ సర్వే నమోదైన భూమి యొక్క వివరాలు ఏమైనా తేడాలు ఉంటే తెలియపరచవచ్చని 90వ నోటీస్ జారీ చేశారు. ఈ నోటీసు ద్వారా మూడు రోజులు పాటు అభ్యంతరాల స్వీకరణ కార్యక్రమం ఉంటుంద న్నారు. సర్వేలో నమోదైన వివరాలపై పూర్తిస్థాయి రికార్డు తయారీ జరుగుతుందని, అనంతరం రైతులకు కొత్త పాస్ పుస్తకాలు మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మాజీ సర్పంచ్ కర్రీ నాయుడు, వీఆర్వో వి అప్పారావు రీసర్వే డిటి కొండబాబు, సర్వే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## క్రీడలలో సత్తా చాటారు

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లాలో సత్తా చాటిన 5 స్థానాల్లో స్థానిక బాలుర ఉన్న తపాఠశాల విద్యార్థులు 5వ స్థానం కైవసం చేసుకున్నట్లు హెచ్.ఎమ్. పతివాడ విజయ తెలిపారు. శనివారం జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా అనకాపల్లిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 5వ స్థానం సాధించిన క్రీడాకారులకు ఎక్స్ లెన్స్ అవార్డులకు ఎంపిక చేసి జిల్లావిద్యాశాఖాధికారి చేతులమీదుగా పురస్కారాలను అందజేశారు. క్రీడల్లో ప్రతిభను వెలికితీస్తూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వలక్షణాలను పెంపొదిస్తూ జిల్లా క్రీడారంగానికి విద్యార్థులు గర్వకారణంగా నిలిచారని డి.ఈవో.నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎంపికయిన చిన్నారులను, శిక్షణనిచ్చిన పీడీలు నీరజ, ధనలక్ష్మిలను పాఠశాల సిబ్బంది, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.

## విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి

**అనకాపల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త**

విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి జి ఎస్ నాగేశ్వరరావు సూచించారు. శనివారం జీవీఎంసీ గవర పాలెం హైస్కూల్ నందు జరిగిన తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా వ్యాసరచన, అటలపోటీలలో గెలుపొందిన వారికి డీఈవో నాగేశ్వరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు బాషాకు గిడుగు వెంకట రామమూర్తి పంతులు ఎనలేని కృషి చేసారని, మేజర్ ధ్యానచంద్ జాతీయ క్రీడలలో మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు మహాలక్ష్మి, తెలుగు ఉపాధ్యాయులు ఏ అచ్చియ్యా నాయుడు, కె.జనార్ధన్ ఆఫీసర్, పి పూర్ణిమ, వేణుగోపాల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## అనకాపల్లి కేజీబీవీ పోస్టుల ఫైనల్ మెరిట్ జాబితా విడుదల

**అనకాపల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త**



జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాల యాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన టీచింగ్ (సిఆర్టి, పీజీటీ, పీఈటీ) పోస్టుల భర్తీకి సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్టులను విడుదల చేసినట్లు అదనపు పథక సమన్వయ కర్త కె.శ్రీరాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల సబ్జెక్టుల వారీగా మెరిట్ జాబితాలను హెచ్‌టిటిపిఎస్ : //సైట్స్.గూగల్.కం/వ్యూ/ ఏపిసిఎస్-ఎస్ఎకెపి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడమైందని, ఫైనల్ మెరిట్ లిస్టులో ఉన్న వివరాలు, మార్కులను అభ్యర్థులు పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, సంబంధిత ఫిర్యాదులను ఆగస్టు 31, 2026 సాయంత్రం 5:00 గంటలలోపు జిల్లా పథక సమన్వయ కర్త, సమగ్ర శిక్ష, అనకాపల్లి కార్యాలయంలో స్వయంగా అందజేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకై 9550784829, జిసిడిఓ, అనకాపల్లి వారిని సంప్రదించవచ్చని అన్నారు.

## బాలికల భద్రతకు 'అభయ' భరోసా

### జాజిమొగ్గల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన

**బుచ్చయ్యపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త**



బాలికలు తమ సమస్యలను ధైర్యంగా వెల్లడిం చి, అవసరమైనప్పుడు అందుబాటులో ఉన్న రక్షణ సేవలను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. బుచ్చయ్యపేట గ్రామం లోని జాజి మొగ్గల ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యం లో మహిళా, శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో శనివారం 'అభయ' కార్యక్ర మం, బాలికల భద్రతపై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన 'అభయ' ఫిర్యాదుల పెట్టెల వినియోగం, బాలికలు ఎదుర్కొనే సమస్యలను తెలియజేసే విధానం, మహిళలు, బాలల రక్షణకు అందుబాటులో ఉన్న సేవలపై విద్యార్థులకు వివరించారు. బాలికలను కాపాడాలి-బాలికలను చదివించాలి అనే కార్యక్రమం ఉద్దేశ్యంతో పాటు బాలికల విద్య, భద్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ తెలుగు భాషా దినోత్సవం

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వేంపాడులో తెలుగు భాషా దినోత్సవం ,జాతీయ క్రీడా దినోత్సవాలు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. శనివారం నక్కపల్లి, వేంపాడు క్లస్టర్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో విధులునిర్వహిస్తున్న ఎస్జిటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాంప్లెక్స్ సమావేశాల పరిశీలనకు అదనపు ఎంఈఓ నాగన్న దొర మాట్లాడుతూ ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. పాఠశాలలో జరుగుతున్న తెలుగు భాషాదినోత్సవం, క్రీడా దినోత్సవ కార్యక్రమాలలో క్విజ్, నాటికను తిలకించి తెలుగు భాషను బాగా నేర్చుకుంటే ఇతర భాషల పై కూడా పట్టు సాధించవచ్చని విద్యార్థులందరికీ తెలియజేశారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు మారమ్మ, తెలుగు ఉపాధ్యాయులు విజయ, మోహన్, నాయక్, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించండి : డిసిహెచ్ డా.నరేందర్ సింగ్

**అగనంపూడి, ప్రభాతవార్త**



ప్రజలకు వైద్య సేవలు సక్రమ అందించండి విశాఖపట్నం డి సి హెచ్ డాక్టర్ నరేందర్ సింగ్ అన్నారు. శనివారం అగనంపూడి ఏరియా ఆసుపత్రి ఆయన సందర్శించారు. ల్యాబ్ పనితీరును సమీక్షిం చారు. బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై వారిని అడిగి తెలుసుకున్నారు, కొత్తగా నిర్మించిన అడ్మిన్ బిల్డింగులను పరిశీలించారు. త్వరగా ప్రజలకు అందుబాటులో వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపర్డెంట్ డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ శంకర్ ప్రసాద్, ఏ ఓ రవి రాజు, డాక్టర్స్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




## పోలవరం ఎడమ కాలువకు వైఎస్సార్ పేరు నామకరణ చేయాలి: వైకాపా రాష్ట్ర నేత వీసం వినతి

### కరవు నియోజకవర్గంగా పేటను సీఎం పేట సభలో ప్రకటించాలి..

**నక్కపల్లి, ప్రభాతవార్త**



దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు పోలవరం కాలువ నిర్మాణానికి ద్వారాలు తెరిచారని రైతుల కోరికను నెరవేర్చి ఎందుకు ఆనాడు 70 శాతం పనులు పూర్తిచేసిన నేపథ్యంలో ఆ తర్వాత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మిగతా పనులు పూర్తి చేశారని అటువంటి పోలవరం ఎడమ కాలువకు జలహారతి కార్యక్రమం కోసం వస్తున్న రాష్ట్ర ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఆలోచించి దివంగత రాజశేఖర్ రెడ్డి పేరు నామకరణ చేస్తే మంచిదని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ వీసం రామకృష్ణ కోరారు. నక్కపల్లి పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం కాలువ నిర్మాణం లో భాగంగా ఎడమ కాలువకు జల హారతి కార్యక్రమానికి వస్తున్న ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని ప్రస్తుత స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీసుకువెళ్లాలని అందులో భాగంగా నియోజకవర్గంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నాలుగు మండలాలను కరవు మండలాలుగా ప్రకటించేటట్లు కృషి చేయాలని ఆ ప్రకటన వేట సభలోనే ప్రకటించాలని వీసం రామకృష్ణ కోరారు. కరువుతో తీవ్రంగా నష్టపోతున్న రైతులను తక్షణమే ఆదుకోవడంతో పాటు వారి రుణాలను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని రైతులు వరి విత్తనాలు వేసుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రైతులు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరి పొలాల్లో మొక్కలు ఎండి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పెట్టుబడులు కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పోలవరం ఎడమ కాలువ పనులకు శ్రీకారం చుట్టారని రామకృష్ణ గుర్తు చేశారు. ఆయన హయాంలో కాలువ పనుల్లో సుమారు 50 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అనంతరం వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వ హయాంలో మరో 25 శాతం పనులు జరిగాయని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించడంలో కీలకమైన పోలవరం ఎడమ కాలువకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతమైన ఆలోచనతో ముందుకొచ్చి పాయకరావుపేట లోనే వైఎస్సార్ పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే నెల 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం కాలువ జలహారతి కార్యక్రమానికి వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత రైతులతో పాటు 2014 అధికారులకు వచ్చినప్పుడు పాయకరావుపేటలో రైతు బాంధవుడుగా పర్యటించిన సందర్భంలో పోలవరం బాట పట్టారని దాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రకటన చేయాలని రామకృష్ణ కోరారు. ఈ నేపథ్యంలో పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కరవు మండలాలుగా ప్రకటించి రైతులకు అండగా నిలవాలని హోంమంత్రి వంగలపూడి అనితను కోరారు. కరువు పరిస్థితుల్లో రైతులపై రుణభారం మరింత పెరుగుతోందని ఆయన అన్నారు. రైతులకు తిరిగి కొత్త రుణాలు మంజూరు చేసి తదుపరి పంటకు ఆర్థికంగా అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలతో పాటు పశుపోషణపై కూడా ప్రభావం పడుతోందని రామకృష్ణ 20 పశుగ్రాసాన్ని ప్రభుత్వం ఉచితంగా అందించాలని త్రాగునీటి కూడా పశువులు ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ రైతుల సమస్యల పరిష్కారం కోసం వైసీపీ నిరంతరం పోరాడుతుందని వీసం రామకృష్ణ స్పష్టం చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి సూరకాసుల గోవిందు మాట్లాడుతూ కరవు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు అయినంపూడి మాణిరాజు, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగ ఈశ్వరరావు, తల్లా భార్గవ్, విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఎలమంచిలి చందు, సాదిరెడ్డి శ్రీను ఉన్నారు.

## జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీందర్‌ను కలిసిన మత్స్యకార నాయకులు

**నక్కపల్లి, ప్రభాతవార్త**



పాయకరావుపేట నియోజకవర్గం పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీందర్‌ను పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో ఎంపీటీసీ మెరుగు నాగేశ్వరరావు, మత్స్యకార యువ నాయకుడు సింహాద్రి, పిఏసిఎస్ డైరెక్టర్ మన బాల కొండబాబు తదితరులు ఉన్నారు.

## నక్కపల్లిలో ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్స వాన్ని స్థానిక నక్కపల్లి హాకీ క్రీడాకారులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు చౌదరి మాస్టర్, బిఎస్ హాకీ క్లబ్ అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి తాతాజీ మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ లెజెండ్ రీ హాకీ క్రీడాకారుడైనా ధ్యాన్ చంద్ జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం సంతోషమని ప్రతి ఒక్క క్రీడాకారులు ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తి గా తీసుకోని భవిష్యత్తు లో క్రీడాకారులు బంగారు బాటలు వేసుకోవాలని భారత దేశం గర్వించే విదంగా క్రీడాకారులు తయారు అవ్వాలని కోరారు. నక్కపల్లిలో బిఎస్ హాకీ క్లబ్ స్థాపించి క్రీడాకారులకు నూతన ఉత్తేజం తీసుకోని వచ్చారని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ నుండి సహాయ సహకారాలతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ కోటి పరిహారం ఇవ్వాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము డిమాండ్

**(రాంబిల్లి ఆగస్టు 29 ప్రభాతవార్త)**



రాంబిల్లి నాన్-సెజ్‌లోని పరేఖ్ ప్లాస్ట్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమలో మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కార్మికుడు మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. రాము డిమాండ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరిశ్రమలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన కుసాన్ మజ్జిహి (32) మూడు రోజుల క్రితం విధుల్లో ఉండగా ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు స్థానిక ఎస్సై డీ.నాగేంద్ర తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. ఆసుపత్రి వర్గాల నుంచి అందిన సమాచారంతో ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచడంపై సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. రాము తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల భద్రతను పట్టించుకోకుండా యాజమాన్యం లాభాలకే ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి బాధ్యులైన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని రాము కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఇస్లాంపేట హై స్కూల్లో ఘనంగా తెలుగు భాష దినోత్సవం

**అగనంపూడి ప్రభాతవార్త**



ఇస్లాంపేట హైస్కూల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహిం చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు జి ప్రమీల మాట్లాడుతూ తెలుగు భాష విశిష్టతపై విద్యార్థులకు వివరిం చారు. పాఠశాలలో వ్యాచరణ పోటీలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యా యులు ఆనందరావు, అప్పలనాయుడు, బ్రహ్మానందం, పిటి ఉపాధ్యాయులు అన్నాజీ రావు, పాల్గొన్నారు.

30-8Pg7exHMNWJQETCL.qxd:30-8Pg7exHMNWJQETCL.qxd 1/1/02 6:16 AM Page 1



# హామీల అమలుకే ప్రథమ ప్రాధాన్యం

### పిఠాపురం ఆరోగ్య రంగానికి సరికొత్త రూపు

### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఆసుపత్రుల అభివృద్ధి

### ఆయుష్ సేవల విస్తరణ.. వైద్య విద్యకు నూతన ఊపిరి, రూ.34 కోట్లతో ఏరియా ఆసుపత్రి ఆధునికీకరణ

### సుమారు రూ.100 కోట్లతో ఆయుష్ వైద్య కళాశాల ఏర్పాటు

### రూ. కోటి వ్యయంతో కొమరగిరి, చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

**విజయవాడ, ఆగస్టు 29, ప్రభాతవార్త ప్రతినిధి:** నాణ్యమైన వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అనే గొప్ప ఆశయాన్ని ఆచరణలో సాకారం చేస్తూ పిఠాపురం నియోజకవర్గాన్ని సమగ్ర, అత్యున్నత ఆరోగ్య సేవలకు కేంద్రంగా, రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచే మోడల్ హెల్త్ హబ్‌గా ఉప ముఖ్యమంత్రి, స్థానిక శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ తీర్చిదిద్దుతున్నారు. ఈ మేరకు డీసీఎం కార్యాలయం సమగ్ర సమాచారంతో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రతి పేదవాడికీ ఎలాంటి ఆర్థిక భారం లేకుండా, అత్యున్నత ప్రమాణాలతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారని ఈ సమాచార పత్రంలో తెలిపారు. ఈ మహత్తర లక్ష్య సాధనలో భాగంగా ఆధునిక సదుపాయాలతో ఆసుపత్రుల అభివృద్ధి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతం, ఆయుష్ వైద్య సేవల విస్తరణతోపాటు వైద్య విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. దీనితోపాటు రోగుల ప్రయాణ సౌకర్యార్థం ఈ ఆసుపత్రులన్నింటికీ కనెక్టింగ్ రోడ్లను కూడా నిర్మించారు.

**శరవేగంగా ఏరియా ఆసుపత్రి అభివృద్ధి**

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీకి అనుగుణంగా పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పిఠాపురంలోని 30 పడకల పాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.34 కోట్ల అంచనా వ్యయంతో 100 పడకల సామర్థ్యంతో కూడిన అత్యాధునిక ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు యుద్ధ ప్రాతిపాదికన సాగుతుండగా, ఇప్పటికే దాదాపు 50 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 4.67 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ అత్యాధునిక ఆసుపత్రిలో ఆధునిక ఐసీయూ, అధునాతన వైద్య పరీక్షా ప్రయోగశాలలు, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, 30 పడకల ప్రసూతి విభాగంతోపాటు చిన్నపిల్లల వైద్యం, కంటి వైద్యం, ఎముకల వైద్యానికి సంబంధించిన ప్రత్యేక విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. ఆసుపత్రి నిర్మాణం పూర్తై ప్రజలకు అందుబాటులోకి వస్తే పిఠాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఆరు మండలాలకు చెందిన సుమారు 3 లక్షల మంది ప్రజలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉచిత, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. ఆసుపత్రికి అనుబంధంగా బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ భవనం, మార్చురీ, లక్ష లీటర్ల సామర్థ్యం గల సంప్‌తోపాటు ఇతర అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణం కూడా చేపడుతున్నారు.



ఏరియా ఆసుపత్రి ఆధునికీకరణ పనుల జరుగుతున్న దృశ్యం

**ప్రతిష్టాత్మక ప్రభుత్వ ఆయుష్ మెడికల్ కాలేజీ ఏర్పాటు**

పిఠాపురం పేరును వైద్య విద్యా రంగంలో ప్రత్యేకంగా నిలబెట్టే లక్ష్యంతో, నేషనల్ ఆయుష్ మిషన్ కింద ప్రతిష్టాత్మక ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాల ఏర్పాటుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆయుష్ మెడికల్ కాలేజ్‌తోపాటు అనుబంధ అభివృద్ధి పనుల కోసం పిఠాపురం నియోజకవర్గంలో భూసేకరణ పనులు వేగవంతం చేశారు. ఈ కళాశాల నిర్వహణ, అనుబంధ సేవలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆయుష్, హెల్త్ యూనిట్లు

పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రజలకు కూడా తక్షణ వైద్య సేవలు అందించేలా యు. కొత్తపల్లి మండలం కొమరగిరిలో, గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రూ.50 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పటికే వంద శాతం పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. వీటితోపాటు విరవాడలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆయుష్ డిస్పెన్సరీ పనులు చివరి దశకు చేరాయి. అదే సమయంలో పిఠాపురం నియోజకవర్గానికే పరిమితం కాకుండా కాకినాడ జిల్లా ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఆయన చొరవతో కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రూ.36.6 కోట్లతో అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందులో సీటీ సిమ్యులేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీథెరపీ, డోసిమెట్రీ వంటి ఆధునిక పరికరాలతోపాటు, క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. గ్రామీణ స్థాయి ఆరోగ్య కేంద్రాల నుంచి అత్యాధునిక క్యాన్సర్ చికిత్స వరకు అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువయ్యేలా ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంతో పాటు కాకినాడ జిల్లా ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న చర్యలు ప్రజారోగ్యంపై ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధకు, కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## మాతృ భాషను సులువుగా నేర్చుకునేలా సరికొత్త మొబైల్ యాప్

### రూపొందించిన కొల్లు రంజిత్



**విజయవాడ, ఆగస్టు29, ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవిదేశాల్లో ఉండే తెలుగు వారి పిల్లలు మాతృ భాషను సులువుగా నేర్చుకునేలా సరికొత్త మొబైల్ యాప్, వెబ్ సైట్ అందుబాటులోకి వచ్చింది. విజయవాడకు చెందిన ప్రవా సాంధ్రులు కొల్లు రంజిత్ కూల్ఫాబెట్స్ పేరుతో యాప్ రూపొందించారు. కృత్రిమ మేథ సాంకేతికతతో పని చేసే యాప్‌ను శనివారం ప్రపంచ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అధికారికంగా విడుదల చేశారు. తెలుగును వర్ణమాల నుంచి వాక్య నిర్మాణం వరకూ పూర్తి స్థాయిలో నేర్చుకునేలా ఈ యాప్ పని చేస్తుంది. సులువుగా నేర్చుకోవటంతో పాటు రాసేటప్పుడు మనం చేసే తప్పుల్ని వెంటనే పసిగట్టి చెప్పటం అక్షర దోషాల్ని గుర్తించటం చేతిరాత విషయంలో మార్గనిర్దేశకత్వం చేస్తుంది. ఎంత కరెక్టుగా రాశామనేది స్పష్టంగా చెబుతుంది. పదాల్ని బొమ్మలతో సహా వివరిస్తుంది. విదేశాల్లో ఉండేవారికి తెలుగు టీచర్ లేని లోటుని భర్తీ చేసేలా కూల్ఫాబెట్స్ యాప్ పని చేస్తుందని రూపకర్త రంజిత్ తెలిపారు. యాప్ విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రంజిత్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భం గా యాప్ విడుదల చేయటం పట్ల అభినందించారు. తెలుగు లిపిని నేటి తరాలకు మరింత దగ్గర చేసేందుకు రంజిత్ చేసిన ప్రయత్నాన్ని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసించారు. భాషా పరిరక్షణకు ఆధునిక సాంకేతికతను ఉపయోగించారని ఇలాంటి ప్రయత్నాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. పలువురు ప్రముఖులు, ఐఏఎస్ అధికారులు రంజిత్ రూపొందించిన కూల్ఫాబెట్స్ యాప్‌ను అభినందిస్తూ సందేశాలు పంపించారు.

## డబుల్ ఇంజిన్ కాదు.. డబుల్ రేట్ల సర్కార్

### ధరలు తగ్గించలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ : ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఫైర్

**విశాఖపట్నం, ఆగస్టు 29, ప్రభాత వార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని పెంచేసి, నిత్యవసరాల ధరలతో సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. విశాఖపట్నంలోని వైకాపా పార్టీ సిటీ కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుది విజనరీ పాలన కాదని, ప్రజల నడ్డి విరిచే బాదుడే బాదుడు పాలన అని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆమె దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు జీడీపీలో రాష్ట్రాన్ని నంబర్ వన్ స్థానంలో ఉంచుతామని చెబుతున్నారని, కానీ ప్రజల దృష్టిలో జీడీపీ అంటే గ్యాస్ (జీ), డీజిల్ (డీ ), పెట్రోల్ (పీ ) రేట్లను పెంచడంలో రాష్ట్రాన్ని నంబర్ వన్ చేశారని ఎద్దేవా చేశారు.

## ఇవియం, వివిప్యాట్ గోదాములకు పటిష్ట భద్రత : ఎన్‌టిఆర్ కలెక్టర్

**విజయవాడ, ఆగస్టు 29, ప్రభాతవార్త :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, వివిప్యాట్‌ల గోదాముకు పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా శనివారం వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి గొల్లపూడిలోని ఈవియంల గోదామును కలెక్టర్ పరిశీలించారు. సిసికెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించి రిజిస్ట్రర్‌లో సంతకం చేసారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రతిరోజూ పిజిఆర్ఎస్ :** ఎన్‌టిఆర్‌జిల్లాలోని స్వర్ణగ్రామ, వార్డు కార్యాలయాల్లో ప్రతిరోజూ పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించాలని ఎన్‌టిఆర్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. ఆయా కార్యాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

**విభిన్న ప్రతిభావంతులకు వాహనాలు అందచేత :** ఎన్‌టిఆర్‌జిల్లాలో అర్హులైన 58మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.66.70లక్షల విలువచేసే మోటరైజ్డ్ త్రిచక్రవాహనాలను ఉచితంగా పంపిణీ చేసారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవిభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయసంస్థ చైర్మన్ గుడిపూటి నారాయణస్వామి, జిల్లాకలెక్టర్ లక్ష్మీశా లబ్ధిదారులకు వాహనాలను అందచేసారు. ఈసందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 113 ధరఖాస్తులు రాగా వాటిలో విచారణ జరిపి అర్హులైన 58మందికి ఒక్కొక్కటి రూ.1.15లక్షల విలువచేసే వాహనాలను అందచేసినట్లు చెప్పారు.

## సోమశిల జలాశయాన్ని పరిశీలించిన సిడిఎస్ఇ కమిటీ

**అనంతసాగరం (నెల్లూరు), ఆగస్టు 29, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయాన్ని డ్యామ్ సేఫ్టీ రివ్యూ కమిటీ అధికారులు శనివారం పరిశీలించారు. జలాశయం భద్రత, డ్యామ్ నిర్మాణ పరిస్థితి, నీటినిల్వ సామర్థ్యం తదఇతర అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలన చేపట్టారు. ఈసందర్భంగా డ్యామ్ మ్యాప్‌ను పరిశీలించి డ్యామ్ సేఫ్టీకి సంబంధించిన వివిధ అంశాలను అధికారులు పరిశీలించారు. జలాశయం ప్రస్తుతం సురక్షితంగా ఉందా, భవిష్యత్తులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. జలాశయం భద్రతకు సంబంధించి అవసరమైన చర్యలు , నిర్వహణ అంశాలపై అధికారులతో చర్చించి డ్యామ్ పరిస్థితిపై వివరానలు నమోదు చేశారు. ఈకార్యక్రమంలో డ్యామ్ సేఫ్టీ రివ్యూ కమిటీ అధికారులు గోపాల్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, తెలుగుగంగ ఎస్‌సి జి.సుబ్రహ్మణ్యరావు, డిఇఇ రవీంద్రప్రసాద్, డ్యామ్ డిఇఇ విజయేంద్రబాబు, ఇఇ శ్రీనివాసకుమార్, ప్రాజెక్ట్ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి పాల్గొన్నారు.

## నీట్-పిజి పరీక్షకు కొన్ని గంటల ముందు విషాదం

### డిప్రెషన్‌తో ఎంబిబిఎస్ విద్యార్థిని ఆత్మహత్య

### ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని హాస్టల్‌లో ఘటన

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 29, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ఆది వారం జరగనున్న నీట్‌పీజీ ప్రవేశపరీక్షకు కొద్దిగంటల ముందు నగరంలోని చిక్కడపల్లి తీవ్రవిషాదం చోటుచేసుకుంది. తీవ్ర మనస్తాపంతో ఎంబీబీఎస్ విద్యార్థిని ఒకరు హాస్టల్ గదిలోనే విషం తాగి బలవన్మరణానికి పాల్పడింది. చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఇన్స్పెక్టర్ ఎల్. మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన ప్రముఖ వ్యాపారి రామ్మోహన్‌రెడ్డి కుమార్తె బండి యశ్విత(26) ఎంబీబీఎస్ పూర్తి చేసింది. వైద్యవిద్యలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) సీటు సాధించడమే లక్ష్యంగా ఆరు నెలలుగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలో ఉన్న అపరాజిత హాస్టల్‌లో ఉంటూ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతోంది. పరీక్ష ఆదివారం జరగాల్సి ఉండగా, శని వారం గదిలో ఒంటరిగా ఉన్న యశ్విత తీవ్రమనస్తాపానికి గురై విషం తాగింది. ఎంతసేపటికీ గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన తోటివిద్యార్థినులు, హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిక్కడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరిచి చూడగా ఆమె మృతిచెంది ఉంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

## దుర్గమ్మ ఆలయంలో వైభవంగా పూర్ణాహుతి



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 29, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో పాత యాగశాలలో అత్యంత వైభవంగా మహా పూర్ణాహుతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర మార్జనము. అమ్మవారి సేవలో పాల్గొన్న ఆలయ ఈవో వీకే శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు పాల్గొన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గత మూడు రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్న శ్రీ పరాభవ నామ సంవత్సర వార్షిక పవిత్రోత్సవాలు శనివారం నాటితో శాస్త్రోక్తంగా, వైభవంగా స్వస్తి పలికారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు, వేద పండితుల ఆధ్వర్యంలో పవిత్రోత్సవాల ముగింపు క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం యాగశాలలో పూజించిన పవిత్ర జలాలతో దేవతామూర్తులకు, ఆలయ ప్రాంగణానికి సంప్రోక్షణ చేస్తూ శాంతి మార్జనము, ఆశీర్వచనం నిర్వహించారు. ఆలయంలో తెలిసీ తెలియక జరిగే దోషాల నివారణార్థం, లోక కళ్యాణార్థం ఈ పవిత్రోత్సవాలను ఆనవాయితీ ప్రకారం వైదికంగా నిర్వహించినట్లు వైదిక కమిటీ తెలిపింది. పూర్ణాహుతి స్థానాచార్య వి. శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, కోట రవి కుమార్, వైదిక కమిటీ సభ్యులు శ్రీధర్ శర్మ ఆశీర్వచనం అందజేసి, తీర్థప్రసాదాలు మరియు శేషవస్త్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర బాబు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:**

దుర్గమ్మవారి నిత్యఅన్నదానం విభాగమునకు హైదరాబాద్‌కు చెందిన కునపురెడ్డి దీప్తిశ్రీ, భర్త తేజస్వంత్ రూ.1,00,000/ విరాళము శనివారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేయగా వేదపండితులు వేద ఆశీర్వచనాలు పలికారు.

**సెప్టెంబర్ 4న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు:**

శ్రావణమాస చివరి శుక్రవారం సెప్టెంబర్ 4న ఇంద్రకీలాద్రిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆర్జిత సేవగా, ఉచితంగా రెండు విడతలుగా వైభవంగా నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఆగస్టు31న తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచిత వ్రతం నిర్వహణకు దరఖాస్తులందిస్తామన్నారు. ఈ వ్రతాలకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్జిత సేవా రూపంలో మరియు అర్హులైన పేద మహిళల కోసం ఉచితంగా ఈ వ్రత పూజలను వేర్వేరు సమయాల్లో శాస్త్రోక్తంగా జరిపించనున్నారు. శ్రావణ మాసంలో దుర్గమ్మ సన్నిధిలో జరిగే ఈ విశేష వరలక్ష్మీ వ్రతంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని ఈవో కోరారు. ఇతర సమగ్ర వివరాల కొరకు దేవస్థానం టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 9099 ను సంప్రదించవచ్చని తెలిపారు.




## దేశ రాజధాని పరిసరాల్లో సిఎన్జీ ధరల పెంపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** దేశ రాజధాని ఢిల్లీతోపాటు దాని పరిసర ప్రాంతాలైన నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలో కంప్రెస్డ్ నాచురల్ గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ వాహనదారులపై అదనపు భారం మోపింది. సీఎన్‌జీ ధరను కిలోకు రూ.3.89 మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. తాజా ధరల పెరుగుదలతో ఢిల్లీలో కిలో సీఎన్జీ ధర రూ.86.98 కి చేరింది. అదేవిధంగా నోయిడా, ఘజియాబాద్‌లలో రూ.95.59 గా, గురుగ్రామ్‌లో రూ.92.01 గా కొత్త ధరలు ఖరారయ్యాయి. మీరట్, ముజఫర్‌నగర్, షామ్లీ వంటి ప్రాంతాల్లోనూ పెరిగిన ధరలు అమలవుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ) ధరలు గణనీయంగా పెరగడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సీఎన్జీ ఉత్పత్తి కోసం అవసరమైన సహజ వాయువును ప్రధానంగా ఎల్ఎన్‌జీ రూపంలోనే దిగుమతి చేసుకుంటున్నారు. హార్ముజ్ జలసంధి గుండా సాగే ఇంధన రవాణాలో ఆటంకాలు ఏర్పడటం, శీతాకాలం దృష్ట్యా ఐరోపా దేశాలు తమ నిల్వలను పెంచుకోవడం వంటి పరిణామాల వల్ల సరఫరా వ్యయం పెరిగింది. పశ్చిమాసియా సంక్షోభం తలెత్తిన తర్వాత, మే 15 నుంచి ఇప్పటి వరకు సీఎన్జీ ధరలు పెరగడం ఇది ఐదోసారి. ఈ ధరల పెంపు ప్రభావం ప్రైవేట్ కార్లు, ట్యాక్సీలు, ఆటోరిక్షాలు సహా వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయంపై పడనుంది. పెరిగిన ఇంధన ఖర్చుల భారాన్ని వాహనదారులు ప్రయాణికులపై మోపే అవకాశం ఉంది. రవాణా ఛార్జీలు కూడా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

## తెలంగాణ ప్రభుత్వం మరో రూ.2 వేల కోట్ల రుణం

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో రూ.2 వేల కోట్ల రుణాన్ని సమీకరించాలని నిర్ణయించింది. ఇందుకు రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇండెంట్ పెట్టింది. ఇందులో భాగం సెప్టెంబర్ 1న రిజర్వ్ బ్యాంక్ నిర్వహించే బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను ఈ వేలం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించనున్నట్లు ఇండెంట్‌లో పేర్కొంది. సెప్టెంబర్ 1న ప్రతిపాదించిన రూ.2,000 కోట్లతో కలిపితే ప్రస్తుత 2026-27 లో ఇప్పటివరకూ ఐదు నెలల కాలానికి రిజర్వ్ బ్యాంక్ వేలాల ద్వారా రూ.36,900 కోట్ల మేర రుణం సేకరించింది. ఇందులో ఏప్రిల్‌లో రూ.6,900 కోట్లు, మే లో రూ.6 వేల కోట్లు, జూన్‌లో మరో రూ.6 వేల కోట్లు, జూలైలో రూ.13,500 కోట్లు, ఈ నెలలో రూ.4,500 కోట్ల మేర అప్పు చేసింది. ఇప్పుడు మరో రూ.2 వేల కోట్లతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.38,900 కోట్లకు రుణాలు చేరుకున్నాయి. కాగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నిర్దేశించిన రాష్ట్ర వార్షిక రుణ పరిమితి రూ.58,458.71 కోట్లు. ఇందులో సెప్టెంబర్ 1న ప్రతిపాదించిన రూ.2 వేల కోట్లను కలుపుకుంటే మొత్తం వార్షిక రుణ పరిమితిలో సుమారు 66.5 ఇప్పటికే వినియోగించినట్లవుతుంది.

## ఆరోగ్య రంగంలో అద్భుత ప్రగతి సాధిస్తోన్న భారత్

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** ఆరోగ్య రంగంలో దేశం ఎంతో ప్రగతిని సాధిస్తుందని, కిడ్నీ వ్యాధుల నివారణ ప్రాముఖ్యత ఇస్తున్నాని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. శనివారం నగరం లోని ఒక హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిడ్నీ సింపోజియం-2026 కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కిడ్నీ సంరక్షణ, అవయవ మార్పిడి, ఆధునిక వైద్య చికిత్స రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న హాస్పిటల్స్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెనల్ సైన్సెస్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన వివరించారు. వైద్య రంగంలో కేంద్ర ప్రభుత్వ చొరవ గణనీయమైన మార్పులు, గత దశాబ్ద కాలంలో భారతదేశ వైద్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కిషన్ రెడ్డి తెలిపారు. దేశంలో వైద్య విద్య మౌలిక వసతులు భారీగా విస్తరించాయని పేర్కొన్నారు. 2014లో 387గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్య ప్రస్తుతం 846కు పెరిగిందన్నారు. 51,348 ఎంబిబిఎస్ సీట్ల నుంచి దాదాపు 1.4 లక్షలకు చేరుకున్నాయి. 2014లో కేవలం 7 ఎయిమ్స్ ఉండగా, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 23 ఎయిమ్స్‌లు సేవనందిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడానికి 1.86 లక్షలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా సుమారు రూ. 2 లక్షల కోట్ల విలువైన వైద్య ఖర్చుల భారం సామాన్యులపై తగ్గింది.

అలాగే 20,000 పైగా జన్ ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరలకే నాణ్యమైన జనరిక్ మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు.

## మీరేమైనా దేవుడనుకొంటున్నారా?

### ఎఫ్‌డిఎ అధికారులపై బాంబే హైకోర్టు ఆగ్రహం

**ముంబయి, ఆగస్టు 29:** 'మీరేమైనా ఈ వ్యవస్థకు దేవుడినని భావిస్తున్నారా? కోర్టు ఆదేశాలను కూడా ఖాతరు చేయరా?' అంటూ మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధికారులపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆహార భద్రతా నిబంధనలను 88 శాతం మేరకు కచ్చితంగా పాటిస్తున్నట్లు స్వయంగా తనిఖీల్లో తేలినప్పటికీ, రెస్టారెంట్ల లైసెన్సుల నిలిపివేత ఎత్తివేసేందుకు నిరాకరించిన ఎఫ్‌డీఏ తీరుపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో మండిపడింది. అధికారుల మొండి వైఖరిపై విసిగిపోయిన ధర్మాసనం తక్షణమే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని హెచ్చరిస్తూ, బాంద్రాకుర్లా కాంప్లెక్స్ లోని ముంబై క్రికెట్ అసోసియేషన్ ప్రాంగణంలో మూతపడిన ఐదు ప్రముఖ రెస్టారెంట్లను వెంటనే తెరుచుకోవచ్చని సంచలన తీర్పునిచ్చింది. 88 శాతం నిబంధనలు పాటించినా మళ్లీ ఆంక్షలా పరిశుభ్రత లోపాలు, మూడో వ్యక్తికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారనే నెపంతో ఎఫ్‌డీఏ అధికారులు ఎంసీఏ ప్రాంగణంలోని ఐదు రెస్టారెంట్ల లైసెన్సులను రద్దు చేస్తూ గతంలో ఆదేశాలు ఇచ్చారు. దీనిపై ఎంసీఏ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది.



ఇటీవల నిర్వహించిన తాజా తనిఖీల్లో ఈ రెస్టారెంట్లు 88 శాతం ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పాటిస్తున్నాయని స్పష్టమైంది. అయినప్పటికీ, లైసెన్సులు ఎంసీఏ పేరిట ఉండి.. నిర్వహణ మాత్రం షిర్కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వద్ద ఉందనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి ఎఫ్‌డీఏ ఆంక్షలు కొనసాగించడమే వివాదానికి మూలకారణంగా మారింది. కోర్టు మాట వినకపోతే జైలుకే పంపుతాం టెక్నికల్‌గా కాకుండా వ్యవహారికంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని గత విచారణలోనే ఎఫ్‌డీఏకు సూచించామని, అయినా అధికారులు కోర్టు ఆదేశాలను పక్కనపెట్టి మొండిగా ప్రవర్తించారని తాత్కాలిక చీఫ్ జస్టిస్ జస్టిస్ రవీంద్ర ఘుగే, జస్టిస్ గౌతమ్ అంఖాడ్‌ల ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ప్రతిసారీ డిపార్ట్మెంట్ అధికారులకు మొట్టికాయలు వేసి అలసిపోయాం. ఇప్పుడు కఠినమైన చర్యలు తీసుకోక తప్పడం లేదు. బాధ్యులైన అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించి జైలుకు పంపడానికైనా వెనుకాడబోం' అని న్యాయమూర్తులు హెచ్చరించారు.



## పుష్కర శోభకు భద్రాద్రి ముస్తాబు

### గోదావరి ఒడిలో పుణ్యవేళకు శ్రీకారం

### రామయ్య చెంతకు లక్షలాది భక్తుల రాకకు రంగం సిద్ధం

### రూ.49 కోట్లతో ఘాట్లు.. రూ.351 కోట్లతో ఆలయాభివృద్ధి

**భద్రాచలం, ఆగస్టు 29, ప్రభాతవార్త:** గోదావరి పుష్కరాల ఆధ్యాత్మిక వైభవానికి భద్రాద్రి ఇప్పటి నుంచే ముస్తాబవుతోంది. 2027 పుష్కరాలను పురస్కరించుకుని భద్రాచలంలో ఘాట్ల నిర్మాణ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. పుష్కర ఏర్పాట్ల కోసం మూడు విడతల్లో దాదాపు రూ.49 కోట్లను వెచ్చించనున్నారు. మొదటి విడతలో రూ.46.65 కోట్లు, రెండో విడతలో రూ.1.75 కోట్లు, మూడో విడతలో రూ.60 లక్షలతో పనులు చేపట్టనున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రధాన పనులను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. భద్రాచలంతో పాటు పర్ణశాల, మోతేపట్టినగర్ తదితర ప్రాంతాల్లోనూ ఘాట్లను అభివృద్ధి చేయనున్నారు. గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. రామయ్య దర్శనం.. గోదావరి పుణ్యస్నానం.. పుష్కర సంకల్పంతో భద్రాద్రి ఆధ్యాత్మిక క్షేత్రంగా మారనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. వైద్య శిబిరాలు, పారిశుద్ధ్యం, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి అవసరం. కరకట్ట సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు. పుష్కరాల నేపథ్యంలో రవాణా, వసతి, అత్యవసర సేవలకు ముందస్తు కార్యాచరణ రూపొందించనున్నారు. మరోవైపు రూ.351 కోట్లతో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఒకవైపు రామయ్య ఆలయ అభివృద్ధి.. మరోవైపు పుష్కర ఘాట్ల నిర్మాణం సాగుతోంది. ఇంకోవైపు భక్తులకు మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. దీంతో భద్రాచలం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. గోదావరి తల్లి ఒడిలో పుష్కర పుణ్యస్నానం.. రామయ్య సన్నిధిలో దర్శనం.. 2027 పుష్కర వైభవానికి భద్రాద్రిలో ఇప్పుడే మంగళఘోష మోగుతోంది!

30 -8Pg9th cheli.qxd:30 -8Pg9th cheli.qxd 1/1/02 5:51 AM Page 1



# అప్పటికప్పుడు చేసుకునే పచ్చళ్లు



## బీట్ రూట్‌తో..

బీట్‌రూట్-ఒకటి, ఉప్పు- తగినంత, కారం-అరకప్పు, ఆవపిండి- పావుకప్పు, నిమ్మరసం-ఆరుచెంచాలు, పసుపూ, నూనె-కప్పు, ఆవాలు-అరచెంచా, ఎండుమిర్చి-రెండు.

**తయారీ :** బీట్‌రూట్‌ని చిన్నముక్కలుగా తరిగి అందులో నిమ్మరసం కలిపి పక్కనపెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడిచేసి ఆవాలూ, ఎండుమిర్చీ వేయించి పొయ్యి కట్టేయాలి. అందులోనే తగినంత ఉప్పు, కారం, ఆవపిండీ వేసి నిమిషం అయ్యాక ఈ తాలింపునంతా బీట్‌రూట్ ముక్కలకు కలిపితే చాలు.

## క్యాబేజీతో..

క్యాబేజీ-చిన్న ముక్క, ఉప్పు-తగినంత, కారం-నాలు చెంచాలు, వెనిగర్-రెండు చెంచాలు, ఆవపిండి-మూడు చెంచాలు, ఆవాలు-అరచెంచా, ఎండుమిర్చీ-నాలుగు, వెల్లుల్లి రెబ్బలు-రెండు, పల్లీనూనె-కప్పు.



**తయారీ :** క్యాబేజీని సన్నగా తరిగి వెనిగర్ కలిపి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో ఉప్పు, కారం, నూనె, ఆవపిండి కలపాలి. ఇందులో వెల్లుల్లి తరుగు వేయాలి. వెనిగర్‌లో క్యాబేజీ వూరిన తర్వాత ఇందులో కలపాలి. దీనిపై ఆవాలూ, ఎండుమిరినచతో తాలింపు వేస్తే ఆ వేడికి క్యాబేజీ బాగా మగ్గి మంచి రుచి వస్తుంది. ఇష్టమైన ఆరు పల్లీలు కూడా వేసుకోవచ్చు.

## దొండ కాయతో...

దొండకాయలు-ఎనిమిది, ఉప్పు రెండు చెంచాలు, కారం-నాలుగు చెంచాలు, ఆవపిండి-రెండు చెంచాలు, పల్లీనూనె-పావుకప్పు, నిమ్మరసం నాలుగు చెంచాలు, పసుపూ-పావుచెంచా, ఆవాలు-అరచెంచాఎండు మిర్చి-రెండు, మెంతిపిండి-పావు చెంచా.



**తయారీ :** దొండకాయలను చిన్న ముక్కలుగా తరిగి పసుపూ, నిమ్మరసం పట్టించి పక్కన పెట్టుకోవాలి. ఓ గిన్నెలో తగినంత ఉప్పు, కారం, ఆవపిండీ, మెంతుపిండీ, ముప్పావువంతు నూనె వేసి అన్నింటినీ బాగా కలిపి పెట్టుకోవాలి. ఇందులో దొండకాయ ముక్కలు వేసి బాగా కలపాలి. ఇప్పుడు మిగిలిన నూనెను వేడిచేసి ఆవాలూ, ఎండుమిర్చి వేయించి పచ్చడిపై వెయ్యాలి. ఇష్టమైన వాళ్లు ఆ తాలింపులో వెల్లుల్లీ వేసుకోవచ్చు.

## కూరగాయలతో..

క్యారెట్, క్యాప్సికం, ఉల్లిపాయ-ఒక్కోటి చొప్పున, క్యాబేజీ తరుగు-రెండు పెద్ద చెంచాలు, పచ్చిమిర్చి-ఐదు, వెల్లుల్లి తరుగు-పెద్ద చెంచా, ఆవనూనె-పావుకప్పు, ఉప్పు-తగినంత, ఆవపిండి-రెండు చెంచాలు, ఎండు మిర్చి-మూడు, నిమ్మ కాయ-ఒకటి, ఆవాలు- చెంచా.



**తయారీ :** క్యారెట్, క్యాప్సికం, ఉల్లిపాయని సన్నగా తరిగి ఈ ముక్కలకు క్యాబేజీ కూడా కలపాలి. వీటిపై ఆవపిండీ, తగినంత ఉప్పు వేసి మరోసారి కలపాలి. తరవాత నిలువుగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడిచేసి ఆవాలూ, ఎండుమిర్చీ. వెల్లుల్లి ముక్కలు వేయించి.. ఈ కూరముక్కలపై వేయాలి. చివరగా నిమ్మరసం కలిపితే చాలు. ఇందులో పచ్చిమిర్చి వేస్తాం కాబట్టి కారం అవసరంలేదు.

## క్యాలీఫ్లవర్‌తో..

క్యాలీఫ్లవర్ పువ్వులు-కప్పు, ఉప్పు-తగినంత, కారం-నాలుగు చెంచాలు, ఆవపిండి-చెంచా, నిమ్మరసం రెండు చెంచాలు, నువ్వుల నూనె-అరగ్లాసు, మెంతి పిండి-చెంచా, ఇంగువ. పసుపు-చిటికెడు చొప్పున.



**తయారీ :** ఒక పాత్రలో కానయలీఫ్లవర్ పువ్వులుతప్ప మిగిలిన పదార్థాలన్నీ తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. తరవాత కడిగి తడి పూర్తిగా ఆరిన క్యాలీఫ్లవర్ పువ్వులు వేయాలి. ఇందులో ఇంగువ ఉంటుందికాబట్టి. అదనంగా తాలింపు వేయాల్సి న అవసరం లేదు. □

## సేవలో మహిళలు ముందు !

విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు సేవ చేయడానికి ముం దుం డేది ఆడవాళ్లే. సామాజిక కార్యకర్తలుగా, హెల్త్‌కేర్ వర్కర్లుగా పనిచేసే వాళ్లలో 70 శాతం మంది మహిళలూ, అమ్మాయి లేనట. అయితే, 50 శాతం మహిళలకు కృషికి తగ్గ గుర్తింపు, ఫలితం అందడం లేదట. ఏది ఏమైనా..అమ్మ ప్రేమను కుటుంబానికే కాదు, సమాజానికి అందించడంలోనూ మనకు మనమే సాటి! □



# సొగసుల రోజా !

**సౌందర్య పరిరక్షణలోనూ గులాబీల పాత్ర ఎంతో ఉందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందామా?**



నల్లటి వలయాలు దూరం... కళ్ల కింద వలయాల సమస్యకు చెక్ పెట్టడానికి గులాబీలను ఉపయోగించవచ్చు. కొద్దిగా రోజ్ వాటర్‌ని తీసుకొని అందులో కాటన్‌ను ముంచి కళ్లకింద మృదువుగా మర్దన చేయాలి. ఇలా కనీసం రెండు రోజులకోసారి చేస్తే ఫలితం ఉంటుంది. గులాబీ రేకల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మంపై వచ్చే దురద, మంటను తగ్గిస్తాయి.

**క్లెన్సర్‌గానూ :..** గులాబీ మంచి క్లెన్సర్‌గా కూడా పని చేస్తుంది. రోజ్‌వాటర్ మన ముఖంపై ఉన్న జిడ్డుని, పేరుకుపోయిన మురికిని తొలగించి చర్మాన్ని తాజాగా మార్చుతుంది. అంతేకాదు.. గులాబీ రేకల్లోని సహజసిద్ధమైన నూనెలు చర్మాన్ని తేమగా ఉంచేందుకు సహకరిస్తాయి. అందుకే స్నానం చేసే నీటిలో కొద్దిగా రోజ్‌వాటర్ లేదా కొన్ని గులాబీ రేకలను వేసుకుంటే చర్మం మెరుపును సంతరించుకుంటుంది. విటమిన్ 'సి' పుష్కలం... గులాబీల్లో విటమిన్ 'సి' శాతం ఎక్కువ. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేసి అతినీల లోహిత కిరణాల నుంచి రక్షణ కల్పిస్తుంది. అందుకే ఎండలోకి వెళ్లేముందు రోజ్‌వాటర్ అప్లై చేసుకొని వెళ్లడం మంచి దంటున్నారు నిపుణులు. అంతేకాదు. గులాబీ ట్యాన్‌ని కూడా తొలగిస్తుంది. దీనికోసం కీరా దోస, గులాబీ, గ్లిజరిన్‌లు కలిపిన ప్యాక్‌ని వేసుకుంటే ఫలితం ఉంటుంది.



**జుట్టు ఆరోగ్యానికి ...** గులాబీల్లో ఉండే సహజ సిద్ధమైన కండిషనింగ్ గుణాలు జుట్టును పట్టుకుచ్చులా మెరిసేలా చేస్తాయి. దీనికోసం మీరు వాడే షాంపూ లేదా కండిషనర్‌లో కొన్ని చుక్క రోజ్ వాటర్ కలుపుకొంటే సరి లేదా గులాబీ రేకల పేస్ట్‌ను జుట్టుకు, కుదుళ్లకు పట్టించి కాసేపయ్యాక తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. □

# నాగమ్మా.. కొలిచేమమ్మా !

**అగ్ని పురాణం, స్కంద పురాణం, నారద పురాణం మహాభారతం వంటి భారతీయ గ్రంథాలు పాములను ఆరాధించే క్రతువును పాముల చరిత్ర వివరాలను తెలియజేస్తాయి.** మహా భారత ఇతిహాసంలో, కురు వంశానికి చెందిన పరీక్షిత మహారాజు కుమారుడు జనమేజయుడు, తక్షకుడు అనే పాము కాటుతో తన తండ్రి మరణించినందుకు ప్రతీకారం తీర్చుకోవడానికి సర్ప సత్రం యాగం చేస్తున్నాడు. ఒక బలి కొరివి ప్రత్యేకంగా నిర్మించబడింది మరియు ప్రపంచంలోని అన్ని పాములను చంపడానికి అగ్ని యాగం నేర్చుకున్న సబ్రాహ్మణ ఋషుల గెలాక్సీ ద్వారా ప్రారంభించబడింది. జనమేజయుని సమక్షంలో చేసిన యాగం చాలా శక్తివంతమైనది, ఇది అన్ని పాములను యజ్ఞకుండలో పడేలా చేస్తుంది. పరీక్షితుడిని కాటువేసి చంపిన తక్షకుడు మాత్రమే తన రక్షణ కోరుతూ ఇంద్రలోకానికి పారిపోయాడని పురోహితులు గుర్తించినప్పుడు, ఋషులు తక్షకుడిని మరియు ఇంద్రుడిని కూడా యజ్ఞం అగ్నికి లాగడానికి మంత్రాలు పఠించే వేగాన్ని పెంచారు. తక్షకుడు ఇంద్రుని మంచం చుట్టూ చుట్టుకున్నాడు, అయితే యజ్ఞం యొక్క బలం చాలా శక్తివంతమైనది. తక్షకుడితో పాటు ఇంద్రుడు కూడా అగ్ని వైపుకు లాగబడ్డాడు. ఇది దేవుళ్ళను భయపెట్టింది, అప్పుడు మానసాదేవి జోక్య చేసుకుని సంక్షోభాన్ని పరిష్కరించమని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఆమె తన కొడుకు ఆస్తికను యజ్ఞ జరిగే ప్రదేశానికి వెళ్లి సర్ప సత్ర యజ్ఞాన్ని ఆపమని జనమేజయుడిని కోరింది. ఆస్తికుడు జనమేజయుడిని అన్ని శాస్త్రాల జ్ఞానంతో ఆకట్టుకున్నాడు, ఆ సమయంలోనే ఆస్తికుడు జనమేజయుడిని అన్ని శాస్త్రాల జ్ఞానంతో ఆకట్టుకున్నాడు. అతను అతనికి వరం కోరడానికి అనుమతించాడు. ఆ సమయం లోనే ఆస్తికుడు సర్ప సత్రాన్ని ఆపమని జనమేజేయుడిని అభ్యర్థిం చాడు. రాజు బ్రాహ్మణుడికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. యజ్ఞం చేస్తున్న ఋషులచే రక్షించబడి నప్పటికీ అతను పశ్చాత్తాపం చెందాడు. అప్పుడు యజ్ఞం నిలిపివేయశాడు. రోజు ఇంద్రదు కూడా మానసాదేవి వద్దకు వెళ్లి పూజించాడు.



గరుడ పురాణం ప్రకారం, ఈ రోజున పాములకు పూజలు చేయడం శుభప్రదం ఒకరి జీవితంలో శుభవార్తలను అందిస్తుంది. దీన్ని అనుసరించి బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. నాగపంచమి రోజున, నాగుపాము, పాములను పాలు, మిఠాయిలు, పువ్వులు, దీపాలతో పూజించడమే కాకుండా నైవేద్యాలతో పూజిస్తారు. వెండి, రాయి, చెక్క లేదా గోడపై చిత్రించిన నాగ లేదా సర్ప దేవతలను మొదట నీటితో పాలతో స్నానం చేసి, తరువాత 'నాగ ప్రీతా భవంతి శాంతిమాప్నోతి బిల విబోధ్ సశాంతి లోక్ మా సాధ్య సత్య సత్యే' 'నాగ్ ప్రీతా భవని శాంతిమాప్నోతి బియా విభోః స శాంతి లోకా మా సాధ్యా మోదతే షష్ఠితః సుమః' అనే మంత్రాలను పఠిస్తూ పూజిస్తారు. □

తెర

# మహేంద్రగిరి వారాహి : ట్రైలర్ విడుదల



మహేంద్రగిరి వారాహి పై నాకు చాలా నమ్మకం ఉంది. ఆ నమ్మకాన్ని సెప్టెంబర్ 11న థియేటర్లలో చూస్తారు: హీరో సుమంత్‌సుమంత్, సిద్దు జొన్నలగడ్డ, సంతోష్ జాగర్లపూడి, లక్ష్మణ్, కలిపు మధు, రాజ శ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్రిడ్జ్ ఫిల్మ్స్ 'మహేంద్రగిరి వారాహి' ట్రైలర్ లాంచ్'మహేంద్రగిరి వరాహి' ట్రైలర్ లో సర్‌ప్రైజ్ చేసిన స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ హీరో సుమంత్ విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చు కున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ఆధ్యాత్మిక మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' మహేంద్రగిరి పర్వతాల నేపథ్యంతో, వారాహి మాత దైవశక్తి చుట్టూ అల్లుకున్న ఆసక్తికరమైన కథతో రూపొందుతోంది. సంతోష్ జగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కి ముఖ్య అతిధిగా విచ్చేసిన డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లా డుతూ.. అనూప్ మ్యూజిక్‌కి నేను ఫ్యాన్‌ని. లక్ష్మణ్ గారు ఎక్కడుంటే అక్కడ డబ్బు ఉంటుంది. ఆయనది లక్కీ హ్యాండ్. ఈ సినిమా కూడా సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను. హీరో సుమంత్ మాట్లాడుతూ.. ట్రైలర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. మా టీజర్ ఇప్పటికే చాలా వైరల్ అయిం ది. దానికంటే పది రెట్లు ఈ ట్రైలర్ మా సినిమాని ముం దుకు తీసుకెళ్తుందని ఆశిస్తు న్నాను. డైరెక్టర్ సంతోష్ మాట్లా డుతూ.. ఈ వేడుకకు విచ్చేసిన వెంకీ అట్లూరి గారికి థాంక్యూ. ఆయన చేతుల మీదుగా ట్రైలర్ లాంచ్ కావడం చాలా ఆనందంగా ఉంది. మేమం దరం ఒక టీమ్ వర్క్‌లా చేశాం. మాకు ఈ అవకాశం ఇచ్చిన మా నిర్మాతలకు కృతజ్ఞతలు. నిర్మాత మధు మాట్లాడుతూ.. ఈ వేడుకకు విచ్చేసిన వెంకీ అట్లూరి గారికి థాంక్యూ సో మచ్. ట్రైలర్ చూసిన తర్వాత మాకు మరింత గొప్ప విశ్వాసం కలిగింది. సెప్టెంబర్ 11న సినిమా రిలీజ్ అవుతుంది.

# 'కింగ్ 100' డిసెంబర్ 24న గ్రాండ్ రిలీజ్

కింగ్ నాగార్జున మైల్ స్టోన్ 100వ చిత్రం కింగ్ 100, అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మాణంలో, రా కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుం టోంది. నాగార్జున పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమా పవర్‌ఫుల్ టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. నాగార్జున వాయిస్‌ఓవర్‌తో ప్రారంభమయ్యే గ్లింప్స్‌లో సమాజం మనుషులను వారి సంపద ఆధారంగా ఎలా విభజిస్తుందనే అంశాన్ని ఆసక్తికరంగా ప్రస్తావిం చారు. తన దగ్గర ఏమీ లేనప్పుడు తనను 'లూజర్' అని పిలిచారని, అదే సంపద సంపాదించిన తర్వాత 'ది కింగ్' అని పిలుస్తున్నారని నాగార్జున చెప్పే డైలాగ్ ఆకట్టుకుంది. నాగార్జున మైల్‌స్టోన్ 100వ సినిమాకు 'కింగ్ 100' అనే టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంది. నాగార్జున తన స్టార్‌డమ్‌కు తగ్గట్టుగా పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను ఎంచుకున్నా రని గ్లింప్స్ చూస్తుం టే అర్థమోతోంది. నాగార్జు నను



అత్యంత స్టైలిష్, డైనమిక్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, స్టైల్, యాటిట్యూడ్ ఆకట్టుకున్నాయి. నిజమైన సూపం స్టార్‌కు ఉండే రాయల్ స్వాగ్‌తో నాగార్జున కనిపిం చారు. ఆయన పాత్ర ఎలా ఉండబోతోం దనే ఆసక్తిని గ్లింప్స్ మరింత పెంచింది. డైరెక్టర్ రా కార్తీక్ స్టొరీ తెల్లింగ్ కూడా ఫ్రెష్‌గా, ఇంట్రెస్టింగ్‌గా ఉంది. గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్, రిచ్ విజువల్స్ గ్లింప్స్ ను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లాయి. 'కింగ్ 100' టైటిల్ గ్లింప్స్ మజెస్టిక్‌గా, మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. నాగార్జున పవర్‌ఫుల్ అవతార్, ఆసక్తికరమైన కథాంశం, గ్రాండ్ విజువల్స్, హైఎనర్జీ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. అక్కినేని అభిమానులు, ప్రేక్షకులను ఈ గ్లింప్స్ అలరించింది.

# రవితేజ క్రేజీ కాంబినేషన్‌లో కొత్త సినిమా



'ఇరుముడి'తో అద్భుతమైన విజ యాన్ని అందు కున్న మాస్ మహా రాజా రవితేజ మరో ఆసక్తికర మైన ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతు న్నారు. సరిపోదా శనివారం తో బ్లాక్‌బస్టర్ అందుకున్న ట్యాలెంటెడ్ ఫిల్మ్‌మేకర్ వివేక్ ఆత్రేయతో రవితేజ జతకట్టను న్నారు .'ఇరుముడి' బాక్సా ఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సాధిస్తూ, రికార్డు స్థాయి వసూళ్లతో దూసు కెళ్తోంది. ఈ చారిత్రాత్మక విజ యాన్ని పురస్కరించుకుని నిర్వ హించిన ప్రత్యేక వేడుకలో దర్శకుడు వివేక్ ఆత్రేయ, నిర్మాత లు లక్ష్మణ్, శ్రీని.. రవితేజను కలిసి బ్లాక్‌బస్టర్ విజయానికి అభినందనలు తెలిపారు.రవితేజ, వివేక్ ఆత్రేయ, లక్ష్మణ్, శ్రీని, బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ కొత్త చిత్రం ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది.రవితేజ, వివేక్ ఆత్రేయ కలయికలో రాబోతున్న ఈ సినిమా ప్రత్యేకమైన కాంబినేషన్‌గా నిలవనుంది. వివేక్ ఆత్రేయ తనదైన ట్రీట్‌మెంట్‌తో రూపొందించే ప్రపంచంలోకి రవితేజ అడుగుపెట్టడం ద్వారా సరికొత్త సినీ అనుభూతి అందించనున్నారు. రవితేజ ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్, లార్జర్‌దేన్‌లైఫ్ పర్సనాలిటీకి వివేక్ ఆత్రేయ స్టైల్ ప్రత్యేకంగా నిలవనుంది.దర్శకుడు హసిత్ గోలితో రవితేజ చేయనున్న సినిమా పూర్తయిన తర్వాత ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.ఈ కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

# మీడియా పతాకాలు నిర్మిస్తున్న సినిమాలో ఫోక్ స్టార్ కిట్టు పవన్



తెలంగాణా మట్టి వాసనలతో సంచలనమైన జానపద పాటలతో వందల మిలియన్ల వ్యూస్ సాధించి ప్రేక్షకు లకు దగ్గరైన కిట్టు హీరోగా శనివారం రోజున సినిమా ప్రారంభమైంది. యం.యస్ వారాహి క్రియేషన్స్ , శివమ్ మీడియా పతాకంపై ప్రొడక్షన్ నం 3గా ముని శివ, శివమల్లాలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు దిలీప్ సాయి నాయక్. మాదాపూర్ శివమ్ మీడియా కార్యాలయం లో చిత్రం వై వంగా ప్రారంభమైంది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ రచయిత ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్ , దర్శకుడు ఆర్.పి పట్నాయక్, నేషనల్ అవార్డు విన్నర్ సతీష్ వేగేశ్న, బిగ్ టీవి చైర్మెన్ విజయ్ వెన్నం పాల్గొన్నారు. దర్శకుడు దిలీప్‌కి స్క్రిప్ట్‌ని సతీష్ వేగేశ్న, బుల్లెట్‌బండి లక్ష్మణ్ అందించగా హీరో కిట్టుపై చంద్రబోస్ క్లాప్ నిచ్చారు. ఆర్ పి పట్నాయక్ తొలిషాట్‌కి గౌరవ దర్శకత్వం వహించగా బిగ్ టీవి విజయ్ కెమెరా స్విచాన్ చేసి టీమ్‌కి అభినందనలు తెలిపారు. చంద్రబోస్ మాట్లాడుతూ– ఈ టీమ్ గురించి నాకు చాలా బాగా తెలుసు. టీమంతా ఎంతో టాలెంట్ ఉన్నవారు. నిర్మాతలు ముని శివ, శివమల్లాలల, బుల్లెట్‌బండి లక్ష్మణ్, సంగీత దర్శకుడు మదిన్ నాకు ఎంతో ఆత్మీయులు. వారందరూ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. సతీష్ వేగేశ్న మాట్లాడుతూ– మంచికథతో వచ్చిన దర్శకుడు దిలీప్‌కి మా శివలిద్దరూ ఎంతో సపోర్ట్ చేస్తున్నారు. వీరందరికి పెద్ద విజయం రావాలని కోరుకుంటున్నా అన్నారు. ఆర్‌పి పట్నాయక్ మాట్లాడుతూ ఈ నిర్మాతలిద్దరూ మంచి సినిమాలు చేసి పెద్ద నిర్మాతలుగా మారి పదులకొద్ది సినిమాలు తీయాలని కోరుకుంటున్నా అన్నారు. హీరో కిట్టు మాట్లాడుతూ– నేను చాలా చిన్న నటునిగా ఫోక్ సాంగ్స్ చేసేవాడిని. అలాంటిది నేను చేస్తున్న ఈ సినిమాకి ఇంత పెద్దవాళ్లు వచ్చి సపోర్టు చేయటం ఎంతో ఆనందంగా ఉంది అన్నారు



# 'ధర్మస్థల నియోజకవర్గం' ట్రైలర్ లాంచ్

సెప్టెంబర్ 4న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న 'ధర్మస్థల నియోజ కవర్గం' సినిమా మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయి కుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రం ధర్మస్థల నియోజకవర్గం. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తోన్న ఈ పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం.. సెప్టెంబర్ 4న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఆర్ట్ డైరెక్టర్ భార్గవాచారి నౌండ్ల మాట్లాడుతూ ధర్మస్థల నియోజకవర్గం చాలా మంచి మూవీ. సెప్టెంబర్ 4న రిలీజ్ కు వస్తోంది. థియేటర్స్‌లో చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ మహావీర్ ఏలేందర్ మాట్లాడుతూ ఈ సినిమాకు మంచి సాంగ్స్ చేసే అవకాశం కలిగింది. మొత్తం ఐదు పాటలు ఉంటాయి. పాటలన్నీ మా గురువు చంద్రబోస్ రాశారు. ప్రొడ్యూసర్ మేరుం భాస్కర్ మాట్లాడుతూ మా మూవీని ఎంతో క్లారిటీతో రూపొందిం చారు దర్శకుడు జై జ్ఞాన ప్రభ. 45 రోజుల్లో మొత్తం షూటింగ్ చేయాలని ప్లాన్ చేసుకున్నాం. అనుకున్నట్లుగా 45 రోజుల్లోనే మొత్తం ప్యాచ్ వర్క్ తో సహా షూటింగ్ కంప్లీట్ చేశారు. యాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ సినిమాను ప్యాషన్ తో నిర్మించే బ్యానర్ ఇది. ఇలాంటి బ్యానర్స్ బాగుంటే అందరూ బాగుంటాయి. ఈ చిత్రంలో ఒక బ్యూటిఫుల్ రోల్ చేశాను. డైరెక్టర్ కొత్త వారైనా ఎవరికీ అలా అనిపించలేదు. చాలా క్లారిటీతో సినిమాను రూపొందిం చారు. అన్నారు.

# బిల్లా రంగా బాషా: ది ఫస్ట్ బ్లడ్ ప్రమోషనల్

సూపర్‌స్టార్ బాద్‌షా కిచ్చా సుదీప్ ప్రతిష్టాత్మక పీరియడ్‌యాక్షన్ స్పెక్టకిల్ బిల్లా రంగా బాషా: ది ఫస్ట్ బ్లడ్ థియేట్రికల్ రిలీజ్ దిశగా యూనిక్ ప్లానింగ్‌తో ముందుకు సాగుతోంది. అనూప్ భండారి దర్శకత్వం వహిస్తున్న ఈ హైబడ్జెట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ వినూత్నమైన ప్రమోషనల్ క్యాలెండర్‌ను ప్రకటించారు. ఈ ప్రమోషనల్ క్యాంపెయిన్ 2026 సెప్టెంబర్ 2 నుంచి 2027 చివరి క్వార్టర్లో సినిమా విడుదలయ్యే వరకు కొనసాగనుంది.సుదీప్ పుట్టినరోజు అయిన సెప్టెంబర్ 2, 2026న ఈ ప్రచార కార్యక్రమం అధికారికంగా ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ఒక ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించ నున్నారు. తాజాగా విడుదల చేసిన అనౌన్స్ మెంట్ పోస్టర్ మంచుతో నిండిన ల్యాండ్‌స్కేప్స్, ఎత్తైన మంచు నిర్మాణాలతో ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. ఈ అనౌన్స్‌మెంట్‌లో ముఖ్యంగా ఆకట్టుకునే అంశం మేకర్స్ రూపొందించిన లాంగ్‌టర్మ్ ప్రమోషనల్ స్ట్రాటజీ. 2027 తొలి క్వార్టర్లో టీజర్ విడుదల చేయనున్నారు. అనంతరం 2027 మూడో క్వార్టర్లో భారీ ప్రమోషనల్ ఫేజ్‌ను ప్రారంభించి, ట్రైలర్, పాటలను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత 2027 చివరి క్వార్టర్లో సినిమాను థియేటర్లలోకి తీసుకురానున్నారు. చాలా ముందుగానే రూపొందించిన ఈ ప్రమోషనల్ టైమ్‌లైన్ బిల్లా రంగా బాషాకు ప్రత్యేకమైన ప్రమోషనల్ విధానాన్ని అందిస్తోంది. ఎక్కువ కాలం పాటు ప్రేక్షకుల్లో ఆసక్తిని క్రమంగా పెంచేలా మేకర్స్ ఈ ప్లాన్‌ను రూపొందించారు.విజయవంతమైనవిక్రాంత్ రోణా తర్వాత సుదీప్, అనూప్ భండారి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం బిల్లా రంగా బాషా. దర్శకుడు మరోసారి విస్తృతమైన సినిమాటిక్ యూనివర్స్‌ను క్రియేట్ చేస్తున్నారు. సుదీప్ ఈ పీరియడ్‌యాక్షన్ అడ్వెంచర్‌లో లార్జర్‌దేన్‌లైఫ్ పాత్రలో నటిస్తున్నారు.



## తెలుగు భాషను కాపాడుకుందాం : డాక్టర్ జె సి రాజు

**బొబ్బిలి, ఆగస్టు 29, ప్రభాతవార్త:**



మన అమ్మ భాష తెలుగు భాషను కాపాడుకోవటం మనందరి భాద్యతని కారుణ్య ఫౌండేషన్ డాక్టర్ జెసి రాజు పిలుపునిచ్చారు. తెలుగు భాషా దినోత్సవ నేపథ్యంలో తెలుగును సంరక్షించుకుందాం అంటూ కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాషాభిమానులు స్థానిక కళాభారతి వద్దనున్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి తెలుగు భాషకు విశేష కృషి చేసిన వ్యవహారిక భాషా పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళులు అర్పించారు. గిడుగు తెలుగు భాషకు చేసిన కృషిని స్మరించుకున్నారు.భాషాభిమానులు డాక్టర్ బొంతు శ్రీరాములు, పిరిడి మధుసూదనరావు తెలుగు బోధన ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్,చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇండస్ హాస్పిటల్ ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన



**బొబ్బిలి, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

స్థానిక కళింగ వైశ్య సంఘం బొబ్బిలి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం విశేష స్పందన లభించిందని జిఎం బి రమేష్ ఏజీఎం అప్పలనాయుడు బొత్స తెలియజేశారు. ఈ వైద్య శిబిరం బొబ్బిలి ఆర్యవైశ్య సంఘం ప్ర శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యవర్గం సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించమని మొత్తం ఓపి 236 మంది హార్ట్ బ్లాక్ 3. రిఫ్రెల్ కేస్ 26 మంది తెలియజేశారు. డాక్టర్ టి రాకేష్ కార్డియాలజిస్టు, డాక్టర్ కే వి డి కార్తీక్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కావ్య ప్రియ జనరల్ సర్జన్ ఈ శిబిరాన్ని నిర్వహించారు. అని ఏటీఎం అప్పలనాయుడు తెలియజేశారు.

## ఎస్‌జీఎస్‌లో ఘనంగా తెలుగు భాషా , క్రీడా దినోత్సవ వేడుకలు

**గరివిడి, ఆగస్టు 29, ప్రభాత వార్త:**



శ్రీరాం నగర్ ఎస్ జి ఎస్ సీనియర్ సెకండరీ పాఠశాల లో తెలుగు భాషా దినోత్సవ, క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా నిర్వహించే తెలుగు భాషా దినోత్సవాన్ని పాఠశాలలో వేడుకగా నిర్వహించారు. తొలుత గిడుగు చిత్ర పటానికి శ్రీరాం విద్యాపీఠ్ కార్యదర్శి, పాఠశాల ప్రిన్సిపాల్ బలిజేపల్లి రవి, డీన్ పి.సత్యనారాయణ పూలమాలలు వేసి జయంతి నివాళులు అర్పించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పాఠశాల ప్రాంగణంలో వేడుకగా నిర్వహించారు. విద్యార్థులు క్రీడా విన్యాసాలు తో ప్రాంగణం కళకళ లాడింది. విద్యార్థులు ప్రదర్శించిన యోగా విన్యాసాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా గిడుగు రామ మూర్తి పంతులు తెలుగు భాష కోసం చేసిన కృషి ని వక్తలు మననం చేసుకున్నారు.ఆయన వ్యవహారిక భాష కోసం గర్జించే పిడుగు అని వక్తలన్నారు. హాకీ లో తనదైన ఆట ప్రదర్శించిన ధ్యాన్ చంద్ ఆరాధ్యుడని పేర్కొన్నారు.

**అవంతీస్‌లో ఘనంగా క్రీడా దినోత్సవ వేడుకలు**

స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాల భాస్కర రావు ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడల్లో పతకాలు సాదించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ధ్యాన్ చంద్ స్ఫూర్తి తో ప్రతీ విద్యార్థి క్రీడల్లో రాణించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి వి రమణ, పరిపాలనాధికారి గరికపాటి అనీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## డైట్ కళాశాలలో తెలుగు, క్రీడా దినోత్సవ వేడుకలు



**నెల్లిమర్ల, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

ఇక్కడి వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో తెలుగు, క్రీడా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ డా. రామకృష్ణరావు పర్యవేక్షణలో తెలుగు అధ్యాపకులు కే. అప్పారావు, కాళ్ల అప్పారావు, సత్యారావు క్రీడా విభాగానికి చెందిన లక్ష్మణరావు సమన్వయంతో ఈ కార్యక్ర మాలు నిర్వహించారు.వేడుకల్లో భాగంగా నిర్వహించిన భువన విజయం, నాటికలు, ఏకపాత్రాభినయం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉపాధ్యాయ విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వారి అద్భుత ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని ఆనం దింపజేశాయి. తెలుగు భాషా వైభవాన్ని చాటడంతో పాటు, క్రీడల ప్రాధాన్యతను తెలియజేసేలా కార్యక్రమా లను నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంస్కృతిక చైతన్యం, క్రీడాస్ఫూర్తి పెంపొందించేలా వేడుకలు సాగాయి. వైస్ ప్రిన్సిపాల్ డి. అప్పలనాయుడు, స్టాఫ్ సెక్రటరీ వి.సి. నాయుడు, సూపరింటెండెంట్ కమలకుమారి, వివిధ విభాగాధిపతులు డి. శ్రీనివాసరావు, సూరిబాబు, సూర్యకళ, రజిత హాజరయ్యారు.

## కురుపాం హైస్కూల్‌లో ఘనంగా తెలుగు భాషోత్సవం

**కురుపాం, ఆగస్టు 29, ప్రభాత వార్త :**



తెలుగు భాష దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. శనివారం ప్రధానోపాధ్యాయులు తోట శంకర రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిడుగు రామ్మూర్తి పంతులు , ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు కె. అరుణ జ్యోతి, ఎం. నూతన, వ్యాయామ ఉపాధ్యాయులు హరికృష్ణ, జయకుమార్ లను సత్కారించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శంకర రావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ కుమార్, రామ్ గాంధీ, జగదీశ్వరరావు, తదితరులు ప్రసంగించారు.

## రాష్ట్ర మంత్రి నైనా.. తెలుగు తమ్ముళ్లకు సంధ్యక్కనే

### ప్రేమానురాగాలకు సూచిక రక్షాబంధన్



**సాలూరు, ఆగష్టు29, ప్రభాతవార్త :**

సాలూరు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాఖీ పండగ వేడుకలు ఎంతో వేడుకగా నిర్వహించారు. శుక్రవారం ఉదయమే రాష్ట్రమంత్రి సంధ్యారాణి నివాసం దగ్గరకు తెలుగుతమ్ముళ్ల రాకతో రాఖిపండగ సందడి కనపడింది.అలాగే పట్టణ,మండల టీడీపీ నాయకులకు ఒక్కొక్కరుగా సంధ్యారాణి రాఖీలు కట్టడంతో తెలుగుదేశం తమ్ముళ్లు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రమంత్రి నైనా తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు సంధ్యక్కనే అని ఆమె చెప్పడం తో తెలుగుతమ్ముళ్ల మొఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.మంత్రి మాట్లాడుతు రక్షాబంధన్ అంటే అన్నాచెల్లెలు,అక్కాతమ్ముళ్ల ప్రేమ అనురాగలకి సూచకంగా రాఖీపౌర్ణమీ జరుపుతారని స్పష్టం చేసారు.టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ చిట్టి,ఆముదాల పరమేష్,హర్ష,యుగంధర్,ముఖీ సూర్యనారాయణ,కొనిసి చిన్ని , తదితరులు పాల్గొన్నారు.

## అపోహలు వీడండి - నేత్ర దానం చెయ్యండి

**పార్వతీపురం, ఆగష్టు29, ప్రభాతవార్త:**



ఒకరి నేత్ర దానం వల్ల ఇద్దరి అంధుల జీవితాల్లో వెలుగు నింపవచ్చు అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా విజయలక్ష్మి అన్నారు. జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు లో భాగంగా శనివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి సంస్థ ఆధ్వర్యంలో నర్సిపురం ఉన్నత పాఠశాల లో ఉపాధ్యాయులకు నేత్ర దానం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా విజయలక్ష్మి నేత్ర దాన ప్రాముఖ్యత వివరిస్తూ ప్రతీ ఒక్కరు నేత్ర దానం చేసి మనదేశంలో అంధత్వ నివారణకు మనందరం కృషి చేసి అంధులకు చూపునిచ్చే బాధ్యతను తీసుకోవాలన్నారు. సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా. జగన్ మోహన్ రావు మాట్లాడుతూ కంటి చూపు సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి మాట్లాడుతూ మనిషి మరణానంతరం శరీరం లో దానం చేసే అవయవం నేత్రాలు మాత్రమే కావున ప్రతీ ఒక్కరు నేత్రాలను మరణాంతరం దానం చేసి పునర్జన్మ పొందవచ్చు అని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, సి ఆర్ పి అనురాధ మరియు కొంతమంది ఉపాధ్యాయులు తమ నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చి అంగీకార పత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థకు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఆషా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా ఉండాలి

**గజపతినగరం, ఆగస్టు 29, ప్రభాత వార్త:**

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా ఉండాలని గజపతినగరం మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఇప్పటివరకు 80 శాతం మంది రైతులు విశిష్ట సంఖ్య పొందగా మిగిలిన 20 శాతం మంది ఇంకా పొందాలని సూచించారు. ఈ నెంబర్ ఉన్న రైతులకు మాత్రమే పిఎం కిసాన్ సొమ్ము జమ అవుతుందని తెలిపారు. ఈ నెంబర్ ఉన్న రైతులు మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పంట అమ్ముకొని కనీస మద్దతు ధర పొందుతారని తెలిపారు.

## గిడుగు...తెలుగుకు వెలుగు

### - ప్రధానోపాధ్యాయులు జె సి రాజు



**రామభద్రపురం, ఆగష్టు 29,ప్రభాత వార్త:**

తెలుగు భాషకు గిడుగు వెలుగు వంటి వారని వాడుక భాషలో తెలుగు రచనలు చేసి భాషావ్యాప్తికి కృషి చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులని నాయుడు వలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె సి రాజు అన్నారు.శనివారం పాఠశాలలో గిడుగు జయంతి ని తెలుగుభాషా దినోత్సవం గా విద్యార్థులు నిర్వహించారు.ముందుగా గిడుగు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు గిడుగు ...తెలుగుకు వెలుగుఅనే అక్షరాకృతి ఆకట్టుకుంది.ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన, సుమతీ శతక పద్య పోటీలను నిర్వహించారు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు.అనంతరం హెచ్ ఎం జె సి రాజు మాట్లాడుతూ భాషా పరిరక్షణ వారసులు విద్యార్థులేనని అన్నారు.విద్యార్థులు తెలుగు భాషపై ఇష్టాన్ని పెంచుకొని దాన్ని వినియోగించాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే తెలుగునును సజీవంగా ఉంచుతున్నారన్నారు ఉపాధ్యాయులు రాజమ్మ, ఉదయ కుమారి, కృష్ణం నాయుడు, రమణ పాల్గొన్నారు.

## ఏకైక గురుకుల విద్యాసంస్థను ఎత్తివేయడంలో ఎత్తుగడ ఏమిటి ..!





**సాలూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త :**

ఉత్తరాంధ్ర జిల్లా కేంద్రంలో ఉన్న ఏకైక ఇంగ్లీష్ మీడియం గిరిజన గురుకుల పాఠశాల మారికవలస విద్యాసంస్థ ఎత్తివేయడం అంటే గిరిజన విద్యను ఎదగనీయ కుండా చేయడమే అని గిరిజన ఆదివాసి సంఘం తెలిపింది. శనివారం ఆదివాసి జిల్లా నాయకుడు ఎస్.అప్పారావు మాట్లాడుతు కొత్తగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కూల్ ప్రారంభించడం ఎవరికి అభ్యంతరమని కానీ ఒక విద్యాసంస్థలో ఉన్న విద్యార్థులను వేరే దగ్గరకు తరలించి,అదే పాఠశాలలో దీన్ని పెట్టడం అంటే కచ్చితంగా గిరిజన విద్యార్థుల అభివృద్ధికి ఆటంకమే అవుతుందన్నారు. అలాగే జీవో నెంబర్ 3 దొడ్డి దారిన రద్దుచేసి రెండేళ్లు గడిచిందని దీనివలన గిరిజన ప్రజానికం ఉద్యోగ నియామకాల్లో నష్టపోతున్నారని స్పష్టం చేశారు.అంతేకాకుండా మారికవలస ఏపీఆర్జేసీని అక్కడే ఉంచి విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా వారి పోరాటానికి మద్దతుగా నిలుస్తామని హెచ్చరించారు. రామయ్య, శ్రీనువాసరావు పాల్గొన్నారు.

## రైతులందరూ పంటల బీమా చేసుకోవాలి

**నెల్లిమర్ల, ఆగస్టు 29, ప్రభాతవార్త:**





పంటల భీమా పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని పి. శ్రీలక్ష్మి సూచించారు. మండలంలోని తశీగుడుబిల్లి, సీతారామునిపేట గ్రామాల్లో రైతులకు పంటల బీమాపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు పంటల బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంకు రుణాలు తీసుకోని రైతులు ఆగస్టు 31వ తేదీలోగా పంటల బీమా ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని తెలిపారు.ఎస్‌బీఐ ఎఫ్‌ఎల్‌సీ అధికారి ప్రకాశ్‌రావు మాట్లాడుతూ, పంటల బీమా ద్వారా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన సమయంలో రైతులకు ఆర్థిక రక్షణ లభిస్తుందని వివరించారు. రైతులు చివరి తేదీ కోసం వేచి ఉండకుండా వెంటనే బీమా చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

## సారా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడులు



**కురుపాం, ఆగస్టు 29, ప్రభాత వార్త :**

ఆంధ్రా, ఒడిశా సరిహద్దులలో సంయుక్తంగా నాటు సారా తయారు చేసే కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నవోదయం 2.0 కార్యక్రమంలో అమలులో భాగంగా పార్వతీ పురం మన్యం జిల్లా ఎక్సైజ్ పార్వతీపురం టాస్క్ ఫోర్స్ ఏ ఇ ఎస్.సంతోష్ ఆధ్వర్యంలో ఆంధ్రా - ఒడిస్సా సరిహద్దులో గల నాటు సారా తయారీ స్థావరాలు కలిగిన కెరడా ,అనిజ, వలవలో ఒడిస్సా పోలీస్ అధికారులతో కలిసి సంయుక్త దాడులునిర్వహించగా నాటు సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 4,800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని తెలిపారు.దాడుల్లో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వి వి ఎస్ శేఖర్ బాబు సిబ్బంది, విజయనగరం ఎన్ఫోర్స్ మెంట్ ఏ ఇ ఎస్. ఏం వి గోపా కృష్ణ సిబ్బంది, సీతా నగరం స్టేషన్ సిబ్బంది , శేష్కల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది,కురుపాం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ జె. రాజశేఖర్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోర్ట్ సిటీ పాఠశాలలో ఘనంగా తెలుగుభాషా, క్రీడా దినోత్సవం

**విజయనగరం, ఆగస్టు 29,ప్రభాతవార్త:**



ఫోర్బ్ సిటీ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాలను శనివారం ఘనంగా జరిపారు. ఈనెల 23 నుండి 29 వరకు తెలుగు భాషా వారోత్సవాలు జరిగాయి. ఈ తెలుగు భాషా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు, వ్యాసరచన, క్విజ్ వక్తృత్వం, పద్యపఠనం, వేషాధారణ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసారు. అదే విధంగా కొంతమంది విద్యార్థులు ఆటలు ఆడే విధానంను ప్రదర్శించారు. ఎల్కేజీ యూకేజీ పిల్లలు 'బ్రేన్ డే' వేడుకలు చేశారు. చిన్నారులు 'బ్రేన్ 'రంగుల్' వున్న దుస్తులను ధరించి అందరికీ ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల చైర్మన్ కె. ఎ.పి. రాజు (శివ) మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనం గురించి, క్రీడల ప్రయోజనాలు గురించి వివరించారు. చిన్నారులు రంగులను సులభంగా గుర్తు పెట్టగలరని, ఐక్యత, సృజనా త్మకత పెరుగుతుందని రంగులు గురించి తెలుసుకుంటూ సరదాగా గడుపు తారన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రీయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశీక్, నీలిమ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ఉపాధ్యాయులను వారు అభినందించారు.

## తాగు నీరు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

**పార్వతీపురం,ఆగస్టు 29, ప్రభాతవార్త :**

పట్టణ ప్రజలకు త్రాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ కుమార్, ఈవి నాయుడు గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సీతారాం దొర ఆరోపించారు. వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలు వేలాది రూపాయలను పన్నుల రూపంలో మున్సిపాలిటీకి చెల్లిస్తున్నప్పటికీ అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాలను అందుకోలేని దౌర్భాగ్య స్థితిలో పట్టణ ప్రజలు ఉన్నారన్నారు. ఎన్నికల ముందు పోటీ చేసే పార్టీల అభ్యర్థులు మాత్రం ఈ మున్సిపాలిటీ పైన ప్రజల పైన సవతి తల్లి ప్రేమ చూపిస్తూ ఎన్నికలలో గెలిచిన అనంతరం మొదటిసారిగా పట్టణంలో ఉన్న త్రాగునీటి సమస్యను పరిష్కరిస్తామని మభ్యపెట్టి గారడీ మాటలు చెప్పి ప్రజల దగ్గర నుంచి ఓట్లు గుంజుకొని గద్దెనెక్కిన అనంతరం ఈ పట్టణ ప్రజల బాగోగులను గాలికి వదిలేసే పరిస్థితి నెలకొందని అన్నారు. ఇవే కల్లబొల్లి కబుర్లు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారని ప్రజలకు తాగునీరు అందించేందుకు కనీస చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు.ఈ మున్సిపాలిటీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించేందుకు ఏ ఒక్క కమిషనర్ పూర్తిస్థాయిలో విధులు నిర్వహించకుండా సెలవు పెట్టి వెళ్లే పరిస్థితి నెలకొందని, జిల్లా ఉన్నతాధికారి, నియోజకవర్గ ప్రజా ప్రతినిధి మధ్య సఖ్యత లేకపోవడమే కారణంగా తెలియవచ్చిందని, వీరిరువురు మధ్య ఇమడ లేకనే మున్సిపల్ అధికారులు సెలవులపై వెళిపోతున్నారన్న వార్తలు వినిపిస్తున్నా యని, ఇప్పటికైనా వీరిరువురు పునరాలోచన చేసి సఖ్యతతో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలన్నారు.

## కొండ లేవిడిలో కార్డెన్ అండ్ సెర్చ్

**కురుపాం, ఆగస్టు 29, ప్రభాత వార్త:**

ఆపరేషన్ వజ్ర ప్రహార్‌లో భాగంగా,ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ హరి ఆధ్వర్యంలో నిర్వహించారు . శనివారం నీలకంఠపురం, ఎల్విన్‌పేట సబ్ ఇన్స్పెక్టర్‌లు, సర్కిల్ సిబ్బందితో కలిసి కొండలేవిడి గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.అందులో భాగంగా ప్రతిఇంటిని చట్టవ్యతిరేకమైన వస్తువులు, సరుకులు కొరకు తనిఖీ చేయడం జరిగింది.అనంతరం ప్రజలతో సమావేశం నిర్వహించి, వారితో మాధకద్రవ్యాల నిర్మూలన చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం లంకజోడు గిరిజన సంక్షేమ వసతి బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడి మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన, ప్రేమ వ్యవహారాల వలన కలిగే ఇబ్బందులు, టీనేజ్ గర్భధారణ వలన కలిగే ఇబ్బందులు, మహిళలు మీద జరుగు నేరాలు, బాల్యవివాహాలు వలన కలుగు నష్టాలు ఎస్ఐ రమేష్ నాయుడు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ , టీచర్స్ కానిస్టేబుల్ వేణు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**వేపాడ ,ఆగస్టు 29, ప్రభాతవార్త:**

మండలంలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నందున ఈ అవకాశాన్ని ఓటర్లంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ కోరారు. శనివారం కేజీపూడి, ఆకుల సీతంపేట గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్) కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాల నిండిన ప్రతి యువతీ యువకులు ఫామ్ 6 పెట్టి కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
25
వార్త

## గ్రీన్ అంబాసిడర్ వేతనాలు చెల్లించాలి

**దత్తిరాజేరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:**



మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. లక్ష్మి తెలిపారు, మండల పరిషత్ అభివృద్ధి అధికారికి శనివారం వినతి పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ సుమారు 12 నెలల వరకు జీతాలు పెండింగ్ బకాయిలు ఉన్నాయన్నారు, టీ బూర్జువలస 12 నెలలు. చుక్క పేట. గుచ్చిమి 8 నెలలు, వంగర మూడు నెలలు దత్తి రెండు నెలలు బకాయిలు ఉన్నాయి అన్నారు,ఈ విషయంపై ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లగా బడ్జెట్ వచ్చిన వెంటనే బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు, అయితే డిమాండ్ పై రాష్ట్రవ్యాప్తంగా, సెప్టెంబర్ 2 లేక3 తేదీల్లో కలెక్టర్ ఆఫీస్ వద్ద జరుగు ధర్నాలో మండలంలో ఉన్న గ్రీన్ అంబాసిడర్ లందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు, మూడో తేదీన జిల్లా వ్యాప్తంగా ఒకరోజు పని బంద్ చేస్తామన్నారు. మండల నాయకులు నూకరాజు. జి మూర్తి, సూర్యారావు. రామకృష్ణ అప్పయ్య పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించాలి

**భోగాపురం, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

ఓటర్ల జాబితా పరిశీలకులు, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ శనివారం భోగాపురం మండల కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్లను జాబితాలో చేర్పించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్థానిక అధికారులకు సూచించారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించడంతో పాటు కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి యువతలో ఓటు హక్కుపై చైతన్యం కల్పించాలన్నారు.కొన్ని వార్డుల్లో ఒకే కుటుంబ సభ్యులకు సంబంధించిన ఓట్లు వేర్వేరు చోట్ల నమోదై ఉన్న సమస్యలు ఉన్నాయని, వాటిని ఫారం--8 ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 82 వేల మంది కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును పొందేందుకు సిద్ధంగా ఉన్నారని, వారికి ఫారం 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

**భోగాపురం, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. శనివారం ముంజేరు గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతిపత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా రెవెన్యూ, పెన్షన్లు, ఉపాధి అవకాశాలు, విద్యుత్ సమస్యలతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించిన పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికితీసుకువచ్చారు.పూసపాటిరేగ మండలం,అల్లాడపాలెం గ్రామంలో వోల్టేజీ సమస్య ఉందని దాన్ని పరిష్కరించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. పశుపాం గ్రామంలో పాఠశాల భవన నిర్మాణాన్ని వేగవంతం చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని విన్నవించారు. భోగాపురం మండలం తూడెం గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం, తాగునీటి సరఫరా మెరుగుదలతో పాటు నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని స్థానికులు వినతిపత్రాలు అందజేశారు.పూసపాటి రేగ మండలం,కుమిలి గ్రామానికి గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు శ్మశాన వాటికకు స్థలం కేటాయించి అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు.

## ఘనంగా గిడుగు రామ్మూర్తి 163 వ జయంతి వేడుకలు

**లక్కవరపుకోట, ఆగస్టు 29, ప్రభాత వార్త :**



మండలంలోని ఎల్ కోట తాసిల్దార్ కార్యాలయంలో శనివారం తెలుగు భాషా ఉద్యమ గిడుగు రామ్మూర్తి 163 వ జయంతి వేడుకలు తాసిల్దార్ ఈ హరి ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో గల గిడుగు రామ్మూర్తి విగ్రహానికి తాసిల్దార్ శ్రీహరి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పితామహుడు గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, విలువ ను తెలియజెప్పిన మహనీయుడు.గా రామ్మూర్తి ని పేర్కొన్నారు ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారికభాషను గ్రంథరచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చతెలుగు వ్యక్తి శ్రీ గిడుగు రామ మూర్తి పంతులు అని అటువంటి మహా వ్యక్తి జయంతిని జరుపుకోవడం అందరి బాధ్యతగా ఆయన పేర్కొన్నారు మహాత్ములు ఎది చేసిన మొత్తం సమాజానికి మేలు జరిగే కార్యక్రమం మాత్రమే చేపడతారని వారికి కులమత ప్రాంతం బంధుత్వం కంటే ప్రజాసేవ ముఖ్యమని భావించి జీవిస్తారు కనుక వారు చరిత్ర లో గొప్ప వారిగా ఇప్పటికి గుర్తింపు పొందారు అని అన్నారు . కార్యక్రమంలో డి టి రమేష్ రీ సర్వే డి టీ ఆర్ ఐ సన్యాసిరావు వి ఆర్ ఓ లు ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మదేవిపేట జ్యోతిబా పూలే స్కూల్లో ఘనంగా స్పోర్ట్స్ డే



**లక్కవరపుకోట, ఆగస్టు 29, ప్రభాత వార్త :**

జమ్మదేవి పేట కేంద్రం గా నడపబడుతున్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలోశనివారం స్పోర్ట్స్ డే వేడుకలను ప్రిన్సిపాల్ యూ విజయ్ కుమార్ పాత్రో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అలాగే గిడుగు రామ్మూర్తి 163 వ జయంతి వేడుకలు కూడా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయా వ్యక్తుల చిత్ర పాటలకు పూల మాలలు వేసి ప్రిన్సిపాల్ నివాళులు అర్పించాట్ అనంతరం అయన మాట్లాడితూ భారత హాకీ దిగ్గజం, ప్రముఖ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ క్రీడా వేడుకలను నిర్వహించడము జరుతుందన్నారు .ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించగా, వారు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. క్రీడల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడంతో పాటు, క్రీడా స్ఫూర్తిని చాటేలా ఈ కార్యక్రమం సాగింది.మేజర్ ధ్యాన్‌చంద్ దేశానికి అందించిన క్రీడా సేవలను స్మరించుకుంటూ, ఆయన జీవితం నేటి క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని నిర్వాహకులు తెలిపారు. క్రీడల్లో ప్రతిభను పెంపొందించుకోవడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టుస్ఫూర్తిని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.

## శత శాతం రుణాలు రికవరీపై దృష్టి పెట్టాలి

**వేపాడ, ఆగస్టు29, ప్రభాతవార్త:**



వెలుగు సిబ్బంది, వివోఏలు రుణాలు ఇప్పించడంలోనే కాకుండా శత శాతం రికవరీ చేయాలని విజయనగరం డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస పాణి ఆదేశించారు.శనివారం వేపాడ వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో స్థానిక సిబ్బంది, విఓ ఏ ల తో సమావేశం నిర్వహించారు . 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబందించి వెలుగు ద్వారా అమలు అవుతున్న కార్యక్రమాల పై సమీక్ష జరిపారు. సంఘాలు నెలవారి సమావేశాలు సక్రమంగా నిర్వహించడం, మన డబ్బులు మన లెక్కలు ప్రతి సభ్యురాలు వారి యొక్క మొబైలు లో చూసుకొనేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సావిత్రి,జిల్లాప్రాజెక్ట మేనేజర్ లు ఎల్. రాజ్యలక్ష్మి , లక్ష్మినాయుడు , స్త్రీనిధి ఏ. జి.యం వి.సత్యనారాయణ, వేపాడ ఏపిఎం డి.సూర్యనారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు సిరపరపు వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## నివాళులర్పించిన మాజీ డిప్యూటీ సీఎం

**మక్కువ, ఆగస్టు 29, ప్రభాతవార్త:**

పనసభద్ర పంచాయతీ ఆలగురువు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రామారావు అనారోగ్యంతో విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర శనివారం అలగురవు వెళ్లి భౌతిక కాయానికి నివాళులర్పించారు. మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మావుడి రంగు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి సానుభూతి తెలుపుతూ పార్టీ అండగా ఉంటుందని రాజన్న దొర తెలిపారు.

ఆట

## మాంటెర్రే ఓపెన్‌లో బార్టుంకోవాపై మెర్టెన్స్ విజయం



**మెక్సికో:** బార్టుంకోవాపై విజయం సాధించిన మెర్టెన్స్, మాంటెర్రే ఓపెన్ ఫైనల్‌లో ప్యారీ సరసన చేరింది. ఈ టోర్నీలో బెల్జియంకు చెందిన రెండో సీడ్ ఎలిస్ మెర్టెన్స్ ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని చెక్ క్రీడాకారిణి నికోలా బార్టుంకోవాను 1-6, 6-4, 6-2 తేడాతో ఓడించి, డయాన్ ప్యారీతో ఫైనల్ పోరుకు సిద్ధమైంది. 23 ఏళ్ల ఫ్రెంచ్ క్రీడాకారిణి ప్యారీ, అంతకుముందు జరిగిన మొదటి సెమీఫైనల్‌లో అమెరికన్ ఐదవ సీడ్ ఆన్ లీని రెండు గంటల మూడు నిమిషాల పోరులో 7-6(7) 6-4 తేడాతో ఓడించి ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. రెండవ సెమీఫైనల్‌లో, బార్టుంకోవా అద్భుతమైన ఆరంభం చేసింది. తొలి గేమ్‌లోనే మెర్టెన్స్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, 4-1 ఆధిక్యంతో దూసుకుపోయింది. ఆ 20 ఏళ్ల క్రీడాకారిణి రెండోసారి కూడా సర్వీస్‌ను బ్రేక్ చేసి, మెర్టెన్స్‌కు తిరిగి పుంజుకునే అవకాశం ఏమాత్రం ఇవ్వలేదు. చివరి గేమ్‌లో మూడోసారి సర్వీస్‌ను బ్రేక్ చేసి, సెట్‌ను 6-1తో కైవసం చేసుకుంది. తొలి సెట్‌లో వెనుకబడిన తర్వాత, మెర్టెన్స్ రెండో సెట్‌లో 3-0తో వెనుకబడినప్పటికీ పుంజుకుంది. వరుసగా మూడు రిటర్న్ గేమ్‌లలో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి, చివరి ఏడు గేమ్‌లలో ఆరింటిని గెలుచుకొని, సెట్‌ను 6-4తో కైవసం చేసుకుని స్కోరును సమం చేశాడు. మెర్టెన్స్ ఆ ఊపును నిర్ణయాత్మక సెట్‌లోకి కొనసాగించి చివరకు 6-2 తేడాతో సెట్‌ను కైవసం చేసుకుంది.

## ఆసియా క్రీడలకు నీరజ్ దూరం




**న్యూఢిల్లీ:** భారతదేశానికి రెండుసార్లు ఒలింపిక్ పతకం అందించిన నీరజ్ చోప్రా, చీలమండకు గాయం కావడంతో రాబోయే 2026 ఆసియా క్రీడలకు దూరమవ్వనున్నాడు. గత వారం లౌసాన్ డైమండ్ లీగ్‌లో సీజన్‌లోనే అత్యుత్తమంగా 88.05 మీటర్ల త్రో నమోదు చేసి రెండో స్థానంలో నిలిచిన చోప్రా, శిక్షణా సెషన్‌లో గాయపడ్డాడు. తన వైద్యుడు, జట్టుతో సంప్రదించిన తర్వాత, 2026 సీజన్ నుండి పూర్తిగా వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు రెండుసార్లు ఆసియా క్రీడల ఛాంపియన్ వెల్లడించారు. ఈ సీజన్‌ను ముగించాలన్న చోప్రా నిర్ణయం వల్ల, అతను ఈ వారం ప్రారంభంలో అర్హత సాధించిన 2026 డైమండ్ లీగ్ ఫైనల్‌కు, అలాగే అర్హత సాధించే అవకాశం ఉన్న తొలి వరల్డ్ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్‌కు కూడా దూరంకానున్నాడు.

## కోల్‌కతా ఫుట్‌బాల్ లీగ్.. మోహన్ బగాన్ హ్యాట్రిక్ విక్టరీ

### 3-1 తేడాతో రైల్వే ఓటమి

**కోల్‌కతా:** కలకత్తా ఫుట్‌బాల్ లీగ్‌లో శనివారం నాడు రైల్వే ఎఫ్‌సిపై మోహన్ బగాన్ సూపర్ జెయింట్ విజయం సాధించి, సూపర్ సిక్స్‌లోకి ప్రవేశించడానికి మరో అడుగు వేసింది. అరగంట తర్వాత రైల్వే తరఫున ఉమేష్ మారండీ తొలి గోల్ చేసి ఆధిక్యాన్ని అందించగా, ఎనిమిది నిమిషాల్లోనే బగాన్ తిరిగి పుంజుకుని మోహన్ బగాన్ గ్రౌండ్‌లో 3-1 తేడాతో విజయం సాధించింది. వరుసగా బాగాన్ చేస్తున్న దాడులను రైల్వే అదుపు చేయడంలో విఫలమవగా, ఐదు నిమిషాలలోపే రోబిలాల్ మండి ఆధిక్యాన్ని రెట్టింపు చేసి మెరైనర్స్‌ను ముందుకు నడిపించాడు. ఆ తర్వాత భారత అండర్23 అంతర్జాతీయ ఆటగాడు సుహైల్ అహ్మద్ భట్ గోల్ చేయడంతో, బాగాన్ జట్టు రెండవ అర్ధభాగంలో ఆటను మలుపు తిప్పి, లీగ్‌లో నాలుగో స్థానంలో ఉన్న యునైటెడ్ ఎసిపై తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని, ఆ రోజును



చిరస్మరణీయంగా ముగించింది. ఒక మ్యాచ్ ఎక్కువగా ఆడినప్పటికీ, తొమ్మిది మ్యాచ్‌లలో 19 పాయింట్లతో ఉన్న ఈస్ట్ బెంగాల్ కంటే బాగాన్ ఒక పాయింట్ వెనుకబడి ఉంది. ఇక సెప్టెంబర్ 1న బిఎస్ఎస్ స్పోర్టింగ్‌తో తదుపరి మ్యాచ్ ఆడనుంది. అదే రోజు రైల్వే, కిడ్డర్‌పోర్‌తో తలపడనుంది. ఇటీవల డ్యూరాండ్ కప్ ఫైనల్‌లో రెడ్అండ్‌గోల్డ్ బ్రిగేడ్ చేతిలో ఓడిపోయిన బగాన్, ఈ మ్యాచ్‌లో తమ ప్రధాన జట్టులోని పలువురు ఆటగాళ్లను బరిలోకి దింపింది. విరామం తర్వాత వెంటనే మన్వీర్ సింగ్ గోల్ చేయడంతో స్కోరు 11తో సమమైంది.




## టీమిండియాకు శ్రీలంక ఎఫెక్ట్

### కివిస్‌తో సిరీస్‌కు ఐదుగురు ఔట్

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్న టీమిండియా, ఇప్పుడు రాబోయే న్యూజిలాండ్ పర్యటనపై దృష్టి సారించింది. నవంబర్ 19న వెల్లింగ్టన్‌లో తొలి టెస్ట్, అలాగే నవంబర్ 27న క్రైస్ట్ చర్చ్‌లో రెండో మ్యాచ్ జరగనుంది. న్యూజిలాండ్ పరిస్థితులు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (డబ్ల్యూటీసీ) భారత జట్టులో కీలక మార్పులు జరిగే అవకాశం ఉన్నాయి.

శ్రీలంక సిరీస్‌లో ఆడిన ఐదుగురు ఆటగాళ్లపై సెలెక్టర్లు పునరాలోన చేస్తున్నారు. భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఇటీవల ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. లంక రెండు టెస్టుల్లో నాలుగు ఇన్నింగ్స్‌లలో జైస్వాల్ కేవలం 139 పరుగులు మాత్రమే చేశాడు. అందులో 34.75 సగటు మాత్రమే ఉంది. న్యూజిలాండ్‌లో బంతి స్వింగ్ అయ్యే పరిస్థితులు ఉండటంతో ఫుట్‌వర్క్ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో ఓపెనింగ్ కాంబినేషన్‌లో మార్పులు జరగాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. దీంతో జైస్వాల్ స్థానంలో సాయి సుదర్శన్‌కు చోటు దక్కే అవకాశం ఉంది.

అప్పుడు కె.ఎల్. రాహుల్‌తో సుదర్శన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నారు. ఇక లంకలో కుల్దీప్ యాదవ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. 25 ఓవర్లలో 103 పరుగులు ఇచ్చి ఒకే వికెట్ మాత్రమే తీశాడు. దీంతో అతన్ని పక్కన పెట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా న్యూజిలాండ్‌లో పరిస్థితులు స్పిన్నర్ల కంటే పేసర్లకి ఎక్కువగా అనుకూలించే విధంగా ఉండటంతో ఎక్కువ మంది స్పిన్నర్లతో వెళ్లాల్సిన అవసరం ఉండదు. సాయి సుదర్శన్ స్థానంలో లంక టూర్‌లో సర్ఫరాజ్ ఖాన్‌ని ఎంపిక చేసింది. అయితే రెండు టెస్టుల్లోనూ బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కొలంబో టెస్ట్‌లో రిషభ్ పంత్ గాయపడిన సమయంలో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా సేవలు అందించాడు. అయితే సుదర్శన్ పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో సర్ఫరాజ్‌కు జట్టులో చోటు కష్టమే. యువ పేసర్ గుర్‌నూర్ బ్రార్ కూడా కీవిస్ టూర్‌లో పోటీ ఎదురుకానుంది. జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌గా ఉంటే అతన్ని ఎంపిక చేయడం కష్టమే. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ పేస్ విభాగంలో బలమైన పోటీదారులుగా ఉన్నారు. అంతేకాదు, హర్షిత్ రాణా గాయం నుంచి కోలుకుంటే అతడు కూడా పోటీలోకి వస్తాడు. దీంతో గుర్‌నూర్ బ్రార్‌కు తుది జట్టులో చోటు దక్కేది అనుమానమే. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో 33 ఏళ్ల వయసులో టెస్ట్ అరంగేట్రం చేసిన సారంచ్ జైన్ పెద్దగా రాణించలేకపోయాడు. దీంతో న్యూజిలాండ్ సిరీస్‌కు అతడికి చోటు దక్కడం అనుమానమే.

## మహిళల ఆసియా కప్‌లో నేడు థాయిలాండ్‌తో భారత్ ఢీ

**దుబాయ్:** మహిళల టీ20 ఆసియా కప్ గ్రూప్ ఎ ఆరంభ మ్యాచ్‌లో థాయిలాండ్‌తో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా క్రికెట్ జట్టు ఈ నెల 30వ తేదీన దుబాయ్‌లో తలపడనుంది. గత దశాబ్ద కాలంగా మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత్ అత్యంత ఆధిపత్యం చెలాయించిన జట్టుగా ఉంది. మహిళల టీ20 ప్రపంచ కప్‌లో నిరాశపరిచిన ప్రదర్శన తర్వాత, ఆస్ట్రేలియాతో జరిగిన అత్యంత కీలకమైన పోరులో హర్మన్‌ప్రీత్ రాణించింది.

అయితే, ఉన్నత ర్యాంకు జట్లపై భారత్ తడబడిన ఈ టోర్నమెంట్‌లో, బ్యాటింగ్‌లో ఆమె నిలకడ లేకపోవడం ప్రధాన చర్చనీయాంశాలలో ఒకటిగా నిలిచింది. ఇక నమ్మకమైన బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ దూరమవడంతో, ఆ స్థానంలో ప్రతీకా రావల్‌ను చేర్చుకుంది. అయితే, ఈ ఎంపిక మిడిల్ ఆర్డర్ ఎన్‌ఫోర్సర్ అవసరాన్ని ఏమాత్రం తీర్చదు. ఓపెనర్లుగా భారత్‌కు స్మృతి మంధాన, షఫాలీ వర్మల పటిష్టమైన ఓపెనింగ్ జోడి కొనసాగుతుంది, కానీ 3వ, ఆ తర్వాతి స్థానాల్లోని బ్యాటర్లకు అదే ఊపును కొనసాగించి, స్కోరుబోర్డుకు మరింత వేగాన్ని అందించడం అతిపెద్ద సవాలుగా నిలుస్తోంది. గతసారి ఈ ఫార్మాట్‌లో భారత్ ఆడినప్పుడు కూడా పేలవమైన ఫీల్డింగ్ ఒక ప్రధాన ఆందోళనగా నిలిచింది.



బౌండరీల సమీపంలో వరుసగా అవకాశాలను జారవిడవడం వారి పతనానికి దారితీసింది. దీంతో ఈసారి జట్టు అటువంటి లోపాలను సరిదిద్దుకోవాల్సి ఉంది. స్పిన్ బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించేందుకు అనుభవజ్ఞురాలైన ఆల్‌రౌండర్ దీప్తి శర్మపై ఆధారపడనుంది. టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన శ్రీ చరణీ, రాధా యాదవ్, ప్రేమా రావత్‌లు ఈ బాధ్యతను పంచుకోనున్నారు. మరో అనుభవజ్ఞురాలైన రేణుకా సింగ్ ఠాకూర్‌కు తోడు క్రాంతి గౌడ్, అరుంధతిరెడ్డి, నందినీ శర్మ వంటి వారు బాధ్యతలను పంచుకోవడంతో భారత సీమ్ బౌలింగ్ విభాగం కూడా పటిష్టంగా కనిపిస్తోంది. ఈ టీమిండియాలో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), భారతీ ఫుల్మాలి, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), గుణాలన్ కమలిని (వికెట్‌కీపర్), ప్రతీకా రావల్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, ప్రేమ రావత్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, నందనీ చార్మ ఉన్నారు.

## మళ్లీ సంపాదిస్తా..

### ఆత్మవిశ్వాసంతో పైకొస్తా

### జి చైర్మన్ సుభాష్‌చంద్ర



**ముంబయి, ఆగస్టు 29:** దేశ మీడియా రంగాన్ని శాసించిన ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర, తాను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దాదాపు రూ.22,006 కోట్ల రుణాలకు గాను కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేలా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఆమోదించిన రుణ పరిష్కార ప్రణాళిక నేపథ్యంలో ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. రుణదాతలకు దాదాపు 99.97 శాతం నష్టం వాటిల్లుతున్న ఈ తరుణంలో, తన భవిష్యత్ ప్రణాళికలను ఆయన ధైర్యంగా ప్రకటించారు. నేను సర్వస్వం కోల్పోయిన వ్యక్తిగా మాట్లాడటం లేదు. నా దగ్గర మిగిలిన చివరి రూ.6.5 కోట్లు కూడా ఆమోదించిన ప్లాన్ ప్రకారమే చెల్లించాల్సి ఉంటుంది. నాకు ఒక చిన్న ఇల్లు ఉంది, దానిని అద్దెకిచ్చి వచ్చే ఆదాయంతోనే నా ఖర్చులు వెళ్లదీస్తున్నాను. నాకేమీ పశ్చాత్తాపం లేదు. నేను మళ్లీ సంపాదిస్తాను. నేను ఒక మార్గదర్శకుడిని. కొత్త విషయాలను ఎలా ప్రారంభించాలో నాకు తెలుసు, ఆ పని కొనసాగిస్తానని 75 ఏళ్ల సుభాష్ చంద్ర తన వీడియో సందేశంలో వివరించారు. ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్‌గా మీడియా నుంచి మౌలిక సదుపాయాలు, అమ్యూజ్‌మెంట్ పార్కుల వరకు ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. ఇప్పుడు తన తదుపరి ప్రణాళికల గురించి మాట్లాడుతూ, స్విట్జర్లాండ్‌లో కొత్త కార్యాచరణ షురూచేయనున్నట్లు తెలిపారు. "ప్రస్తుతం, స్విట్జర్లాండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో పనిచేసే నా స్నేహితులతో కలిసి పనిచేయాలని ఆలోచిస్తున్నాను. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఒకటి రెండు వారాల్లో వెల్లడిస్తాను. అలాగే, కొన్ని స్టార్టప్‌లను ముందుకు నడిపించేందుకు నా కుటుంబం నుంచి రూ.24 కోట్ల వరకు అప్పు తీసుకునే అవకాశం కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీఎల్‌టీ ఆమోదించిన ప్రణాళిక ప్రకారం, రుణదాతలు క్లెయిమ్ చేసిన రూ.22,006.57 కోట్లకు బదులుగా కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే పంపిణీకి అందుబాటులో ఉంటాయి. ఇది రుణదాతలకు భారీ నష్టాన్ని మిగిల్చినప్పటికీ, సుభాష్ చంద్ర మాత్రం ఆత్మవిశ్వాసంతో కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం గమనార్హం.

# వాణిజ్యం




## ఐటి రిటర్నులకు గడువు ముంచుకొస్తోంది

**ముంబయి, ఆగస్టు 29:** ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి వేర్వేరు రకాల పన్ను చెల్లింపుదారులకు వేర్వేరు డెడ్‌లైన్స్ ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం లేదా 2026-27 మదింపు సంవత్సరానికి సంబంధించి కొందరు పన్ను చెల్లింపుదారులకు 2026, ఆగస్ట్ 31 గడువుగా ఉంది. ముఖ్యంగా ఎలాంటి టాక్స్ ఆడిట్ అవసరం లేని వారికి, బిజినెస్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న పన్ను చెల్లింపుదారులు ఈ తేదీలోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆ గడువు దాటితే తర్వాత బిలేటెడ్ ఐటీ రిటర్న్స్ దాఖలు చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఆలస్య రుసుముతో పాటు ఇతర ప్రభావాలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ గడువు ప్రధానంగా కింది వర్గాలకు వర్తిస్తుంది. బిజినెల్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న, టాక్స్ ఆడిట్ అవసరం లేని సంస్థల భాగస్వాములు, చట్టంలో పేర్కొన్న కొన్ని ఇతర వర్గాల పన్ను చెల్లింపుదారులు, ట్రస్టులు వంటి వర్గాలకు గతంలో జులై 31 గడువుగా ఉండగా, కొన్ని మార్పుల నేపథ్యంలో ఆగస్ట్ 31 వరకు అదనపు సమయం లభించినట్లు సమాచారం. 2026-27 మదింపు సంవత్సరానికి సంబంధించి సాధారణ ఐటీఆర్ గడువులు ఇలా ఉన్నాయి. వేతన జీవులు, బిజినెల్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం లేని నాన్ ఆడిట్ టాక్స్ పేయర్లకు జులై 31 లాస్ట్ డేట్. టాక్స్ ఆడిట్ అవసరం లేని బిజినెస్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న వారికి ఆగస్ట్ 31 లాస్ట్ డేట్‌గా ఉంది. కంపెనీలు, టాక్స్ ఆడిట్‌కు లోబడే టాక్స్ పేయర్లకు అక్టోబర్ 31, సెక్షన్ 92ని కింద ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ రిపోర్ట్ అవసరమైనవారికి 2026, నవంబర్ 30 డెడ్‌లైన్ ఆగస్ట్ 31 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సిన అర్హత ఉన్న నాన్ ఆడిట్ టాక్స్ పేయర్లు గడువు మిస్ అయితే, నిబంధనలకు లోబడి బిలేటెడ్ ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. దీనికి సాధారణంగా 2026, డిసెంబర్ 31 వరకు అవకాశం ఉంటుంది. అయితే వర్తించే నిబంధనలు, వ్యక్తిగత పరిస్థితులపై ఇది ఆధారపడి ఉంటుంది. ఇంకా గడువు దాటిన తర్వాత ఐటీఆర్ దాఖలు చేస్తే సెక్షన్ 234ఎఫ్ కింద రూ. 5 వేల వరకు లేట్ ఫీ పడుతుంది. ఇక్కడ ఆదాయం రూ. 5 లక్షల్లోపు ఉంటే రూ. 1000 ఫైన్, రూ. 5 లక్షలు దాటితే రూ. 5 వేల వరకు జరిమానా పడుతుంది.




## జియోబ్లాక్‌రాక్ నుంచి కొత్త ఫండ్ ఆఫర్!

**ముంబయి, ఆగస్టు 29:** మ్యూచువల్ ఫండ్ సంస్థ జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ మరో కొత్త స్కీమ్‌ను తీసుకురాబోతుంది. జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ పేరుతో ఈ కొత్త ఎన్ఎఫ్‌ఓను (న్యూ ఫండ్ ఆఫర్) సెప్టెంబరులో ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ ఎన్ఎఫ్ఓ 2026, సెప్టెంబర్ 11న ప్రారంభం కానుండగా, అదేనెల 26 లాస్ట్ డేట్‌గా ఉంది. ఎన్ఎఫ్ఓలో యూనిట్ల కేటాయింపు పూర్తయిన తర్వాత కనీసం 5 పని దినాల్లోపు ఈ స్కీమ్‌ను నిరంతర కొనుగోలు, విక్రయాల కోసం తిరిగి ప్రారంభించనున్నారు. జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ అనేది ఒక ఓపెన్ ఎండెడ్ డైనమిక్ అసెట్ అలొకేషన్ ఫండ్. ఇది ప్రధానంగా ఈక్విటీ, ఇతర ఈక్విటీకి సంబంధించిన సాధనాలు, డెట్, మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ పరిస్థితులు, పెట్టుబడి వ్యూహాన్ని బట్టి ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడులను నిర్వహించడమే ఈ తరహా ఫండ్లలో ప్రధాన ప్రత్యేకత. ఈ స్కీమ్ లక్ష్యం దీర్ఘకాలంలో మంచి మూలధన వృద్ధితో పాటు ఇన్వెస్టర్లకు ఆదాయం అందించడమే. ఈక్విటీ, ఈక్విటీ రిలేటెడ్ సాధనాల్లో 65 శాతం నుంచి 90 శాతం వరకు పెట్టుబడుల్ని డెట్, మనీమార్కెట్ సాధనాల్లో 10నుంచి 35% వరకు కేటాయించనున్నారు. మార్కెట్ పరిస్థితులు, ఫండ్ వ్యూహాన్ని బట్టి వాస్తవ పెట్టుబడి కేటాయింపుల్లో మార్పులు ఉండొచ్చు. ఈ ఎన్ఎఫ్ఓలో లంప్ సమ్ పెట్టుబడికి కనీస మొత్తం రూ. 500 గా నిర్ణయించారు. గరిష్ఠ పెట్టుబడికి పరిమితి అంటూ ఏం లేదు. సిప్ ద్వారా కూడా కనీసం రూ. 500 తో పెట్టుబడిని ప్రారంభించొచ్చు. అయితే కనీసం 6 సిప్‌లైనా చేసి ఉండాలి. అదనపు కొనుగోలు లేదా స్విచ్ ఇన్ కోసం కూడా కనీస పెట్టుబడి మొత్తం రూ. 500 గానే ఉంది.

## టాటా సన్స్‌లో ఎస్పీ గ్రూప్ వాటా విక్రయం!

**ముంబయి,ఆగస్టు 29:** టాటా గ్రూప్‌లో అతిపెద్ద మైనారిటీ వాటాదారుగా ఉన్న శాపూర్జీ పల్లోంజీ (ఎస్పీ) గ్రూప్‌తో టాటా గ్రూప్ చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ నివేదించింది. ఖరీదైన రుణాలను తీర్చేందుకు నిధులు సమీకరించుకోవాలని చూస్తున్న ఎస్పీ గ్రూప్‌కు లిక్విడిటీ అందించే మార్గాలపై ఇరు వర్గాలు చర్చిస్తున్నాయి. ఇందులో టాటా గ్రూప్‌కు చెందిన లిస్టెడ్ కంపెనీల షేర్లను ఎస్పీ గ్రూప్‌కు బదిలీ చేసే 'షేర్ స్వాప్ ప్రతిపాదన కూడా ఉన్నట్లు సమాచారం. టాటా కుటుంబ అధిపతి నోయెల్ టాటా ప్రతినిధులు ఈ అంశంపై పలు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో ఎస్పీ గ్రూప్‌కు ఉన్న 18.4 శాతం వాటాలో కొంత లేదా మొత్తం వాటాకు బదులుగా టాటా పవర్ వంటి లిస్టెడ్ కంపెనీల షేర్లను ఎస్పీ గ్రూప్‌కు అందించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టాటా సన్స్ స్వయంగా ఎస్పీ గ్రూప్ వాటాను కొనుగోలు చేయడం.

ఇందుకోసం విదేశీ బ్యాంకుల నుంచి నిధులు సమీకరించే అవకాశం ఉంది. మరో ప్రత్యామ్నాయం ఎస్పీ గ్రూప్ వాటాను బయటి పెట్టుబడిదారుడికి విక్రయించడం. ముఖ్యంగా అంతర్జాతీయ పెట్టుబడిదారుడికి విక్రయించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న చర్చలు తప్పనిసరిగా ఒప్పందానికి దారితీస్తాయని చెప్పలేమని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. చర్చలు ముందుకు సాగుతున్న కొద్దీ ప్రతిపాదిత లావాదేవీ నిర్మాణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపాయి. ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన సవాలు టాటా సన్స్ విలువను నిర్ణయించడమేనని నిపుణులు భావిస్తున్నారు. టాటా గ్రూప్‌లోని అనేక కీలక




సంస్థలను టాటా సన్స్ నియంత్రిస్తోంది. ఎయిర్ ఇండియా, ఐఫోన్ తయారీ సంస్థ టాటా ఎలక్ట్రానిక్స్ వంటి అనేక పెద్ద అన్‌లిస్టెడ్ కంపెనీలు కూడా టాటా సన్స్ పరిధిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో టాటా సన్స్‌కు సరైన విలువను నిర్ణయించడం, తద్వారా ఎస్పీ గ్రూప్‌కు చెందిన 18.4 శాతం వాటాకు న్యాయమైన విలువ కేటాయించడం అత్యంత క్లిష్టమైన అంశంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. న్యాయ, నియంత్రణ అంశాలపై పరిశీలషేర్ స్వాప్ ప్రతిపాదనలో టాటా పవర్ వంటి లిస్టెడ్ టాటా కంపెనీల షేర్లు ఉండే అవకాశం ఉన్నందున, దీనికి సంబంధించిన చట్టపరమైన, నియంత్రణపరమైన అంశాలను కూడా ఇరు వర్గాలు పరిశీలిస్తున్నాయి. ఎస్పీ గ్రూప్‌కు తక్షణం నిధులు సమీకరించి రుణభారం తగ్గించుకోవాల్సిన అవసరం ఉండగా, టాటా గ్రూప్ ప్రయోజనాలు, ఇతర వాటాదారుల ఆందోళనలు, నియంత్రణ సంస్థల నిబంధనలు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.



## భారత్ మార్కెట్లకు ఫెడ్ ఛైర్మన్ ఎఫెక్ట్!

**న్యూఢిల్లీ,ఆగస్టు, 29:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ జాక్సన్ హోల్ సింపోజియంలో చేసిన తాజా వ్యాఖ్యలు అంతర్జాతీయ మార్కెట్లలో కలకలం రేపుతున్నాయి. వార్ష్ చేసిన కఠిన వైఖరి వ్యాఖ్యలతో సెప్టెంబర్‌లో ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చన్న అంచనాలు పెరిగాయి. ఫెడ్ రేట్లు ఎక్కువ కాలం అధిక స్థాయిలో కొనసాగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులఅంచనా. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు , రూపాయి మారకం విలువ, భారత బాండ్ రాబడులపై ప్రభావాన్ని నిశితంగా గమనించాల్సి ఉంటుంది. అమెరికాలో వడ్డీ రేట్లు ఎక్కువ కాలం అధికంగా కొనసాగితే అక్కడి ఆస్తులు పెట్టుబడిదారులకు మరింత ఆకర్షణీయంగా మారతాయి. దీంతో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు నిధులను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఫలితంగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ నిధుల ప్రవాహం తగ్గే ప్రమాదం ఉంది. అదే సమయంలో బలపడే అమెరికా డాలర్ భారత రూపాయిపై అదనపు ఒత్తిడిని తీసుకురావచ్చు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత బలహీనపడే అవకాశం ఉంటుందన్న అంచనాలున్నాయి. అమెరికా బాండ్ రాబడులు పెరిగితే భారత్‌లోనూ బాండ్ రాబడులు పైకి వెళ్లే అవకాశం ఉంది. ఫెడ్ రేట్ల పెంపు అంచనాలు బంగారం ధరలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.